నమ్మి రానిస్తే..నట్టేట ముంచిన స్నేహితుడు

చోరీ కేసు దర్యాప్తులో బయటపడ్డ విషయం
రూ.17.60 లక్షల నగదు,కారు స్వాధీనం
కరీంనగర్ క్రైమ్ ప్రభాతవార్త:



చిన్ననాటి స్నేహితుడు అని నమ్మి ఇంటికి రానిస్తే నట్టేట ముంచిన ఘరానా ఘనుడి బాగోతం బట్టబయలైంది. ఒక చోరీ కేసు దర్యాప్తు చేసేందుకు వెళ్లిన పోలీసులకు అనుమానాస్పదంగా కనిపించిన వ్యక్తి గురించి ఆరా తీస్తే అసలు విషయం వెలుగు చూసింది. అవసరానికి కోసం పనికొస్తాయని భూమి అమ్ముకొని నగదు ఇంట్లో పెట్టుకుంటే ఇంటికి వచ్చిన స్నేహితుడే కాజేసి పరారైన వ్యవహారం అంతా బయటపడింది. చివరికి నిందితుడు పోలీసులకు చిక్కడంతో అరెస్టు చేసిన పోలీసులు మీడియా ముందు హాజరు పరిచి సిపి గౌస్ ఆలం వివరాలు వెల్లడించారు. కరీంనగర్ రూరల్ మండలం తీగల గుట్టపల్లి కి చెంది గుడిమల్ల శ్రీనివాస్ డిప్యూటీ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ గా పనిచేస్తున్నాడు. ఇటీవల తన వ్యవసాయ భూమి అమ్మగా వచ్చిన రూ.26 లక్షలను ఇంట్లో భద్రంగా దాచుకున్నాడు. మంథని మండలం ఎక్లాస్పూర్ కు చెందిన శ్రీనివాస్ కు అదే గ్రామానికి చెందిన శంకర్ లాల్ చిన్ననాటి స్నేహితుడు కావడంతో కరీంనగర్ కు వచ్చినప్పుడల్లా ఇంటికి వస్తుండేవాడు. చిన్నప్పటి నుంచి ఉన్న పరిచయంతో శ్రీనివాస్ ఇంట్లో లేకపోయినా శంకర్ లాల్ కోసం తాళం చెవి భద్రపరిచేవాడు. ప్రజా ప్రతినిధిగా పనిచేసి ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న శంకర్ లాల్ అవసరాల కోసం అడ్డదారుల్లో పయనించాడు. భూమి అమ్మితే వచ్చిన డబ్బులు శ్రీనివాస్ దగ్గర ఉన్నాయని గ్రహించి ఓ మహిళతో కలిసి వాటిని కాజేసేందుకు పథకం రచించాడు. రేష్మ అనే మహిళతో కలిసి జూన్ నెలలో శ్రీనివాస్ ఇంటికి వచ్చి శ్రీనివాస్ అందుబాటులో లేకపోవడంతో అదునుగా భావించి తాళాలు పగులగొట్టి లోపలికి ప్రవేశించి నగదును దోచుకెళ్లారు.దొంగిలించిన డబ్బుతో శంకర్ లాల్ స్విఫ్ట్ కారు కూడా కొనుగోలు చేశాడు. శ్రీనివాస్ ఇంటిలోనే కింది పోర్షన్లో గతంలో జరిగిన లాప్టాప్ చోరి కేసులో దర్యాప్తు చేసేందుకు వెళ్లిన పోలీసులకు శంకర్ లాల్ అనుమానాస్పదంగా వచ్చి పోయే సీసీ ఫుటేజ్ లభ్యమయింది. విచారణలో శ్రీనివాస్ ఇంట్లో చోరీ కూడా బయటపడడంతో శంకర్ లాల్ నిందితుడిగా గుర్తించి అతని కోసం గాలింపు చేపట్టారు. ఈ క్రమంలో నిందితుడు బొమ్మకల్ బస్ స్టాప్ వద్ద వాహన తనిఖీల్లో పట్టుపడ్డాడు. విచారణ అనంతరం అతని వద్ద నుంచి రూ.17,60,000 నగదు, స్విఫ్ట్ కారు, సెల్ ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. కేసు దర్యాప్తులో కీలకంగా వ్యవహరించి నిందితులను పట్టుకున్న రూరల్ ఏసిపి విజయ్ కుమార్ ,ఇన్స్పెక్టర్ నిరంజన్ రెడ్డి బృందాన్ని సిపి ప్రత్యేకంగా అభినందించారు.

ఒక్క వర్షానికే అతలాకుతలం

అభివృద్ధి పేరుతో బడాయి మాటలే మిగిలాయని మాజీ కార్పొరేటర్
నగునూరి సుమలత రాజు విమర్శ

గోదావరిఖని, ప్రభాతవార్త:



రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో అభివృద్ధి పనులపై అధికార పార్టీ నాయకులు చేస్తున్న ప్రచారం ఒక్క వర్షానికే నీరుగారిపోయిందని మాజీ కార్పొరేటర్ నగునూరి సుమలత రాజు విమర్శించారు. కోట్లాది రూపాయలతో అభివృద్ధి చేశామని చెప్పుకుంటున్న పాలకులు, ఒక మోస్తరు వర్షానికే గోదావరిఖనిలోని పలు కాలనీలు జలమయం కావడంపై ప్రజలకు సమాధానం చెప్పాలని ఆమె డిమాండ్ చేశారు.బుధవారం కురిసిన వర్షంతో గోదావరిఖని పట్టణంలోని పలు లోతట్టు ప్రాంతాలు, కాలనీలు నీటమునిగిన నేపథ్యంలో ఆమె స్పందించారు. అభివృద్ధి పేరుతో భారీ ప్రకటనలు చేస్తున్న పాలకుల మాటలకు, క్షేత్రస్థాయిలో కనిపిస్తున్న పరిస్థితులకు ఎలాంటి పొంతన లేదని అన్నారు. ప్రజలు ప్రతిరోజూ ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించకుండా ప్రచారానికే పరిమితమవడం బాధాకరమని పేర్కొన్నారు.గత కొన్నేళ్లుగా రామగుండం అభివృద్ధికి వందల కోట్ల రూపాయలు ఖర్చు చేశామని అధికార పార్టీ నాయకులు చెబుతున్నారని, అయితే వాస్తవ పరిస్థితి మాత్రం అందుకు పూర్తి భిన్నంగా ఉందని సుమలత రాజు విమర్శించారు. కనీసం వర్షపు నీరు సాఫీగా వెళ్లేలా సమర్థవంతమైన డ్రైనేజీ వ్యవస్థను కూడా ఏర్పాటు చేయలేకపోవడం పాలకుల వైఫల్యానికి నిదర్శనమని అన్నారు. ఒక్క వర్షానికే ప్రధాన రహదారులు, కాలనీలు చెరువులను తలపించడం అభివృద్ధి పనుల నాణ్యతపై అనుమానాలు కలిగిస్తోందని పేర్కొన్నారు.వర్షాకాలానికి ముందు నాలాల పూడికతీత, డ్రైనేజీ కాలువల శుభ్రపరిచే పనులు చేపట్టాల్సి ఉన్నప్పటికీ అవి కేవలం కాగితాలకే పరిమితమయ్యాయని ఆరోపించారు. అధికారులు ముందస్తు ప్రణాళికతో పనిచేసి ఉంటే ప్రజలు ఇంతటి ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన పరిస్థితి వచ్చేదే కాదన్నారు. వర్షపు నీరు ఇళ్లలోకి చేరడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడటమే కాకుండా, రాకపోకలు స్తంభించాయని, వ్యాపారాలు కూడా దెబ్బతిన్నాయని చెప్పారు.అభివృద్ధి పేరుతో వెయ్యి కోట్ల రూపాయలకు పైగా ఖర్చు చేశామని ప్రచారం చేస్తున్న పాలకులు, ఆ నిధులు ఎక్కడ ఖర్చయ్యాయో ప్రజలకు వివరించాలని సుమలత రాజు డిమాండ్ చేశారు. ఇప్పటివరకు చేపట్టిన అభివృద్ధి పనుల వివరాలు, వాటికి వెచ్చించిన నిధులపై శ్వేతపత్రం విడుదల చేయాలని కోరారు. పారదర్శకతతో వ్యవహరిస్తే ప్రజలకు వాస్తవాలు తెలిసే అవకాశం ఉంటుందన్నారు.ప్రజలకు ఇబ్బందులు కలిగించే ముంపు సమస్యకు తాత్కాలిక పరిష్కారాలు కాకుండా శాశ్వత చర్యలు తీసుకోవాలని ఆమె సూచించారు. పట్టణంలోని లోతట్టు ప్రాంతాల్లో సమగ్ర డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేయడంతో పాటు, వర్షపు నీరు వేగంగా బయటకు వెళ్లేలా కాలువలను విస్తరించాలని కోరారు. భవిష్యత్తులో ఇలాంటి పరిస్థితులు పునరావృతం కాకుండా శాస్త్రీయ ప్రణాళికతో పనులు చేపట్టాలని అన్నారు.అభివృద్ధి పేరుతో ప్రజలను తప్పుదోవ పట్టించడం కంటే, క్షేత్రస్థాయిలో సమస్యలను పరిష్కరించడంపైనే పాలకులు దృష్టి సారించాలని సుమలత రాజు హితవు పలికారు.

మైనర్ బాలికపై అసభ్య ప్రవర్తన నిందితుడికి 3 ఏళ్ల జైలు శిక్ష

జగిత్యాల,రూరల్ ప్రభాతవార్త: మైనర్ బాలిక పట్ల అసభ్యంగా ప్రవర్తించిన కేసులో నిందితుడికి మూడేళ్ల జైలు శిక్షతో పాటు 6,500 రూపాయల జరిమానా విధిస్తూ జగిత్యాల ఫాస్ట్ ట్రాక్ స్పెషల్ పోక్సో కోర్టు సమగ్ర తీర్పును వెలువరించింది.ఈ మేరకు ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ సెషన్స్ జడ్జి రత్న పద్మావతి తీర్పునిచ్చారు.అంతేగాక,బాధిత మైనర్ బాలికకు 50,000 వేల రూపాయల పరిహారం చెల్లించాలని న్యాయస్థానం ఆదేశించింది.కేసు వివరాల్లోకి వెళితే జగిత్యాల మండలం రూరల్ పోలీస్ స్టేషన్ పరిధికి చెందిన ఓ మైనర్ బాలిక పట్ల మందుల రాజేష్ అనే వ్యక్తి అసభ్యంగా ప్రవర్తించడంతో,బాధితుల ఫిర్యాదు మేరకు 2024లో పోక్సో చట్టం కింద పోలీసులు కేసు నమోదు చేశారు.అప్పటి డీఎస్పీ రఘు చందర్, ఎస్ఐ సదాకర్ శాస్త్రీయ దృక్పథంతో దర్యాప్తు చేపట్టి,నిందితుడికి వ్యతిరేకంగా బలమైన ఆధారాలను ఫాస్ట్ ట్రాక్ కోర్టుకు సమర్పించారు. న్యాయవిచారణలో భాగంగా పబ్లిక్ ప్రాసిక్యూటర్ రామకృష్ణ రావు,కోర్టు డ్యూటీ అధికారులు సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టారు. సాక్ష్యాధారాలను,వాదనలను క్షుణ్ణంగా పరిశీలించిన న్యాయమూర్తి నేరం రుజువు కావడంతో నిందితుడికి శిక్ష ఖరారు చేశారు.ఈ కేసులో నిందితుడికి శిక్ష పడేలా దర్యాప్తును వేగవంతం చేసి,కోర్టులో సరైన సాక్ష్యాధారాలు ప్రవేశపెట్టిన పీపీ రామకృష్ణ రావు,ఇన్వెస్టిగేషన్ ఆఫీసర్ డీఎస్పీ రఘు చందర్,నాటి ఎస్ఐ సదాకర్,సీఎమ్ఎస్ ఎస్ఐ శ్రీకాంత్,కోర్టు కానిస్టేబుల్ నరేష్,సీఎమ్ఎస్ కానిస్టేబుల్ శ్రీధర్‌లను,కోర్టు సిబ్బందిని జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ప్రత్యేకంగా అభినందించారు.

మెట్‌పల్లిలో అర్ధరాత్రి ఘోర ప్రమాదం

-బొలెరో ఢీకొని మహిళా మృతి

మెట్‌పల్లి డివిజన్, ప్రభాతవార్త:



జగిత్యాల జిల్లా మెట్‌పల్లి పట్టణంలో బుధవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ గుర్తుతెలియని మహిళ మృతి చెందింది.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జూలై 29న రాత్రి సుమారు 1 గంట సమయంలో నిజామాబాద్ వైపు నుంచి వస్తున్న బొలెరో వాహనం (నంబర్: ఏం హెచ్47 ఎఎస్ 2287) డ్రైవర్ అతివేగంగా, అజాగ్రత్తగా వాహనాన్ని నడుపుతూ మెట్‌పల్లి డిపో సర్కిల్ పరిధిలో రహదారి పక్కన ఉన్న ఓ పాన్ షాప్‌ను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో పాన్ షాప్ శకలాలు సమీపంలో నిద్రిస్తున్న ఓ గుర్తుతెలియని మహిళపై పడటంతో ఆమె తలకు, శరీరంలోని ఇతర భాగాలకు తీవ్ర గాయాలయ్యాయి.స్థానికులు, పోలీసులు వెంటనే స్పందించి క్షతగాత్రురాలిని చికిత్స నిమిత్తం జగిత్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ ఆమె మృతి చెందింది. మృతురాలి వివరాలు ఎవరికైనా తెలిసి ఉంటే వెంటనే మెట్‌పల్లి పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని మెట్ పల్లి ఎస్ ఐ కిరణ్ కుమార్ కోరారు.

నేరాలు-దారుణాలు

దోపిడీ కేసులో వీడిన చిక్కుముడి

అల్లుడు, మనుమడే ప్రధాన సూత్రధారులు
మీరట్‌కు చెందిన ముగ్గురు నిందితుల అరెస్ట్

కరీంనగర్ క్రైమ్, ప్రభాతవార్త:

నగరంలోని భగత్‌నగర్‌లో జరిగిన దోపిడీ కేసులో ఎట్టకేలకు చిక్కుముడి వీడింది. ఈ కేసులో బాధితుని అల్లుడు మనవడే ప్రధాన సూత్రధారిగా బయటపడింది. ఈ దోపిడి కేసులో ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని మీరట్‌కు చెందిన ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసి, వారి వద్ద నుంచి రూ.2,09,000 నగదు, 43.67 గ్రాముల బంగారు ఆభరణాలు, 64.98 గ్రాముల వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన నిందితుల వివరాలు ను సిపి గౌస్ ఆలం మీడియాకు ప్రకటన ద్వారా విడుదల చేశారు.భగత్‌నగర్‌కు చెందిన ఎం.డి. అజ్మత్ అలీ నివాసంలో ఈనెల 21న అర్ధరాత్రి సమయంలో దుండగులు దమ్మీ పిస్టళ్లు, కత్తులతో చొరబడి కుటుంబ సభ్యులను బెదిరించి దోపిడీకి పాల్పడ్డారు.బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన వన్ టౌన్ పోలీసులు వివిధ కోణాల్లో దర్యాప్తు ప్రారంభించారు. ఘటనా స్థలం, నిందితులు పారిపోయిన మార్గాల్లోని సీసీటీవీ ఫుటేజీలను క్షుణ్ణంగా పరిశీలించారు. సాంకేతిక ఆధారాల ద్వారా నిందితులు ఉత్తరప్రదేశ్‌లోని మీరట్‌కు చెందిన వారని పోలీసులు నిర్ధారించారు. నిందితుల కోసం ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి గాలింపులు చేపట్టి యూపీ పోలీసుల సహకారం తీసుకున్నారు. కరీంనగర్ నుంచి వెళ్లిన ప్రత్యేక బృందం పోలీసుల నుంచి తప్పించుకునేందుకు రైల్వే స్టేషన్‌కు వెళ్తున్న ముగ్గురు నిందితులను జూలై 29న అదుపులోకి తీసుకున్నారు. పట్టుబడిన వారిలోసల్మాన్/భూరేన్/యాదవ్ (22), సల్మాన్ /విమాన్ (22), మొహమ్మద్ హసీన్ (19) లో ఉన్నారు. వీరి వద్ద నుండిరూ.2,09,000 నగదు,43.67 గ్రాముల బంగారు ఆభరణాలు 64.98 గ్రాముల వెండి ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారు.దర్యాప్తులో బాధితుడు ఎం.డి. అజ్మత్ అలీ సొంత అల్లుడు రజావుద్దీన్ , మనుమడు అజీమ్ రజా ఈ దోపిడీకి ప్రధాన సూత్రధారులుగా గుర్తించారు. అరెస్టయిన ముగ్గురు నిందితులను మీరట్ న్యాయస్థానంలో హాజరుపరిచి ట్రాన్సిట్ వారెంట్‌పై కరీంనగర్‌కు తీసుకు వస్తున్నట్లు సీపీ తెలిపారు. పరారీలో ఉన్న ప్రధాన నిందితులు రజావుద్దీన్ , అజీమ్ రజా తో పాటు ఇతర నిందితుల కోసం ప్రత్యేక పోలీసు బృందాలు ముమ్మరంగా గాలింపు చర్యలు కొనసాగిస్తున్నామన్నారు.

తాళం వేసిన ఇంట్లో దొంగతనం

8 తులాల బంగారం,15 తులాల వెండి, 25 వేల నగదు అపహరణ
దొంగలు తలుపులు తెరిచి ఉంచడంతో ఇంట్లో కోతుల బీభత్సం

గంభీరావుపేట, ప్రభాతవార్త:





తాళం వేసిన ఇంట్లో దొంగతనం జరిగిన సంఘటన బుధవారం గంభీరావుపేట మండల కేంద్రంలో వెలుగు చూసింది. గుర్తు తెలియని దొంగలు ఇంటికి వేసిన తలాన్ని పగలగొట్టి ఇంట్లోనే ఎనిమిది తులాల బంగారు ఆభరణాలు, 15 తులాల వెండి, రూ. 25 వేల నగదును ఎత్తుకెళ్లారు. వివరాల్లోకి వెళితే ఇంటి యజమాని పత్తి స్వామి తన మామ ఆరోగ్యం బాగు లేక ఇంటికి తాళం వేసి రెండు రోజుల క్రితం కరీంనగర్ ఆసుపత్రికి వెళ్లారు. ఇంటికి తాళం వేసి ఉండడంతో ఇదే అదునుగా భావించిన దొంగలు తాళాలు పగలగొట్టి చోరీకి పాల్పడ్డారు. ఇంట్లోకి కోతులు ప్రవేశించడాన్ని చూసిన ఇంటి ముందు వ్యక్తులు ఇంటి యజమానికి సమాచారం అందించారు. విషయం తెలుసుకుని హుటాహుటిన ఇంటికి రావడంతో ఇంటికి వేసిన తాళం పగలగొట్టింది చూసి ఇంటి యజమాని పోలీసులకు సమాచారం అందించారు. ఘటన స్థలాన్ని డిఎస్పి నాగేంద్ర చారి, సిఐ వెంకటేష్, స్థానిక ఎస్సై శ్రీకాంత్ లు పరిశీలించారు. తాళం పగలగొట్టి లోపలికి వెళ్లిన తీరును ఇంటి పరిసరాలను పర్యవేక్షించారు. ఇంటిముందు పరిసరాల్లో ఉన్న సిసి ఫుటేజ్ లను పోలీస్ సిబ్బంది క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. ఇంట్లో కోతుల బీభత్సంగుర్తు తెలియని వ్యక్తులు ఇంటికి వేసిన తాళం పగలగొట్టి దోపిడీకి పాల్పడగా, మరోవైపు తలుపులు తెరిచి ఉండడం కోతుల మంద ఇంట్లోకి ప్రవేశించి నానా బీభత్సం సృష్టించాయి. ఇంట్లోని తినుబండారాలు వస్తువులను కోతులు చిందర వందర చేశాయి.

సకాలంలో స్పందించిన పోలీసులు

మేడిపల్లి/ భీమారం :

నిన్న రాత్రి కురిసిన భారీ వర్షం, ఈదురు గాలుల ప్రభావంతో మేడిపల్లి మండల కేంద్రంలోని జాతీయ రహదారి ఎన్‌హెచ్63పై బుధవారం తెల్లవారు జామున సుమారు 5 గంటల సమయంలో ఓ భారీ వృక్షం కూలి రహ దారికి అడ్డంగా పడింది. అదే సమయంలో పెట్రోలింగ్ నిర్వహిస్తున్న మేడిపల్లి పోలీసులు ఈ ఘటనను గమనించి వెంటనే అప్రమత్తమై స్పందించడంతో పెను ప్రమాదం తప్పింది. సిబ్బంది ఏమాత్రం ఆలస్యం చేయకుండా జేసీబీ యజమానులు జలంధర్, మహేష్ సహకారంతో చెట్టును తొలగించి రహదారిని పూర్తిగా క్లియర్ చేశారు. దీంతో వాహనాల రాకపోకలు సజావుగా పునరుద్ధరించబడ్డాయి. సమయానికి స్పందించకపోయి ఉంటే జాతీయ రహదారిపై ప్రమాదం జరిగే అవకాశం ఉండేదని స్థానికులు పేర్కొన్నారు. విధి నిర్వహణలో అప్రమత్తత, చొరవ ప్రదర్శించి ప్రమాదాన్ని నివారించిన పోలీసు సిబ్బంది నాగరాజును మేడిపల్లి మండల ఎస్సై శ్రీధర్



రెడ్డి ప్రత్యేకంగా అభినందించారు. ప్రజల భద్రతే పోలీసుల ప్రధాన బాధ్యత అని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎస్సై శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ రానున్న రెండు రోజుల పాటు భారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అవసరం లేకుంటే భారీ వర్షాల సమయంలో ప్రయాణాలు వాయిదా వేసుకోవాలని, రహదారులపై చెట్లు, విద్యుత్ స్తంభాలు, నీటి ప్రవాహాల వద్ద జాగ్రత్తగా వ్యవహరించాలని తెలిపారు. ఎక్కడైనా అత్యవసర పరిస్థితులు లేదా ప్రమాదకర పరిస్థితులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.

మనసారా మనసారే మహోత్సవం

కోరుట్ల, ప్రభాతవార్త :



ఆషాఢ మాసోత్సవాల్లో భాగంగా కోటి నవదుర్గ అమ్మవారి "మనసారా మన సారే" మహోత్సవం వైభవంగా నిర్వ హించారు. ఈ మహోత్సవంలో భాగంగా వందలాది మంది మహిళలు సంప్రదాయ వస్త్రధారణలో, మంగళ వాయిద్యాల నడుమ శోభాయాత్రగా దేవాలయానికి చేరుకుని అమ్మవారికి అత్యంత భక్తిశ్రద్ధలతో 108 రకాల విశేష మంగళ ద్రవ్యాలను "మనసారా మన సారే"గా సమర్పించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు బ్రహ్మశ్రీ దేగామ ప్రదీప్ శర్మ, బ్రహ్మశ్రీ శ్రీధర్ శర్మ లు ఆలయంలో శాస్త్రోక్తంగా ప్రత్యేక వైదిక కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం భక్తులందరి భాగస్వామ్యంతో సామూహిక శ్రీ లలితా సహస్రనామ పారాయణం



నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి సంఘం అధ్యక్షులు గుంటుక ప్రసాద్, ఆలయ కమిటీ చైర్మన్ జిల్లా ధనంజయ్, యువత అధ్యక్షులు జక్కుల ప్రవీణ్ కుమార్ లలిత పారాయణ బృందం సభ్యులు ఆడెపు శశికళ, ఆడెపు కమల, కొత్త శోభ, చింతగింది మంజుల, నాగమణి, కడకుంట్ల లీలావతి, గుంటుక సురేఖ, అడెపు గీత, పసునూరి మమత, రేగుంట విజయ, ఆదిలక్ష్మి, జక్కుల సొజ న్యపద్మశాలి సంఘం, యువత కమిటీ సభ్యులు, ఆలయ కమిటీ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

కోరుట్లలో భారీ వర్షం

సుమారు 88.80 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు

కోరుట్ల, ప్రభాతవార్త :



వర్షాకాలం ప్రారంభమైనప్పటి నుంచి కోరుట్ల పట్టణంలో సరైన వర్షాలు లేకపోవడం, భూగర్భ జలాలు ఎండిపోయి తాగునీటికి కటకట ఏర్పడడంతో ప్రజలు నానా అవస్థలు పడ్డారు. కోరుట్ల పట్టణంలో మంగళవారం రాత్రి నుంచి బుధవారం వరకు ఎడతెరపి లేకుండా వర్షం కురవడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. కోరుట్ల లో మంగళవారం రాత్రి నుంచి వర్షం కురవగా ఉదయం ఏడు గంటల వరకు సుమారు 88.80 మిల్లీమీటర్ల వర్షం నమోదు కాగా, సాయంత్రం 5 గంటల వరకు 24.3 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయింది. పట్టణంలో రాత్రి కురిసిన భారీ వర్షానికి ముత్యాల వాడ, గోవిందగిరి కాలనీ, ప్రకాశం రోడ్డు ఏరియాలో కాలనీలు జలమయ





మయ్యాయి. కోరుట్ల పట్టణంలోని పుల్ వాగు ఉధృతంగా ప్రవహిస్తుంది. కోరుట్ల పట్టడంతో పాటు మండలంలోని పలు గ్రామాల్లో సైతం భారీ వర్షాలు కురవగా కాలువలు ఏరులై పారాయి. ఒక్కసారిగా భారీ వర్షం కురవడంతో ఇటు రైతులు అటు ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మరో రెండు రోజుల పాటు భారీ వర్షాలు కురుస్తాయని అధికారులు తెలుపుతుండడంతో లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పలు హెచ్చరికలు చేస్తున్నారు.

ఓటర్ల వివరాల డిజిటలైజేషన్‌ను వేగవంతం చేయాలి

రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సీ సుదర్శన్ రెడ్డి

జిల్లా ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్

పెద్దపల్లి జిల్లా బ్యూరో, ప్రభాతవార్త: ఓటర్ల వివరాల డిజిటలైజేషన్‌ను వేగవంతం చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సీ సుదర్శన్ రెడ్డి తెలిపారు. బుధవారం హైదరాబాద్ నుంచి ఎస్ఐఆర్ కార్యక్రమం పురోగతి, ఓటర్ల వివరాల డిజిటలైజేషన్, డేటా నమోదు, పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ అంశాలపై జిల్లా ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సమీకృత జిల్లా కలెక్టరేట్ ఐడీఓసీ నుంచి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష, అదనపు కలెక్టర్ శ్రీరాములుతో కలిసి పాల్గొంటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముసాయిదా ఓటరు జాబితా ప్రచురణకు 4 నుంచి 5 రోజుల సమయం మాత్రమే మిగిలి ఉందన్నారు. ఓటర్ల నుంచి సేకరించిన ఎన్యూమరేషన్ ఫారాలను వెంటనే డిజిటలైజ్ చేయాలని ఆదేశించారు. బీఎల్ఓలు నమోదు చేసిన ప్రతి వివరాన్ని ఈఆర్ఓలు, సూపర్‌వైజర్లు క్రాస్ వెరిఫై చేసి లోపాలను 2 రోజుల్లోగా సరిదిద్దాలని స్పష్టం చేశారు. పొరపాట్లు జరిగితే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పట్టణ ప్రాంతాల్లో ప్రక్రియను వేగవంతం చేసి రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ జిల్లాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. రాష్ట్రంలో 8 నియోజకవర్గాల్లో 100 శాతం, 80 నియోజకవర్గాల్లో 90 శాతానికి పైగా డిజిటలైజేషన్ పూర్త యిందన్నారు. ఎస్ఐఆర్ వల్ల సంక్షేమ పథకాలపై ప్రభావం పడుతుందనే తప్పుడు ప్రచారాన్ని ఖండించాలని, రాజకీయ పార్టీలతో సమావేశాలు నిర్వహించాలని ఆదేశించారు. ముసాయిదా జాబితాను బీఎల్ఏలకు అందజేసి సంతకాలు తీసుకోవాలని తెలిపారు. ఈ సమావేశంలో అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కోరుట్ల వార్త



సీఐ లక్ష్మీనారాయణకు సన్మానం

కోరుట్ల టౌన్, ప్రభాతవార్త :



కోరుట్ల సర్కిల్ ఇన్స్పెక్టర్ లక్ష్మీనారాయణ ను మెట్పల్లి లయన్స్ క్లబ్ అధ్యక్షుడు వెలమ శ్రీనివాసరావు బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సీఐ కు పూల బొకే అందజేసి ఘనంగా సన్మానించారు.

గురు స్వాములకు సన్మానం

కోరుట్ల, ప్రభాతవార్త :



గురు పౌర్ణమి పురస్కరించుకొని కోరుట్ల పట్టణంలోని కంటేశ్వర సేవా సమితి ఆధ్వర్యంలో అయ్యప్ప స్వామి దేవాలయ గౌరవ అధ్యక్షులు చిద్రాల నారాయణ గురు స్వామి, కంటేశ్వర సేవా సమితి గురుస్వామి ఎలిమిల్ల రాజగోపాల్ (సాయిరాం స్వామి) లకు శాలువాతో సత్కరించి గురు పౌర్ణమి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏం. శంకర్ గౌడ్, ఏ. వెంకటేశ్వరరావు, కే. జితేందర్, గందె నవీన్, గుడిసె కోటేశ్వర్ లు పాల్గొన్నారు

సర్ పై రాజకీయ పార్టి ప్రతినిధులకు సమావేశం

కోరుట్ల, ప్రభాతవార్త :



కోరుట్ల పట్టణంలోని ఆర్డీవో కార్యాలయంలో సర్ పై కోరుట్ల నియోజక వర్గ స్థాయి గుర్తింపు పొందిన రాజకీయ పార్టి ప్రతినిధులకు సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో జీవాకర్ రెడ్డి మాట్లాడుతూ ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ లో భాగంగా బిఎల్ఓ, బిఎల్ఏ సమావేశం నిర్వహించి సంబంధిత పోలింగ్ స్టేషన్ లలో మరణించిన వారు, డబుల్ ఓటర్లు, వలస వెళ్ళిన వారిని గుర్తించాలన్నారు. మిగిలిపోయిన ఓటర్ల ను ఏనుమేరేషన్ ఫార్మ్ డిజిటలిజషన్ చేసి 100 పూర్తి చేయగలరన్నారు. ఈ సమావేశంలో కోరుట్ల నియోజకవర్గం మండలాల తహసిల్దార్లు కృష్ణ చైతన్య, కోరుట్ల, ఎన్. నీతా, రాంచందర్, ప్రసాద్ నాయబ్, ఎండీ . ఫారుఖ్ నాయబ్ రాజకీయ పార్టి ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

వర్షంలోనూ ప్రజాక్షేమమే ధ్యేయం

తుంగూరు చెరువులు, మత్తడులను పరిశీలించిన సర్పంచ్ రాజగోపాల్ రావు

బీర్ పూర్ ప్రభాత వార్త.జగిత్యాల జిల్లా బీర్‌పూర్ మండలంలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో గ్రామ ప్రజలకు ఎలాంటి కష్టం రాకుండా చూడటమే ధ్యేయంగా తుంగూరు గ్రామ సర్పంచ్ రాజగోపాల్ రావు తన ప్రజా నిబద్ధతను చాటుకున్నారు. కుండపోత వర్షాన్ని సైతం లెక్కచేయకుండా బుధవారం ఉదయాన్నే తన పాలకవర్గంతో కలిసి గ్రామంలోని చెరువులు, కుంటలు మరియు మత్తడి పరిసర ప్రాంతాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఇటీవల నూతనంగా నిర్మిస్తున్న శ్రీ రాజరాజేశ్వర స్వామి గుడి వద్దగల మత్తడి బ్రిడ్జి పరిసరాల్లో చుట్టుపక్కల పొలాల నుంచి వరద నీరు ఎక్కువగా ప్రవహిస్తుండటంతో, నిర్మాణంలో ఉన్న బ్రిడ్జి వద్ద వరద ఉధృతిని ఆయన దగ్గరుండి పర్యవేక్షించారు. అలాగే గ్రామంలోని చెరువుల నీటిమట్టాన్ని, తూముల పరిస్థితిని నిశితంగా పరిశీలిస్తూ, అత్యవసర సమయాల్లో తూములు మరియు చెరువు గేట్లకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తుగా పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. ఎమ్మెల్యే సంజయ్ కుమార్ వరదల పరిస్థితిని గురించి నిత్యం తెలుసుకుంటు తగు సూచనలు చేశారని వారి సూచనల మేరకు గ్రామ పాలకవర్గం అప్రమత్తంగా ఉందని



వరద వల్ల ఎలాంటి అత్యవసర పరిస్థితి ఎదురైనా ఎదుర్కొనేందుకు గ్రామపంచాయతీ పాలకవర్గం పూర్తి అప్రమత్తంగా ఉందని స్పష్టం చేశారు. వర్షాల ఉధృతి దృష్ట్యా గ్రామ ప్రజలు, ముఖ్యంగా వ్యవసాయదారులు చెరువులు, కుంటలు, మత్తడి ప్రాంతాలకు వెళ్లకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఏ చిన్న సమస్య వచ్చినా వెంటనే గ్రామపంచాయతీ పాలకవర్గాన్ని గానీ, అధికారులను గానీ సంప్రదించాలని కోరారు. వర్షంలో సైతం స్వయంగా రంగంలోకి దిగి నిత్యం గ్రామాన్ని, ప్రజల క్షేమాన్ని పర్యవేక్షిస్తున్న సర్పంచ్ రాజగోపాల్ రావు మరియు పాలకవర్గం పనితీరుపై తుంగూరు గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ కొనియాడుతున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ రాజగోపాల్ రావు, ఉప సర్పంచ్ శీలం లింగన్న,వార్డు మెంబర్ బండారి తిరుపతి మరియు గ్రామస్తులు పాలకవర్గం పాల్గొన్నారు.

భారీ వర్షాల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలి

-జిల్లా కలెక్టర్‌ను కోరిన ఎంపీ ధర్మపురి అర్వింద్

జగిత్యాల బ్యూరో ప్రభాత వార్త:జగిత్యాల జిల్లాలో కురుస్తున్న భారీ



వర్షాల నేపథ్యంలో జిల్లా కలెక్టర్‌ను పలు కీలక అంశాలపై నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ విజ్ఞప్తి చేశారు. పార్లమెంట్ సమావేశంలో పాల్గొంటున్న ఆయన, భారీ వర్షాల నేపథ్యంలో బుధవారం చరవాణి ద్వారా కలెక్టర్ తో మాట్లాడారు.మున్సిపల్, రెవెన్యూ, పంచాయతీరాజ్, ఆరోగ్య శాఖ, వాటర్ సప్లై, విద్యుత్ శాఖ, ఆర్ అండ్ బీ జాతీయ రహదారుల సంస్థ తో పాటు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని సూచించారు.అలాగే జిల్లాలోని చెరువులు, కుంటలు, ప్రాజెక్టుల బలహీనంగా ఉన్న కట్టలపై ప్రత్యేక దృష్టి సారించాలని, ఎప్పటికప్పుడు పరిస్థితిని పర్యవేక్షిస్తూ అవసరమైన రక్షణ చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్‌ను కోరారు. వాతావరణ శాఖ రానున్న రెండు రోజుల పాటు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరించిన నేపథ్యంలో జిల్లా యంత్రాంగం పూర్తిస్థాయిలో అప్రమత్తంగా ఉండి ముందస్తు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.లోతట్టు ప్రాంతాల్లోని ప్రజలకు నిత్యావసర వస్తువులు, స్వచ్ఛమైన తాగునీరు, వైద్య సేవలు తదితర సౌకర్యాలను అందుబాటులో ఉంచాలని కోరారు.ఈ సందర్భంగా ఎంపీ ధర్మపురి అర్వింద్ ప్రజలకు విజ్ఞప్తి చేస్తూ,అవసరమైతే తప్ప ఇళ్ల నుంచి బయటకు రావద్దని, వరద నీరు ప్రవహిస్తున్న ప్రాంతాలు, వాగులు, వంకలు దాటేందుకు ప్రయత్నించవద్దని, జిల్లా యంత్రాంగం జారీ చేసే సూచనలను తప్పనిసరిగా పాటిస్తూ అప్రమత్తంగా ఉండాలని కోరారు.

ఓదెలలో మడేలయ్యకు బోనాలు

ఓదెల,ప్రభాతవార్త:



ఓదెల మండల కేంద్రంలో రజకుల ఆరాధ్య దైవమైన మడేలేశ్వర స్వామికి ఘనంగా బోనాలు సమర్పించారు బుధవారం ఈ సందర్భంగా రజక సంఘం ఆధ్వర్యంలో మడలేశ్వర స్వామికి అంగరంగ వైభవంగా మహిళలు బోనాలతో డప్పు చప్పుల తో శివసత్తుల పూనకాలతో ముందుగా పోచమ్మ తల్లికి మొక్కులు చెల్లించుకుని వారి ఆరాధ్య దైవం అయిన మడేలయ్యా ఆలయానికి చేరుకొని బోనాలను సమర్పించి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వచ్చిన గ్రామ సర్పంచ్ కనికిరెడ్డి సతీష్ మాజీ సర్పంచ్ ఆకుల మహేందర్ ఉపసర్పంచ్ గోపతి శ్రీలత ప్రవీణ్ లను సంఘం ఆధ్వర్యంలో శాలువాలతో ఘనంగా సన్మానించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ ప్రజలందరూ పాడిపంటలతో ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో ఉండాలని ఆ స్వామిని కోరారు ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు పైడిపల్లి రమేష్, కార్యదర్శి చాతల్ల విష్ణు, సంగం పెద్దలు మేడిచెల్ముల చంద్రయ్య, రామడుగు వెంకటేష్, చాతల్ల రామస్వామి, రామడుగు రాములు, చాతల్ల శ్రీనివాస్, మడికొండ వీరయ్య, సమ్మయ్య, రామడుగు మొండి, చాతల్ల రవి, కుమారస్వామి, హరీష్, శ్రీనివాస్, రాజేశం, కుమార్,రాఖి,శ్రావణ్, వెంకటేష్,కిషన్,రాజశేఖర్ శ్రీనివాస్,రాము మహిళలు యువకులు పెద్దలు తదితరులు పాల్గొన్నారు

పాఠశాలల్లో వర్షపు నీటిని వెంటనే తొలగించాలి

సీపీఐ(ఎం) నాయకుడు కల్లెపల్లి అశోక్



పెద్దపల్లి, ప్రభాతవార్త: పాఠశాలల్లో నిలిచిన వర్షపు నీటిని వెంటనే తొలగించాలని సీపీఐ(ఎం) నాయకుడు కల్లెపల్లి అశోక్ డిమాండ్ చేశారు. బుధవారం భారీ వర్షాల కారణంగా రాఘవాపూర్ గ్రామంలోని 3 ప్రభుత్వ పాఠశాలల ప్రాంగణాల్లోకి వర్షపు నీరు చేరి పాఠశాలలు జలమయంగా మారిన ప్రదేశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షపు నీటి వల్ల విద్యార్థులు, ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. నీరు ఎక్కువ రోజులు నిల్వ ఉండడం వల్ల పాములు, తేళ్లు వంటి విషపూరిత జీవులు వచ్చే ప్రమాదం ఉందన్నారు. ఇది విద్యార్థుల భద్రతకు తీవ్రమైన ముప్పుగా మారే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం బడుల అభివృద్ధికి నిధులు ఇస్తున్నామని చెబుతున్నా ఇక్కడి పరిస్థితి భిన్నంగా ఉందన్నారు. కలెక్టర్, స్థానిక ఎమ్మెల్యే, జిల్లా విద్యాశాఖ అధికారి డిఈఓ తక్షణమే స్పందించి పాఠశాలలను పరిశీలించాలని కోరారు. నిల్వ నీటిని తొలగించి శాశ్వత పరిష్కార చర్యలు చేపట్టాలన్నారు. విద్యార్థుల భద్రతను దృష్టిలో ఉంచుకుని సాధారణ పరిస్థితులు నెలకొల్పాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) నాయకుడు శ్రావణ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

అత్యధిక వర్షపాతం నమోదుప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- తహసీల్దార్ వాహిదోద్దిన్, ఎస్సై గీత

సారంగాపూర్, ప్రభాత వార్త : గత 24 గంటల్లో సారంగాపూర్ మండలంలో 176.3 మిల్లీమీటర్ల (మి.మీ.) అత్యధిక వర్షపాతం నమోదైంది. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా వాగులు, వంకలు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. లోతట్టు ప్రాంతాలు జలమయమవడంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ వాహిదోద్దిన్, ఎస్సై గీత సూచించారు.అత్యవసర పరిస్థితులు మినహా ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావద్దని, వాగులు, వంకలు దాటే ప్రయత్నం చేయవద్దని హెచ్చరించారు. భారీ వర్షాల కారణంగా ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నందున చిన్నారులను వరద నీటి సమీపానికి వెళ్లనివ్వకుండా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు.రైతులు వ్యవసాయ పనులకు వెళ్లే సమయంలో అప్రమత్తంగా ఉండాలని, విద్యుత్ తీగలు తెగి కనిపిస్తే వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని సూచించారు.

చినుకు పడితే చిత్తడే!

గుంతల రోడ్లు... నరకయాత పాలకులకు ప్రభుత్వానికి పట్టింపేది?

ప్రభాతవార్త కోనరావుపేట:



పాలకులు మారినా ప్రభుత్వాలు మారినా మండల కేంద్ర రోడ్లు మారడం లేదు ప్రధాన రోడ్లన్నీ శిథిలావస్థకు చేరుకు న్నాయి. చినుకు పడితే చిత్తడే రోడ్లు చెరువుల తలపడుతున్నాయి వందలాది వాహనాలు, వేలాది ప్రజలు ప్రయాణించే రోడ్ల పరిస్థితి అత్యంత దయనీయంగా ఉంది.ఆకాశంలో చిన్న చినుకు పడినా చాలు రోడ్లన్నీ చిత్తడిగా మారిపో తున్నాయి. పెద్ద పెద్ద గుంతలు నీటితో నిండి చెరువుల్లా కనిపిస్తున్నాయి. ద్విచక్ర వాహనం పై వెళ్లేవారు గుంతల నరకయాతన అనుభవిస్తున్నారు ఎన్నికల ముందు అభివృద్ధి చేస్తానని వాగ్దానం చేస్తున్న నాయకులు హామీలను మర్చిపోతున్నారు ప్రభుత్వాలు మారిన నాయకులు మారిన మండల కేంద్ర రోడ్లు దుస్థితి మాత్రం మారడం లేదు అని మండల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు ఇకనైనా ప్రభుత్వం వెంటనే రోడ్లు వెయ్యాలని మండల కేంద్ర ప్రజలు ప్రభుత్వాన్ని కోరుతున్నారు

ఎల్లంపల్లి ప్రాజెక్టుకు భారీ వరద ప్రవాహం

ఎగువ ప్రాంతాల నుంచి కొనసాగుతున్న భారీ నీటి రాక ప్రాజెక్టు గేట్లు మూసివేత.. దిగువకు నీటి విడుదల

గోదావరిఖని ,ప్రభాతవార్త: భారీ వర్షాల ప్రభావంతో శ్రీపాద ఎల్లంపల్లి



ప్రాజెక్టుకు వరద ప్రవాహం కొనసాగుతోంది. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో ప్రాజెక్టులోకి పెద్ద ఎత్తున నీరు వచ్చి చేరుతోంది. బుధవారం సాయంత్రం 6 గంటల సమయానికి ప్రాజెక్టులోకి 75,328 క్యూసెక్కుల నీరు వచ్చి చేరినట్లు అధికారులు వెల్లడించారు.ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 148 మీటర్లు కాగా, ప్రస్తుతం నీటి మట్టం 144.22 మీటర్లకు చేరుకుంది. ప్రాజెక్టు మొత్తం నీటి నిల్వ సామర్థం 20.1754 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 11.1105 టీఎంసీల నీరు నిల్వ ఉంది. వరద ప్రవాహాన్ని అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ పరిస్థితిని సమీక్షిస్తున్నారు. ప్రాజెక్టులోకి వస్తున్న నీటిని నియంత్రిత పద్ధతిలో దిగువ ప్రాంతాలకు విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం ప్రాజెక్టు నుంచి మొత్తం 12,875 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. ఇందులో నంది పంప్‌హౌస్ ద్వారా 12,600 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. హైదరాబాద్ మెట్రో వాటర్ సప్లైకు 275 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు.ప్రస్తుతం ప్రాజెక్టులోని 62 గేట్లలో ఏ ఒక్క గేటును కూడా ఎత్తలేదు. గేట్ల ద్వారా నీటి విడుదల లేకుండానే విద్యుత్ ఉత్పత్తి, ఇతర అవసరాల మేరకు నీటి విడుదల కొనసాగుతోంది. ఎగువ ప్రాంతాల నుంచి వచ్చే వరద ప్రవాహాన్ని బట్టి భవిష్యత్‌లో నీటి విడుదలపై నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు పరివాహక ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిస్తే వరద ప్రవాహం మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. దీంతో ప్రాజెక్టు పరిసర ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. నదీ పరివాహక ప్రాంతాల్లోకి వెళ్లకుండా జాగ్రత్తలు పాటించాలని అధికారులు విజ్ఞప్తి చేస్తున్నారు.ప్రాజెక్టు నీటి నిల్వలు క్రమంగా పెరుగుతున్న నేపథ్యంలో సాగు, తాగునీటి అవసరాలకు భరోసా కలుగుతోంది. మరోవైపు వరద పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని అధికారులు ప్రాజెక్టు వద్ద ప్రత్యేక పర్యవేక్షణ కొనసాగిస్తున్నారు. ఇన్‌ఫ్లో, ఔట్‌ఫ్లో వివరాలను ఎప్పటికప్పుడు నమోదు చేస్తూ నీటి నిర్వహణ చేపడుతున్నారు.వర్షాలు కొనసాగితే ఎల్లంపల్లి ప్రాజెక్టులోకి మరింత వరద నీరు చేరే అవకాశం ఉన్నందున అధికారులు అప్రమత్తంగా ఉన్నారు. ప్రాజెక్టు భద్రత, దిగువ ప్రాంతాల రక్షణకు అవసరమైన అన్ని చర్యలు చేపడుతున్నట్లు వెల్లడించారు.

రేషన్ కార్డుదారులకు ఈ కేవైసీ తప్పనిసరి

ఈనెల 31 లోపు చేయించుకోవాలి

ప్రభాతవార్త కోనరావుపేట ఐదు సంవత్సరాల వయస్సు ఉన్న పిల్లలు మినహాయించి రేషన్ కార్డులో పేరు ఉన్న ప్రతి ఒక్కరూ ముఖ్యంగా కొత్త రేషన్ కార్డుదారులు రేషన్ కార్డులో కొత్తగా పేర్లు నమో చేసుకున్నవారు ఈ నెల 31 లోపు తప్పనిసరిగా ఈ కేవైసీ చేసుకోవాలని కోనరావుపేట రేషన్ డీలర్ల సంఘం మండల అధ్యక్షుడు మాంధాల ప్రసాద్ బుధవారం ప్రకటనలో తెలిపారుఎల్ నీ నో కారణంగా ఆగస్టు సెప్టెంబర్ అక్టోబర్ నెలలకు సంబంధించి మూడు నెలల రేషన్ బియ్యాన్ని ఒకేసారి ఇవ్వాలని ప్రభుత్వ నిర్ణయించిన విషయం తెలిసింది దీంతో ఈ కేవైసీ చేయించుకొనని వారికి మూడు నెలల బియ్యం అందని పరిస్థితి నెలకొల్పాన్నుదని పేర్కొన్నారు

మెట్‌పల్లి డివిజన్‌లో భారీ వర్షం

లోతట్టు ప్రాంతాల్లో సహాయక చర్యలు

ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జువ్వాడి విజ్ఞప్తి





మెట్‌పల్లి డివిజన్, ప్రభాతవార్త: మెట్‌పల్లి, మల్లాపూర్, ఇబ్రహీంపట్నం మండలాల్లో బుధవారం కురిసిన భారీ వర్షాలకు వాగులు, వంకలు పొంగిపొర్లాయి. పలు చెరువులు నిండి మత్తడి దుంకుతుండగా, ఈ వర్షాలతో రైతాంగంలో ఆనందం నెలకొంది. గత కొన్ని రోజులుగా వర్షాభావంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతులకు ఈ వర్షం ఊరటనిచ్చి, వ్యవసాయ పనులకు అనుకూల వాతావరణం ఏర్పడింది. ఇదిలా ఉండగా, మెట్‌పల్లి పట్టణంలో కురిసిన భారీ వర్షాల నేపథ్యంలో మున్సిపాలిటీ అధికారులు అప్రమత్తమై విస్తృతంగా సహాయక చర్యలు చేపట్టారు. మున్సిపల్ కమిషనర్ డి. శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో అధికారులు, సిబ్బంది పట్టణంలోని మురికి కాలువలు, వరద నీటి కాలువలు, లోతట్టు ప్రాంతాలను పరిశీలించారు. ఎక్కడా నీటి ప్రవాహానికి అంతరాయం కలగకుండా జేసీబీ సహాయంతో కాలువలను శుభ్రపరుస్తూ వరద నీటిని మళ్లించారు. ఈ క్రమంలో 11వ వార్డులోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల వరద ముంపుకు గురికావడంతో అధికారులు వెంటనే స్పందించారు. జేసీబీతో కాలువలు ఏర్పాటు చేసి నీటిని మళ్లించినప్పటికీ, ఎత్తైన ప్రాంతాల నుంచి అధికంగా వచ్చిన వరద నీటిని మోటార్ల సహాయంతో బయటకు పంపించారు. విద్యార్థుల భద్రతను దృష్టిలో ఉంచుకుని పాఠశాల పిల్లలను సురక్షితంగా వారి ఇళ్లకు పంపించారు. అనంతరం పట్టణంలోని పలు ప్రాంతాలను పరిశీలించిన మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ గౌడ్, వర్షాల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. ఎలాంటి అత్యవసర పరిస్థితి తలెత్తినా వెంటనే స్పందించి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే అవసరమైతే తప్ప బయటకు రావద్దని, ముఖ్యంగా లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు విజ్ఞప్తి చేశారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. జువ్వాడి నర్సింగరావు మెట్ పల్లి డివిజన్ లో కురుస్తున్న భారీ వర్షాలకు ప్రజలు,రైతులు అప్రమత్తంగా ఉండాలని వెలమ కార్పొరేషన్ చైర్మన్ జువ్వాడి నర్సింగరావు విజ్ఞప్తి చేశారు. అవసరమైతేనే బయటకు వెళ్లాలని, రైతులు వర్షాలు తగ్గిన తర్వాత వ్యవసాయ పనులకు వెళ్లాలని సూచించారు

టీ-హబ్, టీ-వర్క్స్‌ను సందర్శించిన మెట్‌పల్లి-కోరుట్ల డిగ్రీ కళాశాల విద్యార్థులు

స్టార్టప్‌లు, ఆధునిక సాంకేతికతపై అవగాహన

కల్పించిన కోరుట్ల ఎమ్మెల్యే సంజయ్







మెట్‌పల్లి డివిజన్, ప్రభాతవార్త: కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ ఆధ్వర్యంలో మెట్‌పల్లి-కోరుట్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన విద్యార్థులు బుధవారం హైదరాబాద్‌లోని టీ-హబ్, టీ-వర్క్స్ సంస్థలను సందర్శించారు. గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు ప్రపంచ స్థాయి సాంకేతికత, స్టార్టప్ సంస్కృతి, నైపుణ్యాభివృద్ధి అవకాశాలపై అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో ఈ విద్యా పర్యటనను కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. టీ-హబ్‌లో విద్యార్థులు స్టార్టప్‌ల అభివృద్ధి, యువ పారిశ్రామికవేత్తలకు అందిస్తున్న మెంటరింగ్, సాంకేతిక సహకారం, పెట్టుబడుల అవకాశాల గురించి తెలుసుకున్నారు. అనంతరం టీ-వర్క్స్‌లో ఆధునిక యంత్రాలు, ప్రోటోటైపింగ్ సదుపాయాలు, ఉత్పత్తుల రూపకల్పన ప్రక్రియను ప్రత్యక్షంగా పరిశీలించి సాంకేతిక రంగంలో వస్తున్న నూతన మార్పులపై అవగాహన పెంపొందించుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ మాట్లాడుతూ, విద్యతో పాటు నైపుణ్యాలను కూడా అభివృద్ధి చేసుకుంటేనే భవిష్యత్తులో మెరుగైన అవకాశాలను అందిపుచ్చుకోవచ్చని విద్యార్థులకు సూచించారు. డిగ్రీ పూర్తయిన తర్వాత కేవలం ఉద్యోగాల కోసం ఎదురు చూడకుండా, తమ సృజనాత్మక ఆలోచనలు, నైపుణ్యాలతో కొత్త అవ కాశాలను సృష్టించే స్థాయికి ఎద గాలని పిలుపునిచ్చారు. టీ-హబ్, టీ-వర్క్స్ వంటి సంస్థలు అందిస్తున్న అవకాశాలను సద్వి నియోగం చేసుకోవాలని సూచిం చారు. ఈ విద్యా పర్యటన ద్వారా తమలో కొత్త ఆలోచనలు, ఆత్మ విశ్వాసం పెరిగాయని విద్యార్థులు తెలిపారు. సాంకేతిక రంగంలో ఉన్న విస్తృత అవకాశాలను ప్రత్యక్షంగా తెలుసుకోవడం వల్ల తమ భవిష్యత్ లక్ష్యాలపై మరింత స్పష్టత ఏర్పడిందని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు సైతం ప్రపంచ స్థాయి సాంకేతిక పరిజ్ఞానం, నైపుణ్యాభివృద్ధి, స్టార్టప్ అవకాశాలను చేరువ చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్‌కు విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు.

వృద్ధురాలి కుటుంబానికి పరామర్శ

మెట్‌పల్లి,ప్రభాతవార్త:

గ్రామంలో ఈదుళ్ల మల్లవ్వ మృతి చెందగా.. మృత దేహానికి నివాళులు అర్పించి,వారి కుటుంబసభ్యులను లయన్స్ క్లబ్ అధ్యక్షులు వెలుముల శ్రీనివాస్ రావు బుధవారం పరామర్శించారు.ఈసందర్భంగా లయన్స్ క్లబ్ తరపున ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. ఈకార్యక్రమంలో సర్పంచ్ పుల్ల జగన్,గొర్రె శంకర్, తదితరులు ఉన్నారు.



మెట్‌పల్లి వార్త

కళ్లు లేని కబోధిలా వ్యవహరిస్తున్న ప్రతిపక్షాలు

మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి

తిమ్మాపూర్, ప్రభాత వార్త : తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు కళ్ల ముందు కదలాడుతున్నా ప్రతిపక్షాలకు కానరాక కళ్లు లేని కబోదిలా వ్యవహరిస్తున్నాయని మానకొండూర్ ఎమ్మెల్యే, టీపీసీసీ ఎస్సీ సెల్ చైర్మన్ కవ్వంపల్లి సత్యనారాయణ విమర్శించారు. బుధవారం తిమ్మాపూర్ మండల పరిషత్ సమావేశమందిరంలో వివిధ గ్రామాల 99 మంది లబ్ధిదారులకు 31.92 లక్షల విలువ చేసే సీఎంఆర్ఎఫ్ చెక్కులు ఆయన పంపిణీ చేశారు.ఈ సందర్భంగా డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో సంక్షేమ పథకాలను అమలు చేయని బీఆర్ఎస్, దానికి వంతపాడుతూ అంటకాగిన బీజేపీ పార్టీలు కాంగ్రెస్ పథకాలపై తప్పుడు ప్రచారాలకు పూనుకోవడం విడ్డూరంగా ఉందని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాలకు ప్రయోజనం చేకూర్చే విధంగా వివిధ సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నప్పటికీ ప్రతిపక్షాలు విమర్శలు చేయడం సిగ్గుచేటని ఆయన విమర్శించారు. గత పాలనలో లక్ష రూపాయల వరకు రుణ మాఫీ చేసి చేతులు దులుపుకున్న విషయాన్ని విస్మరించిన గులాబీ నేతలు 2 లక్షల వరకు రుణ మాఫీ అమలు చేసిన కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేయడం ఆక్షేపణీయమని ఆయన పేర్కొన్నారు. సాంకేతిక కారణాల వల్ల 2 లక్షల రుణమాఫీ పొందడంలో కొద్ది మంది రైతులకు ఆలస్యం జరిగిందే తప్ప మరో ఉద్దేశం కాదని, అర్హులైన వారందరికీ ప్రభుత్వం రుణమాఫీ చేస్తుందని ఆయన స్పష్టం చేశారు. డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు ఇవ్వడం చేతకాని గత పాలకులు ఇందిరమ్మ ఇళ్ల ద్వారా సొంతింటి కలను సాకారం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శించడం తగునా అని ఆయన సూటిగా ప్రశ్నించారు. డబుల్ బెడ్ రూమ్ పథకం అమలు కోసం మోదీ ప్రభుత్వ సాయాన్ని కోరాలన్న సోయి అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ లేకుండా పోయిందని ఆయన ఎద్దేవా చేశారు. ప్రతిపక్షంలో ఉన్నప్పటికీ బేషజాలను పక్కనబెట్టి జనహితం కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పలు మార్లు మోడీని కలిసి లక్ష ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని కోరారని ఆయన గుర్తు చేశారు. ఇళ్లు లేని నిరుపేదలకు, ముఖ్యంగా గుడిసెల్లో నివాసం ఉంటున్న వారందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలన్నదే కాంగ్రెస్ ప్రభుత్వ ఉద్దేశమని ఆయన పేర్కొన్నారు. ధరణి పేరిట జరిగిన అక్రమాలు అన్నీ,ఇన్నీ కావని, ప్రభుత్వ, ప్రైవేటు భూములు అన్యుల పరమయ్యాయని,భూముల ఆక్రమణలు, కబ్జాలకు అడ్డూఅదుపూ లేకుండా పోయాయని, వాస్తవాలను ఇప్పటికైనా గ్రహించి బట్టకాల్చి మీద వేసే విధానానికి గులాబీనేతలు స్వస్తిపలకాలని డాక్టర్ కవ్వంపల్లి హితవు పలికారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలకు కట్టుబడి వాటిని అమలు చేస్తున్నదని ఆయన చెప్పారు. ప్రభుత్వ పథకాల వల్ల ప్రతి కుటుంబం నెలకు 2500 రూపాయల మేరకు లబ్ధిపొందుతున్న విషయాన్ని ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ సోదాహరణంగా వివరించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం అనేక అష్టకష్టాలకు, అన్యాయాలకు గురిచేయడం వల్లనే ప్రజలు ఆ పార్టీని కాదని కాంగ్రెస్ పార్టీకి పట్టంగట్టారన్నారు. ప్రజల ఆశలు,ఆశయాలకు అనుగుణంగా పాలన సాగిస్తూ రేవంత్ రెడ్డి సారథ్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల కళ్లలో ఆనందాన్ని చూస్తున్నదని డాక్టర్ కవ్వంపల్లి పేర్కొన్నారు. రైతులు పండించిన వరి,మక్కజొన్న,సన్ ఫ్లవర్ తదితర పంటలను ప్రభుత్వం ఐకేపీ, సింగిల్ విండో వంటి ప్రభుత్వ సంస్థల ద్వారా కొనుగోలు చేయించడమే కాకుండా 24 గంటలకు రైతులకు డబ్బులు చెల్లించిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కుతుందని ఆయన చెప్పారు. దొడ్డు బియ్యానికి బదులు సన్న బియ్యాన్ని పంపిణీ చేస్తున్నామని, కిలో సన్న బియ్యాన్ని 60 రూపాయలకు ప్రభుత్వం కొనుగోలు చేసిన రేషన్ షాపుల ద్వారా పంపిణీ చేస్తున్న విషయాన్ని ఆయన గుర్తు చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి పవన్ కుమార్, తిమ్మాపూర్ తహసీల్దార్ కర్ర శ్రీనివాస్ రెడ్డి, ఎంపీడీవో మల్లోత్తా, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బండారి రమేశ్, నుస్తులాపూర్, పోరండ్ల సింగిల్ విండో చైర్మన్లు మోరపల్లి రమణారెడ్డి, గోపు మల్లారెడ్డి, ఆత్మ కమిటీ చైర్మన్ చెన్నబోయిన రవి, పార్టీ నాయకులు దావు సంపత్ రెడ్డి, శ్రీగిరి రంగారావు, తుమ్మనపల్లి శ్రీనివాసరావు,కొత్త తిరుపతిరెడ్డి, గొట్టెముక్కుల సంపత్ రెడ్డి, పోలు రాము, రమేశ్, నోముల అనిల్, కేతిరెడ్డి ఎల్లారెడ్డి, లక్ష్మణ్, తుర్తి అరవింద్ తోపాటు వివిధ గ్రామాల సర్పంచులు, పార్టీ గ్రామశాఖ అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

సిరికొండలో భూముల రీ సర్వేకు అధికారులు సిద్ధం

తహసీల్దార్ రాచకట్ల సురేష్

ఇల్లంతకుంట, ప్రభాతవార్త



మండలములోని సిరికొండ గ్రామంలోని భూములను తిరిగి సర్వే చేసేందుకు ప్రభుత్వం సిద్ధమైందని తహసిల్దార్ రాచకట్ల సురేష్ తెలిపారు. బుధవారం గ్రామంలో నిర్వహించిన గ్రామసభలో ఆయన గ్రామస్తులను ఉద్దేశించి మాట్లాడారు. మండలంలోని సిరికొండ గ్రామాన్ని భూముల రీ సర్వేకు ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. గురువారం నుండి సర్వే ప్రారంభమోతున్నట్లు పేర్కొన్నారు. సర్వేలో భాగంగా భూముల హద్దులు, విస్తీర్ణం, ఇతర వివరాలను పరిశీలించనున్నట్లు తెలిపారు. భూ రికార్డుల్లో ఏవైనా లోపాలు, తేడాలు ఉంటే సర్వే సమయంలో అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. రీ సర్వే ప్రక్రియకు గ్రామస్తులు సహకరించాలని కోరారు. భూములకు సంబంధించిన పత్రాలను సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. రీ సర్వేతో భూ సమస్యలకు పరిష్కారం లభించే అవకాశం ఉందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ విఠల్, ఏ డి, సర్వేయర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

జిల్లాలో మంత్రుల పర్యటన

సిరిసిల్ల టౌన్, ప్రభాతవార్త :

జిల్లాలో పలు అభివృద్ధి పనులను ప్రారంభించడానికి కరీంనగర్ జిల్లా ఇంచార్జి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు , బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించనున్నారు. ఉదయం 8గంటలకు వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయంలో రాష్ట్రంలో సమృద్ధి వర్షాలు కురవాలని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ తో కలిసి వరుణ యాగం నిర్వహిస్తారు. స్వామి వారిని దర్శించుకున్న తర్వాత గుడి చెరువు ట్యాంక్ బండ్ పార్క్ ప్రారంభిస్తారు. 9 30 గంటలకు వేములవాడ లో తిప్పాపూర్ బస్ స్టేషన్ పునరుద్ధరణకు శంకుస్థాపన చేయనున్నారు .10 గంటల 30 నిమిషాలకు కలెక్టరేట్ చౌరస్తా, రగుడు బైపాస్ జంక్షన్, నూతన బస్ షెల్టర్ ప్రారంభించనున్నారు . 11 గంటలకు ఎల్ నినో ప్రభావం తో వర్షాభావ పరిస్థితుల్లో తీసుకోవాల్సిన చర్యలపై మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తో కలిసి జిల్లా కలెక్టరేట్ లో సమీక్షా సమావేశం నిర్వహించనున్నారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయంగా అధికారులు పనిచేయాలి

ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ

ఇల్లంతకుంట, ప్రభాతవార్త

ప్రజా సంక్షేమమే ధ్యేయంగా అధికారులు పనిచేయాలని స్థానిక ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలను అధికారులు ఎప్పటికప్పుడు గుర్తించి పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని అన్నారు. ప్రజలకు ప్రభుత్వ పథకాల ఫలాలు అందేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. సమావేశంలో ఆయా గ్రామాల సర్పంచులు విద్యుత్, ఇసుక సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. గ్రామాల్లో విద్యుత్ సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఇసుక సమస్యపై కూడా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఇసుక అక్రమ రవాణాను అరికట్టేందుకు స్థానిక తహసిల్దార్, ఎస్సైలు చర్యలు చేపట్టాలని సూచించారు. అక్రమ రవాణాకు పాల్పడే వారిపై నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచులు, జడ్పీ సీ ఈ వో వేణు మాధవరావు, మండల ప్రత్యేక అధికారి రామకృష్ణ, తహసీల్దార్ సురేష్, ఎంపిడివో, మండల, గ్రామ స్థాయి అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా గురు పౌర్ణమి వేడుకలు

గంభీరావుపేట, ప్రభాతవార్త:



గురు పౌర్ణమి వేడుకలు బుధవారం గంభీరావుపేట మండల కేంద్రంలో ఘనంగా జరిగాయి. గురు పౌర్ణమి పురస్కరించుకొని మాజీ ఎమ్మెల్యే, టీపీసీసీ సీనియర్ అధికార ప్రతినిధి కటకం మృత్యుంజయం ముందుగా విగ్నేశ్వరునికి అనంతరం దత్తాత్రేయ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామ పురోహితులు రాచర్ల పార్థసారథి శర్మ స్వామివారికి పూజలు నిర్వహించారు. అనంతరం తీర్థ ప్రసాదాలు అందజేశారు. గురు పౌర్ణమి వేడుకల్లో మృత్యుంజయం కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పాల్వంచ వాగు ప్రవాహంతో చిగురిస్తున్న ఎగువమానేరు రైతాంగ ఆశలుమానేరులోకి ప్రవహిస్తున్న పల్వంచ వాగు నీరు



గంభీరావుపేట, ప్రభాతవార్త:

ఎలినినో ప్రభావంతో ఈ ఏడు వర్షాలు అంతంత మాత్రమే నని దిగులు చెందుతున్న రైతాంగ ఆశలు చిగురిస్తున్నాయి. రెండు రోజులుగా ఎగువన కురుస్తున్న భారీ వర్షాలకు గంభీరావుపేట మండలం నర్మాల ఎగువ మానేరు ప్రాజెక్టుకు ప్రాణాధారమైన మాచారెడ్డి మండలం పాల్వంచ వాగు ప్రవహిస్తుంది. 31 ఫీట్ల ఎత్తున ఎగువ మానేరు జలాశయంలో ఇప్పటివరకు 17 ఫీట్ల నీరు నిల్వ ఉండగా, పల్వంచ వాగు ప్రవాహంతో బుధవారం మానేరులోకి ఒక అడుగు నీరు చేరుకుంది. ప్రతి ఏటా సిద్దిపేట జిల్లా కూడెల్లి, పల్వంచ వాగుల ద్వారా వచ్చే వరద ఉధృతికి మానేరు పూర్తిస్థాయిలో నిండి పరవళ్ళు తొక్కుతుంది. ఈ ఏడు వర్షాకాలం ఆరంభమై నెల దాటిన వర్షాలు కురియక కపోవడం రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు పల్వంచ వాగు ప్రవహిస్తుంది. మరో రెండు రోజులు వర్షాలు ఇలాగే కురిస్తే మానేరు జలకల తో నిండే అవకాశాలు కనిపిస్తున్నాయి. వర్షాలు కురియక దిగాలు చెందుతున్న రైతులకు ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో ప్రాంత రైతాంగ ముహాల్లో ఆనందం వెల్లివిరుస్తుంది.

ఘనంగా సి నారాయణరెడ్డి జయంతి వేడుకలు

సిరిసిల్ల టౌన్, ప్రభాతవార్త

: ప్రముఖ కవి జ్ఞానపీఠ అవార్డు గ్రహీత, పద్మభూషణ్ డాక్టర్ సి. నారాయణ రెడ్డి జయంతి వేడుకలను బీఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో ఘనంగా నిర్వహించగా నాస్కాబ్ కొండూరి రవీందర్ రావు , మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళ చక్రపాణి , బీఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షులు జిందం చక్రపాణి చిత్రపటానికి పూలమాల వేసి ఘనమైన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ దార్ల సందీప్ , మున్సిపల్ కౌన్సిలర్ సభ్యులు, కోఆప్షన్ సభ్యులు , నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సిరిసిల్ల వార్త

ఇల్లంతకుంటలో చినుకు పడితే చిత్తడే

ఇల్లంతకుంట, ప్రభాతవార్త



ఇల్లంతకుంట మండల కేంద్రంలో కొద్దిపాటి వర్షానికే రోడ్లు, బస్టాండ్ ఆవరణ నీటితో నిండిపోతున్నాయని బీజేపీ జిల్లా దళిత మోర్చా ప్రధాన కార్యదర్శి మామిడి హరీష్ బుధవారం ఆరోపించారు. వర్షం కురిసిన ప్రతిసారీ బస్టాండ్ ఆవరణలో భారీగా నీరు నిలిచిపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. రోడ్లపై కూడా వర్షపు నీరు నిలిచి రాకపోకలకు అంతరాయం కలుగుతోందన్నారు. మురుగునీటి కాలువలకు వర్షపు నీరు సక్రమంగా వెళ్లకపోవడముతో ఈ పరిస్థితి ఏర్పడుతోందని పేర్కొన్నారు. వర్షాకాలం ప్రారంభమైనా అధికారులు ముందస్తు చర్యలు చేపట్టకపోవడం విచారకరమన్నారు. బస్టాండ్ పరిసరాల్లో డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచి, వర్షపు నీరు నిలవకుండా శాశ్వత పరిష్కారం చూపాలని అధికారులను హరీష్ డిమాండ్ చేశారు.

రస భసాగా సాగిన సర్వసభ్య సమావేశం

ముస్తాబాద్ ప్రభాత వార్త:



ముస్తాబాద్ మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఓ లాచ్చాలు ఆధ్వర్యములో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మండలములోని ఆయా గ్రామాల్లో గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా ప్రతి గ్రామములో హరిత హరం మొక్కలను నాటాలని అధికారులకు సూచించారు. అదే విధంగా వైకుంఠ ధామలు లేని గ్రామాల్లో వైకుంఠ ధామాలు ఏర్పాటు చేయాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో నీటి వసతిని కల్పించి, రోడ్డుకు ఇరువైపులా వున్న కొమ్మలను ప్రయాణికులకు ఇబ్బంది కలుగకుండా చర్యలు తీసుకోవాలని గ్రామ సర్పంచ్ ఆంజనేయులు అన్నారు. సిరిసిల్ల, సిద్దిపేట డిపో ల నుండి వచ్చే బస్ లు గూడూరు గ్రామానికి వచ్చేలా చర్యలు తీసుకోవాలని గ్రామ సర్పంచ్ చిటీ సునీత కోరారు. మండలములో మిషన్ భగీరథ నీటిలో కలుషిత నీరు వస్తుందని, అంతే కాకుండా పైప్ లైన్ ద్వారా తక్కువ నీరు వస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమములో జిల్లా ప్రత్యేక అధికారి వెంకట మాధవ రావు, మండల ప్రత్యేక అధికారి నిర్మల, మిషన్ భగీరథ డీఈ పావని, జిల్లా ఆత్మ చైర్మన్ కొండం రాజిరెడ్డి, సెస్ డైరెక్టర్ అంజిరెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తలారి రాణి, మండల తహశీల్దార్ మహమ్మద్ అబ్దుల్ ఫారూఖ్, ఎంపీవో వాజిద్, సర్పంచ్ ఫోరం మండల అధ్యక్షులు చిగురు నరేష్, వివిధ గ్రామాల సర్పంచ్లు, అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కార్యాలయాలలో ఇంచార్జ్ అధికారులు

-పూర్తి స్థాయిలో అందని సేవలు

-అధికారుల నియామకానికి ప్రజల డిమాండ్

సారంగాపూర్ ప్రభాత వార్త:



సారంగాపూర్ మండలంలోని పలు ప్రభుత్వ శాఖల్లో పూర్తి స్థాయి అధికారులు లేకపోవడంతో ఇంచార్జ్ అధికారులే విధులు నిర్వహిస్తున్నారు. దీంతో పరిపాలనా పనులపై ప్రభావం పడుతుందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.గత కొన్ని సంవత్సరాలుగా మండల విద్యాధికారి (ఎంఈఓ) పోస్టు ఖాళీగా ఉండడంతో మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కిషోర్‌కు అదనపు బాధ్యతలు అప్పగించారు.ఇటీవల మండల ఎంపీడీఓగా బాధ్యతలు స్వీకరించిన నీరజ భీమారం మండలానికి ఇంచార్జ్ ఎంపీడీఓగా విధులు నిర్వహిస్తున్నారు.తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ పోస్టు ఖాళీగా ఉండటంతో తహసీల్దార్ మహమ్మద్ వాహిదుద్దీన్ రెండు బాధ్యతలను నిర్వహిస్తున్నారు.వెటర్నరీ శాఖలో సారంగాపూర్ పశువైద్యాధికారి డాక్టర్ సునీల్‌కు బీర్‌పూర్ మండలానికి అదనపు ఇంచార్జ్ బాధ్యతలు అప్పగించారు.ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఇద్దరు వైద్యాధికారులు ఉండాల్సి ఉండగా ప్రస్తుతం డాక్టర్ రాధారెడ్డి ఒక్కరే సేవలందిస్తున్నారు. అదే సమయంలో బీర్‌పూర్ మండల వైద్యాధికారిగా కూడా ఇక్కడి సిబ్బందే ఇంచార్జ్ బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.విద్యుత్ శాఖలో బీర్‌పూర్ ఏఈ గా ఉన్న శ్రీనివాస్‌కు సారంగాపూర్ మండల ఏఈగా బాధ్యతలు అప్పగించగా, రెండు మండలాల పనులను ఆయనే పర్యవేక్షిస్తున్నారు. దీనితో ప్రజలకి పూర్తి స్థాయిలో సేవలు అందకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నామని ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి ఇంచార్జ్ అధికారుల స్థానంలో పూర్తి స్థాయి అధికారులను నియమించాలని మండల ప్రజాప్రతినిధులు, ప్రజలు కొరుతున్నారు

కొడిమ్యాలలో అభివృద్ధి పనులపై సమగ్ర సమీక్ష

కొడిమ్యాల, ప్రభాతవార్త:



జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండలంలో సర్పంచ్‌లు, మండల స్థాయి అధికారులతో మండల ప్రత్యేక అధికారి అధ్యక్షతన మండల అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వివిధ శాఖలకు సంబంధించిన అభివృద్ధి పనులు, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు తీరు, ప్రస్తుత పరిస్థితులు తదితర అంశాలపై ఆయా శాఖల అధికారులు వివరించారు. గ్రామాల అభివృద్ధి, ప్రజలకు మెరుగైన సేవలందించడంలో అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ప్రత్యేక అధికారి సూచించారు. ఈ సందర్భంగా ఎల్‌నినో ప్రభావం తీవ్రంగా ఉండే అవకాశాలు ఉన్నందున రైతులు అప్రమత్తంగా ఉండాలని, తక్కువ నీటితో సాగు చేయగల పంటలు, నీటి ఎద్దడిని తట్టుకునే ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించాలని రైతులకు సూచించారు. భూగర్భ జలాల సంరక్షణ, నీటి వనరుల పెంపుదల లక్ష్యంగా ప్రభుత్వం చేపట్టిన జలసిరి కార్యక్రమాలను ఆగస్టు 1వ తేదీ నుంచి 15వ తేదీ వరకు ప్రత్యేక డ్రైవ్ మోడ్‌లో పూర్తి చేయాలని సర్పంచ్‌లకు ఆదేశించారు. ఇందులో భాగంగా ప్రతి పంటకు ఫార్మ్ పాండ్, ప్రతి ఇంటికి ఇంకుడు గుంత, ప్రతి గ్రామానికి ఊట కుంట, ప్రతి బోర్‌వెల్‌కు బోర్‌వెల్ రీఛార్జ్ పిట్, అవసరమైన చోట కమ్యూనిటీ ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసి ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను గడువులోగా పూర్తి చేయాలని సూచించారు. అధిక వర్షాల నేపథ్యంలో గ్రామాల్లో లోతట్టు ప్రాంతాల్లో నీరు నిల్వ ఉండకుండా వెంటనే తొలగించాలని, దోమల నివారణ కోసం ఆయిల్ బాల్స్ వేయాలని, మురుగు కాలువల్లో సిల్ట్ తొలగించి నీటి ప్రవాహానికి ఆటంకం లేకుండా చూడాలని, చెత్తను సకాలంలో తొలగిస్తూ పారిశుద్ధ్య కార్యక్రమాలను ముమ్మరం చేయాలని అధికారులను ఆదేశించారు. భారీ వర్షాల కారణంగా ఎక్కడైనా రహదారులు దెబ్బతిన్నా లేదా ప్రమాదకర పరిస్థితులు ఏర్పడినా వెంటనే ప్రజలను అప్రమత్తం చేసి అవసరమైతే సురక్షిత ప్రాంతాలకు తరలించాలని సూచించారు. అత్యవసర పరిస్థితులు మినహా ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావద్దని, వాగులు, వంకలు, చెరువులు, నదుల్లో చేపలు పట్టేందుకు ఎట్టి పరిస్థితుల్లోనూ వెళ్లరాదని హెచ్చరించారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రతి గ్రామంలో డ్రై డే కార్యక్రమాలు క్రమం తప్పకుండా నిర్వహించాలని, దోమల నివారణ చర్యలు, పారిశుద్ధ్య కార్యక్రమాలను నిరంతరం కొనసాగించాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో మండల ప్రత్యేక అధికారి, ఎంపీడీవో స్వరూప, మండల స్థాయి అధికారులు, వివిధ శాఖల అధికారులు, గ్రామాల గౌరవ సర్పంచ్‌లు పాల్గొన్నారు.

జిల్లాలో భారీ వర్షాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

-జిల్లా ఎస్పీ అశోక్ కుమార్

జగిత్యాల బ్యూరో ప్రభాత వార్త:



జగిత్యాల జిల్లాలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో జిల్లా ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ అశోక్ కుమార్, సూచించారు.వాతావరణ శాఖ హెచ్చరికల ప్రకారం మరో నాలుగు రోజుల పాటు జిల్లాలో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రజలు అవసరం లేకుండా బయటకు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. ముఖ్యంగా వాగులు, వంకలు, కల్వర్టులు, చెరువులు, నదుల వద్దకు వెళ్లకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో వెంటనే డయల్-100కు సమాచారం అందించి పోలీసు సేవలను వినియోగించుకోవాలని కోరారు. పోలీసుల సూచనలు ఉధృతంగా ప్రవహిస్తున్న నీటిలోకి ఎట్టి పరిస్థితుల్లోనూ దిగవద్దు. చేపల వేట కోసం చెరువులు, వాగులు, నదుల వద్దకు వెళ్లవద్దు. నీటితో మునిగిన కల్వర్టులు, వంతెనలు, వాగులను దాటే ప్రయత్నం చేయవద్దు. పశువులను మేతకు తీసుకెళ్లే వారు ప్రత్యేక జాగ్రత్తలు పాటించాలి. విద్యుత్ స్తంభాలు, తెగిపోయిన విద్యుత్ తీగలను ముట్టుకోవద్దు. వ్యవసాయ పనులకు వెళ్లే రైతులు విద్యుత్ తీగలు, నీటి ప్రవాహాల పట్ల అప్రమత్తంగా ఉండాలి. శిథిలావస్థలో ఉన్న లేదా కూలిపోయే ప్రమాదం ఉన్న ఇళ్లలో నివసించవద్దు. అత్యవసరం కాని దూర ప్రయాణాలను వాయిదా వేసుకోవడం మంచిది. మైనర్ పిల్లలకు వాహనాలు ఇవ్వవద్దు. వాహనాల్లో అనుమతించిన పరిమితికి మించి ప్రయాణికులను తీసుకెళ్లవద్దు. సెల్ఫీలు, రీల్స్ కోసం వాగులు, చెరువులు, జలపాతాలు లేదా వరద నీటి ప్రాంతాలకు వెళ్లి ప్రాణాలను ప్రమాదంలో పెట్టుకోవద్దు.

భారీ వర్షంలో కౌన్సిలర్ ప్రతిస్పందన

13వ వార్డులో జేసీబీతో ముందస్తు సహాయక చర్యలు



జగిత్యాల,రూరల్ ప్రభాతవార్త: జగిత్యాల పట్టణంలో కురుస్తున్న భారీ వర్షాల వల్ల లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యే ప్రమాదం ఉండటంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని బీజేపీ జగిత్యాల ఇన్చార్జ్ లింగంపేట్ శ్రీనివాస్ సూచించారు.ప్రవాహ ఉధృతి పెరిగే అవకాశం ఉండటంతో ముందస్తుగా సహాయక చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు.ఈ నేపథ్యంలో ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని 13వ వార్డు కౌన్సిలర్ సిరికొండ వరలక్ష్మి శ్రీనివాస్ ముందస్తు నివారణ చర్యలు చేపట్టారు.వర్షాన్ని సైతం లెక్కచేయకుండా బుధవారం ఉదయం 7 గంటల నుంచే రంగంలోకి దిగి జేసీబీ సహాయంతో సహాయక కార్యక్రమాలు నిర్వహించారు. నీటి ప్రవాహం ఎక్కువగా ఉన్న ప్రదేశాల్లో,కల్వర్టుల వద్ద పేరుకుపోయిన చెత్తను, పూడికను తొలగించి నీరు సజావుగా సాగిపోయేలా చేశారు.వర్షపు నీటి నిలివిపోవడం వల్ల వాహనదారులు,స్థానిక ప్రజలు ప్రమాదాల బారిన పడకుండా దగ్గరుండి పనులను పర్యవేక్షించారు.ముందస్తుగా నివారణ చర్యలు చేపట్టడం పట్ల వార్డు ప్రజలు,వాహనదారులు హర్షం వ్యక్తం చేశారు.

జగిత్యాల వార్త



ఘనంగా సినారే 99వ జయంతి వేడుకలు

జగిత్యాల టౌన్, ప్రభాత వార్త

జ్ఞానపీఠ అవార్డు గ్రహీత, తెలంగాణ సాహితీ శిఖరం స్వర్గీయ సి. నారాయణరెడ్డి 99 వ జయంతి సందర్భంగాకళాశ్రీ ఈశ్వరమ్మ సాహిత్య పీఠం జగిత్యాల అధినేత గుండేటి రాజు ఆధ్వర్యంలో బుధవారం సి నా రే చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కళాశ్రీ అధినేత గుండేటి రాజు మాట్లాడుతూ సి నా రే సాహిత్యం అజరామరం అని ప్రపంచ సాహిత్య పుటల్లో చెరగని ముద్ర వేసుకున్నారని, ఆయన సాహిత్యం ముందు తరాలకు ఆదర్శంగా నిలుస్తాయాని, ఇప్పటికి సి నా రే గజల్స్ శ్రోతలను అలరిస్తున్నాయని పేర్కొన్నారు. కవులు సి నా రే పై కవితాగానం చేశారు.ఈ కార్యక్రమంలో ఉజగిరి జమున, కవయిత్రులు అయిత అనిత, మద్దెల సరోజన, లక్కరాజు శ్రీలక్ష్మీ, ములస్థం లావణ్య, కటుకం కవిత, మాడిశెట్టి శ్రీనివాస్, ఓదెల గంగాధర్, డా. శ్యామ్ సుందర్ తదితరులు పాల్గొన్నారు.

పదోన్నతి పొందిన

ఎస్.ఐ వెంకటేశ్వర్లుకు ఎస్పీ శుభాకాంక్షలు

జగిత్యాల బ్యూరో ప్రభాత వార్త:



జగిత్యాల టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఏఎస్ఐగా విధులు నిర్వహించి ఎస్.ఐగా పదోన్నతి పొందిన వెంకటేశ్వర్లు జిల్లా ఎస్పీ అశోక్ కుమార్‌ని మర్యాద పూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ వెంకటేశ్వర్లుకు ఎస్ఐ హోదాకు సంబంధించిన స్టార్ చిహ్నాన్ని అలంకరించి పదోన్నతి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఎస్పీ అశోక్ కుమార్ మాట్లాడుతూ.. పదోన్నతి అనేది కేవలం హోదా పెరగడం మాత్రమే కాకుండా బాధ్యతలు కూడా మరింత పెరుగుతాయని అన్నారు. పెరిగిన బాధ్యతలను క్రమశిక్షణ, నిజాయితీ, అంకితభావంతో నిర్వహిస్తూ ప్రజల్లో పోలీసు శాఖపై విశ్వాసం, గౌరవం మరింత పెరిగేలా విధులు నిర్వర్తించాలని సూచించారు.

వర్షమొస్తే నరకమే శాశ్వత వంతెనల

నిర్మాణంపై హన్మాజీపేట్ వాసుల డిమాండ్

జగిత్యాల,రూరల్ ప్రభాతవార్త:



జగిత్యాల మండలం రూరల్ పరిధిలోని హన్మాజీపేట్ గ్రామం మీదుగా జగిత్యాలకు వెళ్లే మార్గాల్లో రవాణా వ్యవస్థ పూర్తిగా స్తంభించిపోయింది.మంగళవారం రాత్రి నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు కండ్ల పెల్లి చెరువు నిండి పొంగిపొర్లు తుండటంతో,వాగు గుండా భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది.ఈ ఉధృతికి హన్మాజీపేట్ నుంచి పెర్కపల్లె,శంకులపల్లె మీదుగా వెళ్లే రెండు ప్రధాన రహదారుల్లోని లోలెవెల్ వంతెనలు నీట మునిగాయి.వరద నీరు వంతెనలపై నుంచి హోరెత్తుతూ ప్రవహిస్తుండటంతో జగిత్యాలకు వెళ్లే ప్రయాణికులు,స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.వాగు ప్రవాహం వేగంగా ఉండటంతో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రజలు,వాహనదారులు సాహసించి వంతెనలను దాటే ప్రయత్నం చేయవద్దని అధికారులు హెచ్చరించారు.వరద తగ్గుముఖం పట్టే వరకు ప్రయాణాలను వాయిదా వేసుకోవాలని సూచించారు.కాగా,ప్రతి వర్షాకాలంలో ఈ లోలెవెల్ వంతెనల వల్ల గంటల తరబడి రాకపోకలు బంద్ అయి తీవ్ర అవస్థలు పడుతున్నామని హన్మాజీపేట్ చుట్టుపక్కల గ్రామస్తులు,వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.పాలకులు అధికారులు ఇప్పటికైనా స్పందించి ఇక్కడ ఎత్తైన వంతెనలు నిర్మించి తమ సమస్యకు శాశ్వత పరిస్కారం చూపాలని కోరుతున్నారు.

మెరుగైన వైద్య సేవలకు కేరాఫ్ జీజీహెచ్..

బాధ్యతయుతంగా సేవలందించండి..

వైద్య సేవలను ప్రజలు ఉపయోగించుకోవాలి..

రోగులకు ఇబ్బందులు రానీయద్దు..

ఆసుపత్రి పరిసరాలను శుభ్రంగా ఉంచాలి

..కలెక్టర్ చిత్రా మిశ్రా....

ఆకస్మికంగా జిల్లా ప్రధాన ఆస్పత్రి తనిఖీ..

కరీంనగర్ టౌన్, ప్రభాతవార్త:

ప్రభుత్వ ఆసుపత్రుల్లో నాణ్యమైన వైద్య సేవలు అందించి ప్రజల్లో విశ్వాసాన్ని మరింత పెంపొందించాలని కలెక్టర్ చిత్రా మిశ్రా వైద్యాధికారులను ఆదేశించారు. బుధవారం అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడేతో కలిసి జిల్లా ప్రధాన ఆసుపత్రి (జీజీహెచ్)ను ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్, ఆస్పత్రిలోని వివిధ విభాగాలను పరిశీలించి వైద్య సేవలు, మౌలిక సదుపాయాలపై సమగ్ర సమీక్ష నిర్వహించారు.తనిఖీలో భాగంగా సదరం వేయిటింగ్ హాల్, ఫార్మసీ, సిటీ స్కాన్ విభాగం, ఆరోగ్యశ్రీ కౌంటర్, సీనియర్ సిటిజన్ వార్డు, ఎమర్జెన్సీ వార్డు, సర్జికల్ రూమ్, ఓపీ విభాగం, ఆపరేషన్ థియేటర్, ఎన్ఎస్డీ క్లినిక్, పల్మనాలజీ వార్డులను పరిశీలించారు. రోగులతో నేరుగా మాట్లాడి అందుతున్న వైద్య సేవలు, సౌకర్యాలపై ఆరా తీశారు. ఎంసీహెచ్ మాదిరిగా రోగులు, వారి సహాయకులు కూర్చునేందుకు తగిన బెంచీలు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు.ఆస్పత్రిలో ఎక్కడైనా లీకేజీలు, మరమ్మత్తులు అవసరమైన ప్రాంతాలు ఉంటే వెంటనే పూర్తి చేయాలని టీజీఎంఐడీసీ అధికారులను ఆదేశించారు. పరిశుభ్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని, కనీస సౌకర్యాల కల్పనలో ఎలాంటి నిరక్ష్యం ఉండొద్దని సూచించారు. ఫ్లోరింగ్, దెబ్బతిన్న గోడల మరమ్మత్తులు, తాగునీటి సరఫరా, వాటర్ స్టోరేజ్, విద్యుత్ పనులు, అంతర్గత రహదారులు, వైద్యుల గదుల్లో అవసరమైన సౌకర్యాలు, అదనపు బెడ్ల ఏర్పాటు వంటి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు.వర్షపు నీరు ఆస్పత్రి ప్రాంగణంలో నిల్వ కాకుండా చర్యలు తీసుకోవాలని, అవసరమైన వైద్య పరికరాలను సమకూర్చాలని, సీజనల్ వ్యాధుల నియంత్రణకు ప్రత్యేక కార్యాచరణ అమలు చేయాలని సూచించారు. రోగులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా సేవలు అందించాలని, ప్రభుత్వ ఆస్పత్రులపై ప్రజలకు మరింత నమ్మకం కలిగేలా ప్రతి వైద్య సిబ్బంది బాధ్యతాయుతంగా పనిచేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు.తనిఖీ అనంతరం జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ వీరారెడ్డి ఛాంబర్‌లో ఆర్ఎంఓ డాక్టర్ నవీనా, ఇతర వైద్యాధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆస్పత్రిలో పనిచేస్తున్న కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ సిబ్బంది వివరాలు, వారు పనిచేస్తున్న ఏజెన్సీలు, ఆస్పత్రి ఆదాయం వ్యయాలు, నిధుల వినియోగంపై వివరాలు తెలుసుకున్నారు.ప్రతి నెల, మూడు నెలలు, ఆరు నెలలు, వార్షిక ప్రాతిపదికన ఆదాయంవ్యయాల బడ్జెట్ సిద్ధం చేయాలని ఆదేశించారు. ఆస్పత్రికి సంబంధించిన భవనాల అద్దెలు, అంబులెన్సులు, జనరేటర్లు, వైద్య పరికరాలు, ఏసీలు, సీసీ కెమెరాలు, వాహనాల పార్కింగ్ తదితర అంశాలపై సమీక్షి ంచారు. ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి ప్రతి నెల ఒకటో తేదీన వేతనాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని సూచించిన కలెక్టర్, ఆస్పత్రి నిర్వహణలో ఎలాంటి సమస్యలు ఉన్నా తమ దృష్టికి తీసుకొస్తే వెంటనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ వీరారెడ్డి, ఆర్ఎంఓ డాక్టర్ నవీనా, వైద్యాధికారులు, ఇంజినీరింగ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ మరో ఆగ్రనేత..

మిస్రి బిస్రా అరెస్టు.. గణపతి కోసం భద్రత బలగాల గాలింపు..

రెండు రోజుల ముందే.. 15మంది మావోయిస్టులు లొంగుబాటు..

జమ్మికుంట/ హుజూరాబాద్, ప్రభాతవార్త:

దేశంలో 40సంవత్సరాల పాటు 16 రాష్ట్రాలు, సుమారు 200 జిల్లాల పరిధిలో మావోయిస్టు పార్టీ సామ్రాజ్యం విస్తరించడంతో దేశ అంతర్గత భద్రతకు ముప్పు వాటిల్లుతుందన్న సమాలోచనలతో ఎన్డీఏ ప్రభుత్వం ఆయా రాష్ట్ర ప్రభుత్వాల ముఖ్యమంత్రులు, పోలీస్ శాఖ ఉన్నతాధికారులతో సమావేశాలు జరిపి, కఠినమైన నిర్ణయాలు తీసుకుని 2024 జనవరి 1 నుండి, 2026 మార్చి 31వరకు ఆపరేషన్ కగార్-1, ఆపరేషన్ కగార్ -2లు కఠినంగా అమలు చేయడంతో ఎన్‌కౌంటర్‌లలో మరణించే వారు మరణించగా, వేల సంఖ్యలో లొంగిపోయే వారు లొంగిపోయారు. దీనితో మావోయిస్టు పార్టీ, దాని అనుబంధ సంస్థల పునాదులను కూకటి వేళ్లతో పాలక ప్రభుత్వాలు పేకిలించివేసినప్పటికి దేశంలో ఇంక మావోయిస్టు పార్టీ మూలాలు అనేక రాష్ట్రాలలో అక్కడక్కడ పొడచూపుతూనే ఉన్నాయి.

అందులో భాగంగానే మావోయిస్టు కేంద్ర కమిటీ మరో ఆగ్రనేత జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన కేంద్ర కమిటీ ముఖ్య నాయకుడు మిస్రి బిస్రాతో పాటు ఆయన నలుగురు అనుచరులు బుధవారం తెల్లవారుజామున

జార్ఖండ్ రాష్ట్రంలోని దండకారణ్యంలో భద్రత బలగాల గాలింపు చర్యల్లో భాగంగా చుట్టుముట్టిన బలగాలు మిస్రిబిస్రిని అదుపులోకి తీసుకున్నట్లు రాంచీలో పోలీస్ ఉన్నతాధికారులు మీడియాకు వెల్లడించారు. మార్చి 31తర్వాత మావోయిస్టు కేంద్ర కమిటీ ఆగ్రనేత ముప్పాల లక్ష్మణ్‌రావు అలియాస్ గణపతి, తిప్పిరి తిరుపతి అలియాస్ దేవ్‌జీ, మిస్రి బిస్రా అలియాస్ దాదాల కోసం పోలీసులు రేయింబవళ్లు దండకారణ్యాలను జల్లెడ పట్టారు. కొన్ని మాసాల క్రితం దేవ్‌జీ ఆయన అనుచరులను పోలీసులు అరెస్టు చేయగా, ఇప్పుడు మిస్రి బిస్రాను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు ఆయనతో పాటు ఆయన అనుచరులను కూడా పోలీసులు అరెస్టు చేసినట్లు తెలుస్తుంది. ఈ ఆగ్రనేత అరెస్టుకు ముందు గత 15రోజుల క్రితం మావోయిస్టు పార్టీకి చెందిన జార్ఖండ్ రాష్ట్ర దండకారణ్యంలో వివిధ హోదాలలో పనిచేస్తున్న ముఖ్యమైన 15మంది మావోయిస్టులు రాష్ట్ర పోలీస్ ఉన్నతాధికారుల ముందు లొంగిపోవడం గమనార్హం. మార్చిలో టార్గెట్ ముగిసినప్పటికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అధేశాల మేరకు భద్రత బలగాలు యదావిధిగా పక్కా సమాచారం ఉన్న దండకారణ్యాలను జల్లెడ పడుతూ వచ్చారు. ఈ నాలుగు మాసాల కాలంలో పలువురు మావోయిస్టులు లొంగిపోయినప్పటికి చత్తీస్‌ఘడ్ రాష్ట్రం బీజాపూర్, దంతెవాడ, కాంకేర్, కర్రెగుట్టల ప్రాంతాలలో పోలీస్ భద్రత బలగాలకు మావోయిస్టుల ఆయుదాల డంపులు లభించాయి.

ఈ పరిణామాలలో భాగంగానే మావోయిస్టు పార్టీలో మిగిలిపోయిన పలు రాష్ట్రాలకు చెందిన కొంత మంది ఆగ్రనేతలు అక్కడక్కడ గణపతితో పాటు అజ్ఞాతంలో ఉన్నట్లు గుర్తించిన కేంద్ర పోలీస్ ఇంటలిజెన్స్ వర్గాలు పక్కా సమాచారంతో కీలక నేత మిస్రి బిస్రాను జార్ఖండ్ పోలీసులు దన్‌బాద్ దండకారణ్యంలో అరెస్టు చేసినట్లు తెలుస్తుంది. గిరిడి ఆఫ్‌లోని అర్లాడిఫ్‌కు చెందిన మిస్రి బిస్రా 40 సంవత్సరాల పాటు మావోయిస్టు పార్టీలో జార్ఖండ్, చత్తీస్‌ఘడ్, బీహార్, ఒడిస్సా ఎవోబి ప్రాంతాలలో మావోయిస్టు పార్టీలలో వివిధ హోదాలలో పని చేసినట్లు పోలీస్ వర్గాలు వెల్లడించాయి. మావోయిస్టు పార్టీలో మిస్రి బిస్రా కీలక పాత్ర పోషించడంతో భద్రత బలగాలు మోస్ట్ వాంటెడ్ జాబితాలో మిస్రి బిస్రా ఉన్నారు. గెరిల్ల ఉద్యమంలో ఆరితేరిన బిస్రా అనేక రాష్ట్రాలలో శిక్షణ తరగతులు నిర్వహించేవారని అధికారులు వెల్లడించారు. మిస్రి బిస్రాపై పలు రాష్ట్రాలలో సుమారు 2 కోట్ల నగదు రివార్డు ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు. ఈయన అంతరంగిక భద్రత కమాండర్ సంతోష్ మహతో అలియాస్ వాసు దాదా అరెస్టు అయ్యారు.

గణపతి కోసం భద్రత బలగాల గాలింపు..

దేశంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను మావోయిస్టు ఉద్యమం ద్వారా అనేక రాష్ట్రాలలో సమాంతర ప్రభుత్వాలను (జనతా సర్కార్) నడిపించిన మావోయిస్టు ఆగ్రనేత కురు వృద్ధుడు, ముప్పాల లక్ష్మణ్‌రావు అలియాస్ గణపతి కోసం ఉత్తర భారతంలోని ఐదు రాష్ట్రాల పరిధిలో కేంద్ర ఎన్ఐఏ, పోలీస్ ఇంటలిజెన్స్ వర్గాలు అందించిన సమాచారంతో దండకారణ్యంలో భద్రత బలగాలు గణపతి కోసం అడుగడుగున జల్లెడ పడుతున్నట్లు సమాచారం. మావోయిస్టు పార్టీలో మిస్రి బిస్రా కేంద్ర మావోయిస్టు పార్టీ పొలీట్ బ్యూరో చివరి సభ్యుడని జార్ఖండ్ పోలీసులు చెబుతుండగా, మరో ఇద్దరు ఉత్తర భారతానికి చెందిన ఆగ్రనేతలు ఉన్నట్లు తెలుస్తుంది. మావోయిస్టు పార్టీ ఆగ్రనేత లక్ష్మణ్‌రావు ఒక్కడిని ప్రాణాలతో పట్టుకుంటే ఇక దేశంలో మావోయిస్టు పార్టీ కలాస్ అయినట్లేనని ప్రభుత్వాలు భావిస్తున్నాయి. మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ ఆగ్రనేత గణపతికి ఆయన అంగరక్షకులు గెరిల్ల యుద్ధంలో ఆరితేరిన ఎన్‌కౌంటర్‌లో మృతి చెందిన హెడ్మాలాంటి కమాండోలు 150-200 వరకు నాలుగు అంచెల వ్యవస్థలో ఆయన భద్రత వలయం ఉంటుందని దండకారణ్యంలో ఉన్న మరెక్కడ ఉన్న ఆయన జాడ కనిపెట్టడం అంతా ఆషామాషీ కాదని పోలీసులు ఎదుట లొంగిపోయిన కేంద్ర, రాష్ట్ర కమిటీల ఆగ్రనేతలు అంటున్నారు. ఆ ఒక్కడు పోలీసులకు చిక్కితే ఉద్యమ ప్రస్థానం ముగిసినట్లుగానే విప్లవ కార్యాకలాపాల పరిశీలకులు భావిస్తున్నారు.



కరీంనగర్ వార్త



డ్రగ్ డిస్పోజల్ కమిటీ ఆధ్వర్యంలో గంజాయి దహనం

38 కేసుల్లో పట్టుబడిన 63.621 కిలోల గంజాయి,

। గంజాయి మొక్క దగ్ధం పోలీస్ కమీషనర్ గౌస్ ఆలం.

కరీంనగర్ క్రైమ్, ప్రభాతవార్త:

కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని వివిధ పోలీస్ స్టేషన్లలో నమోదైన 38 కేసుల్లో స్వాధీనం చేసుకున్న 63 కిలోల 621 గ్రాముల



గంజాయి ఒక గంజాయి మొక్కను ధ్వంసం చేసినట్లు సిపి గౌస్ ఆలం ఒక ప్రకటనలో తెలిపారు.మానకొండూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని ఈదులగట్టెపల్లి గ్రామంలో ఉన్న వెంకటరమణ ఇన్సినేటర్‌లో సిపి సమక్షంలో డ్రగ్ డిస్పోసల్ కమిటీ ఆధ్వర్యంలో ఈ గంజాయిని దహనం చేసినట్లు ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఏసీపీలు శ్రీనివాస్ జి , వెంకటస్వామి ఇన్స్పెక్టర్లు రఫీక్ , శ్రీలత ,ఆర్ఐలు రజినీకాంత్ , శ్రీధర్ రెడ్డి అలాగే ఇన్సినరేటర్ ప్లాంట్ కు చెందిన తిరుపతి , ప్రభాకర్ రెడ్డిలతో పాటు ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పచ్చని భవిష్యత్తుకు నాంది వన మహోత్సవం

చిగురుమామిడి, ప్రభాత వార్త :

చిగురుమామిడి మండలం గాగిరెడ్డిపల్లి గ్రామంలో గ్రామ సర్పంచ్ సన్నిల్ల కవిత ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వన మహోత్సవం కార్యక్రమం బుధవారం రోజున ప్రారంభించడం జరిగింది. ఇట్టి కార్యక్రమానికి తిమ్మాపూర్ ఎక్సైజ్ ఎస్సై భారతి హాజరై చెరువు కట్ట కు ఇరువైపులా ఖర్జూర, ఈత చెట్లను నాటడం జరిగింది.సర్పంచ్, ఎక్సైజ్ ఎస్సై మాట్లాడుతూ వన మహోత్సవం అనేది భారతదేశంలో ప్రతి సంవత్సరం జూలై మొదటి వారంలో 1వ తేది నుండి 7 వరకు నిర్వహించే ఒక వారం రోజుల చెట్ల పెంపక పండుగ అని, దీని యొక్క ప్రధాన ఉద్దేశం భారీ ఎత్తున మొక్కలు నాటడం, పర్యావరణాన్ని రక్షి ంచడం అటవీ సంపద ప్రాముఖ్యతపై ప్రజల్లో అవగాహన కల్పించడం. ఈ కార్యక్రమని 1950 లో కేంద్ర మాజీ మంత్రి డాక్టర్ కే ఎం మున్షి ప్రారంభించారు. దేశంలో వర్షాకాలం నైరుతి రుతుపవనాలు ప్రారంభమయ్యే సమయం కావడంతో మొక్కలు త్వరగా పెరగడానికి జూలై మొదటి వారాన్ని ఎంపిక చేశారు. ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశం భూమిపై పచ్చదనాన్ని పెంచడం,కాలుష్యాన్ని తగ్గించి, పర్యావరణ సమతుల్యతను కాపాడడం. నేల కోతను నివారించడం భూగర్భ జలాలను పెంపొందించడం, పండ్ల మొక్కలు, కలప, పశువులకు కావలసిన మేతను అందించే చెట్లను కూడా ప్రోత్సహించడం కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశమని అన్నారు ఈ కార్యక్రమంలో సర్పంచ్ సన్నిల్ల కవిత ఎక్సైజ్ ఎస్సై భారతి వార్డు సభ్యులు వెంకటేశం, మంద శ్రీనివాస్, అన్నవేణి శ్రీనివాస్, మాజీ సర్పంచ్ వెంకటేష్, పంచాయతీ కార్యదర్శి సంపత్, ఫీల్డ్ అసిస్టెంట్ శంకర్, మహిళా సమైక్య సిఏ లు లత, రమ, గౌడ సంఘ సభ్యులు మధు, వెంకటేశం, శేఖర్, భిక్షపతి, రాజేశం, సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.



ఘనంగా నేత్రదాత ఆకినపల్లి వెంకట లక్ష్మిసంస్మరణ సభ...

జమ్మికుంట టౌన్ ప్రభాతవార్త:

నేత్రదాత ఆకినపల్లి వెంకటలక్ష్మి (70) సంస్మరణ సభ కరీంనగర్ జిల్లా జమ్మికుంట పట్టణంలోని పాత గ్రేయిన్ మార్కెట్ రోడ్ లో ఉన్న వారి నివాసంలోబుధవారం రోజున సదాశయ ఫౌండేషన్ కరీంనగర్ జిల్లా అధ్యక్షులు మచ్చగిరి నరహరి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ



సందర్భంగా నేత్ర దాతకు నివాళులు అర్పించి వారి కుటుంబసభ్యులందరికి సదాశయ పౌండేషన్ ప్రతినిధులు అభినందనలు తెలిపారు.ఆకినపల్లి వెంకటలక్ష్మి 18726 రోజున గుండెపోటుతో మరణించగా వారి నేత్రాలను దానం చేసి ఇద్దరి అందులకు చూపును ప్రసాదించారు.ఈ సందర్భంగా సంస్కరణ సభకు వచ్చిన బంధుమిత్రులకు శ్రేయోభిలాషులకు అధ్యక్షులు మచ్చగిరి నరహరి, గర్రెపల్లి వెంకటేశ్వర్లు (డీలర్) నేత్ర అవయవ శరీర దానాలపై అవగాహనకల్పించారు.ఈ సందర్భంగా భర్త కాశీ విశ్వనాథం, కుమారులు కిషోర్ కుమార్, కిరణ్ కుమార్, కుటుంబ సభ్యులకు జ్ఞాపికను అందజేసి ధన్యవాదాలుతెలిపారు.ఈ కార్యక్రమంలో సదాశయ ఫౌండేషన్ ప్రతినిధులు గర్రెపల్లి వెంకటేశ్వర్లు.ముస్యాల జగదీశ్వర్, చిదురాల శ్రీనివాస్,వంగల రమేష్ ,మద్దెర్ల సారంగపాణి, ఒల్లాల బాపు శెట్టి,రావికంటి రవీందర్ యోగా సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగములో చేసిన సేవలే చిరస్థాయిగా నిలుస్తాయి..

జిల్లా విద్యాధికారి..పదవి విరమణ పొందుతున్న ప్రిన్సిపాల్ రాజిరెడ్డికి ఘనసన్మానం.

వీణవంక, ప్రభాత వార్త:

ప్రతి ఉద్యోగి,తన ఉద్యోగములో చేసిన సేవలే చిరస్థాయిగా నిలుస్తాయనీ జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి ఆంజనేయ రావు అన్నారు. వీణవంక మండల కేంద్రంలో నీ వీణవంక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ గా పనిచేస్తూ,ఈ నెల 31న పదవి విరమణ పొందనున్న కొల్ల రాజిరెడ్డి పదవి విరమణ సన్మాన, అభినందన సభ బుధవారం మండల కేంద్రంలో నీ గణపతి ఫంక్షన్ హాల్ ఘనంగా జరిగింది. దీనికి ముఖ్య అతిథిగా హాజరైన ఆంజనేయ రావు తో పాటు గ్రామ సర్పంచ్ దాసారపు సరోజన రాజేంద్రప్రసాద్,మాజీ వైస్ ఎంపీపీ రాయిశెట్టి లత శ్రీనివాస్,సహచర ప్రిన్సిపాల్ లు, అధ్యాపకులు, బంధువులు, స్నేహితులు , విద్యార్థులు రాజిరెడ్డి దంపతులను ఘనంగా సన్మానించారు. అనంతరం విద్యాధికారి తో పాటు సహచర అధ్యాపకులు మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాల పాటు అంకితభావం తో, నిజాయితితో,క్రమశిక్షణతో సేవలందించారని కొనియాడారు.విధి నిర్వహణలో సమర్థత, బాధ్యతాయుతమైన వ్యవహారశైలి, సహోద్యోగులతో సత్సంబంధాలు కలిగి కళాశాలకు గుర్తింపు తీసుక వచ్చారన్నారు. ప్రతి ఉద్యోగి బదిలీ,పదవి విరమణ తప్పని సరన్నారు. ఉద్యోగ విరమణ అనేది సేవా జీవితానికి ముగింపు మాత్రమేనని,సమాజ సేవకు ముగింపు లేదన్నారు. రాజిరెడ్డి దంపతులు పదవి విరమణ అనంతరం ఆరోగ్యంగా, ఆనందంగా కుటుంబ సభ్యులతో కలిసి సుఖ సంతోషాలతో ఉండాలని ఆకాంక్షి ంచారు. ఈ కార్య క్రమంలో ప్రిన్సిపాల్ల సంఘం జిల్లా అధ్యక్షుడు మహేందర్, జూనియర్ లెక్చరర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ రెడ్డి,ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ సత్యవర్ధనావు,ప్రిన్సిపాల్లు సత్యనారాంజనేయ,రాజేశ్వర్ రావు, శశిధర్ రెడ్డి, ఉద్యోగ సంఘం జిల్లా నేత బల్బీర్ సింగ్, టిజిఓ జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు రామ్ మోహన్,లైబ్రేరియన్ అసోసియేషన్ నేత రాజకుమార్,అధ్యాపకులు భాస్కర్,రామ్మోహనరావు,కత్తెర శాల,రవీందర్,



వరదమంపు ప్రాంతాలను పరిశీలించిన మున్సిపల్ చైర్మన్...

జమ్మికుంట టౌన్ ప్రభాతవార్త:

జమ్మికుంట మున్సిపాలిటీ పరిధిలోని వరద ముంపు ప్రాంతాలను బుధవారం జమ్మికుంట మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ (దిలీప్) పరిశీలించారు.జమ్మికుంట మున్సిపాలిటీ పరిధిలోని 6వ వార్డులో



గల హౌసింగ్ బోర్డ్ కాలనీ గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు వరద నీరు, హుజురాబాద్ రోడ్డు నుండి వచ్చే నీరు శ్రీరామ హాస్పిటల్ ఏరియాలో వరద కాలువలో ప్లాస్టిక్ కవర్స్ ప్లాస్టిక్ బాటిల్స్ చెత్త డ్రైన్ లో ఇరుక్కుపోవడం వల్ల వర్షపు నీరు వెళ్లకుండా అడ్డుగా ఉన్నటువంటి చెత్తాచెదారం మున్సిపల్ జెసిబి వాహనంతో మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్,6వ వార్డు కౌన్సిలర్ శ్రీపతి స్వర్ణలత నరేష్ గౌడ్ దగ్గరుండి చెత్తాచెదారాన్ని శుభ్రం చేయించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

ఈవి బైక్స్ షో రూమ్ ప్రారంభం.

వీణవంక, ప్రభాత వార్త:

వీణవంక మండల కేంద్రంలో అమిత్ ఇండియా ఈవి బైక్స్ షో రూమ్ ను బుధవారం గ్రామ సర్పంచ్ దాసారపు సరోజన రాజేంద్రప్రసాద్,ఉప సర్పంచ్ తాళ్ళ పల్లి మహేష్, అమిత్ ఇండియా ఫౌండర్ ఎడ్ల ఉప్పల్ రెడ్డి,



రామిడి శ్రీనివాసులు సంయుక్తంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు తోడ్పడే విద్యుత్ వాహనాల వినియోగం రోజు రోజుకు పెరుగుతోందని ,దీంతో వినియోగదారులకు నాణ్యమైన సేవలు,అత్యుత్తమ ఈవి బిక్స్ అందుబాటులోకి తీసుక రావడమే లక్ష్యమన్నారు.ఉప సర్పంచ్,కట్ కోయిల సంపత్ అతిథులను ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు,వ్యాపార వేత్తలు,యువత,స్థానిక ప్రముఖులు అధిక సంఖ్యలో పాల్గొని షో రూమ్ యజమానులకు శుభాకాంక్షలు తెలిపారు.

వీణవంకలో వేద పండితుడి కి గురు పూజోత్సవం.

వీణవంక, ప్రభాత వార్త:

గురు పూజోత్సవం ను పురస్కరించుకొని బుధవారం వీణవంక మండల కేంద్రంలో నీ ప్రముఖ వేద పండితుడు గూడ జగదీశ్వర శర్మ దంపతులకు జిల్లా భారతీయ జనతా పార్టీ అధ్యక్షుడు గంగాడి తిరుపతి రెడ్డి తన నేతలతో కలిసి సన్మానం చేశారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు పుప్పాల రఘు,అశోక్,అప్పని కొమురయ్య,వివిధ గ్రామాల నేతలు పాల్గొన్నారు.



హుజూరాబాద్ వార్త



కొండగట్టు అంజన్న.. దేశం, రాష్ట్రంతో పాటు హుజురాబాద్ నియోజకవర్గ ప్రజలు సుబిక్షంగా ఉండాలి..

గిరి ప్రదక్షణలో ఓడితల ప్రణవ్.. కోటి మొక్కులు..

జమ్మికుంట/ హుజూరాబాద్ , ప్రభాతవార్త:

దేశంతో పాటు తెలంగాణ రాష్ట్రం, కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ నియోజకవర్గ ప్రజలు సమృద్ధిగా వర్షాలు కురసి పాడి పంటలతో సుభిక్షంగా, సుఖ సంతోషాలతో ఉండాలంటూ కొండగట్టు అంజన్నకు బుధవారం హుజూరాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ఓడితల ప్రణవ్, రాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, చొప్పదండి శాసనసభ్యులు మేడిపల్లి సత్యం, ఎమ్మెల్యే సంజయ్ కుమార్‌తో పాటు కలిసి కొండగట్టు అంజన్న గిరిప్రదక్షిణ చేసారు.

పరమ దైవ భక్తుడైన ఓడితల ప్రణవ్ రెండు రోజులుగా జోరు కురుస్తున్న వర్షాన్ని సైతం లెక్కచేయకుండా కొండగట్టులో సాగిన గిరి ప్రదక్షిణలో ఆయన వెంట నియోజకవర్గానికి చెందిన పలువురు కాంగ్రెస్



నేతలు పాల్గొనడం గమనార్హం. ఈ సందర్భంగా ఓడితల ప్రణవ్ మాట్లాడుతూ దేశంలో, రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురవాలని, యావత్తు రైతులు ఎల్‌నినో నుండి బయట పడాలని పాడి పంటలతో రాష్ట్రం సుబిక్షంగా ఉండాలని కొండగట్టు అంజన్నకు కోటి మొక్కులు మొక్కినట్లు ఓడితల ప్రణవ్ వెల్లడించారు. వర్షం కురుస్తున్నప్పటికి ఆంజనేయస్వామి.. శ్రీ సీతరామచంద్రస్వామి నామస్మరణతో పాటు గురుపౌర్ణమి సందర్భంగా జన్మనిచ్చిన తల్లిదండ్రులు, విద్యనేర్పిన గురువులు, ఆదిశంకర చార్యులు వంటి జగద్గురుల నామస్మరణతో గిరి ప్రదక్షిణ సంతోషంగా జరిగిందన్నారు. కొండగట్టు ఆంజనేయాస్వామి ఆశీస్సులు హుజురాబాద్ నియోజకవర్గ ప్రజలపై సర్వకాల సర్వ వ్యవస్థల యందు ఉండాలని భగవంతున్ని ప్రార్థించినట్లు ఆయన పేర్కొన్నారు. ప్రపంచ వ్యాప్తంగా వాతవరణ శాస్త్రవేత్తలు ఎల్‌నినోపై ఆందోళన వ్యక్తం చేస్తుండగా ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి మాత్రం ఇది కాంగ్రెస్ పార్టీ తెచ్చిన కరువని మాట్లాడడం ఆయన ఆవివేకానికి నిదర్శనమన్నారు. ఆయనే ఒక శాస్త్రవేత్తగా మాట్లాడడం సిగ్గుచేటన్నారు. రాష్ట్ర ప్రజలను ఇబ్బంది పెట్టే కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు పనిచేస్తున్నారని ప్రణవ్‌బాబు తీవ్రంగా ఆగ్రహం వ్యక్తం చేసారు. ఈ కార్యక్రమంలో మున్నురుకాపు కార్పోరేషన్ అధ్యక్షులు బోమ్మ శ్రీనివాస్, హుజురాబాద్ ప్రాంతానికి చెందిన నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

జమ్మికుంటలో విషాదం..

వ్యవసాయ పనులలో ట్రాక్టర్ బొల్తా రైతు దుర్మరణం..

జమ్మికుంట/ హుజూరాబాద్ , ప్రభాతవార్త: కరీంనగర్ జిల్లా జమ్మికుంట పట్టణ శివారులో బుధవారం రైతు ఆరుకాల కుమారస్వామి తన సొంత పొలాన్ని ట్రాక్టర్‌తో దున్నుతుండగా ప్రమాదవశాత్తు ట్రాక్టర్ అదుపుతప్పి బొల్తా పడడంతో రైతు కుమారస్వామి (50) ట్రాక్టర్ కింద ఇరుక్కుపోయి అక్కడిక్కడే మృతి చెందారు. ఆ సమీపాన ఉన్న రైతులు ప్రమాదాన్ని గుర్తించి పరుగెత్తుకు వచ్చి సహాయ చర్యలు చేపట్టిన అప్పటికే రైతు కుమారస్వామి మృతి చెందినట్లు పరిసర ప్రాంత రైతులు తెలిపారు. దీనితో మృతుని కుటుంబం కన్నీరు మున్నీరుగా విలపిస్తుండగా జమ్మికుంటలో విషాద చాయలు నెలకొన్నాయి. రైతు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. జమ్మికుంట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



భారీ వర్షాల వేళ అత్యవసరమైతేనే బయటకు రండి

పెద్దపల్లి డీసీపీ రామ్ రెడ్డి

పెద్దపల్లి జిల్లా బ్యూరో (గోదావరిఖని క్రైం), ప్రభాతవార్త:



భారీ వర్షాల వేళ అత్యవసరమైతేనే బయటకు రావాలని పెద్దపల్లి డీసీపీ రామ్ రెడ్డి తెలిపారు. గురువారం రామగుండం పోలీస్ కమిషనరేట్ పెద్దపల్లి జోన్ గోదావరిఖని వన్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని మల్కాపూర్, మెడికల్ కళాశాల, 5 ఇంక్లైన్ తదితర ప్రాంతాలలో భారీ వర్షాల కారణంగా నాలాల నుంచి ప్రవహించే నీరు రోడ్డుపైకి చేరడంతో మున్సిపల్ కమీషనర్, మేయర్ మహంకాళి స్వామి, గోదావరిఖని ఏసీపీ రమేష్, గోదావరిఖని వన్ టౌన్ ఇన్స్పెక్టర్ ఇంద్రసేనారెడ్డిలతో కలిసి క్షేత్రస్థాయిలో వరద పరిస్థితులను నేరుగా పరిశీలించారు. జిల్లా వ్యాప్తంగా వర్షాలతో వరద ప్రవాహం తీవ్రంగా ఉన్నందున ప్రజలు అత్యవసర పరిస్థితి ఉంటే తప్ప ఇళ్ల నుంచి బయటకు రావద్దని కోరారు. అదేవిధంగా అన్ని శాఖల అధికారులు నిరంతరం అప్రమత్తంగా ఉంటూ సహాయక చర్యలకు సిద్ధంగా ఉండాలని పలు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ, కురుస్తున్న భారీ వర్షాల వల్ల వాగులు, వంకలు, చెరువులు, నదులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయని, ప్రమాదకరమైన ఆ నీటి ప్రవాహాల వద్దకు ఎవరూ వెళ్లకూడదని స్పష్టం చేశారు. ముఖ్యంగా గోదావరి, మానేరు నది పరివాహక ప్రాంతాల్లో నివసించే ప్రజలు అత్యంత జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు. రోడ్లపై వర్షపు నీరు చేరడం వల్ల ప్రయాణించే వాహనాలు స్కిడ్ అయ్యే ప్రమాదం ఉందని, కాబట్టి వాహనదారులు వేగాన్ని తగ్గించి పరిమిత వేగంతో మాత్రమే వాహనాలు నడపాలని సూచించారు. చిన్నపిల్లలు, యువత సరదా కోసం చెరువులు, నదుల వద్దకు వెళ్లి సెల్ఫీలు తీసుకోవడం లేదా ఈత కొట్టడానికి యత్నించడం వంటివి చేయకుండా తల్లిదండ్రులు ప్రత్యేక దృష్టి సారించి వారిని నివారించాలన్నారు. ఎలాంటి విపత్కర పరిస్థితులు ఎదురైనా ప్రజలకు సేవలందించడానికి జిల్లా పోలీసు అధికారులు, సిబ్బంది ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటారని తెలిపారు. అత్యవసర సహాయం కావాల్సిన వారు వెంటనే డయల్ 100 కి లేదా స్థానిక పోలీసు అధికారుల ఫోన్ నంబర్లకు సంప్రదించాలని డీసీపీ వెల్లడించారు.

ఉపసర్పంచ్‌లు, వార్డు సభ్యులకు గౌరవ వేతనం మంజూరు చేయాలి

తెలంగాణ ఉపసర్పంచ్ ఫోరం జిల్లా అధ్యక్షుడు జంగ్ అనిల్

పెద్దపల్లి, ప్రభాతవార్త:



ఉపసర్పంచ్‌లు, వార్డు సభ్యులకు గౌరవ వేతనం మంజూరు చేయాలని తెలంగాణ ఉపసర్పంచ్ ఫోరం పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు జంగ్ అనిల్ డిమాండ్ చేశారు. బుధవారం జిల్లాలోని 262 గ్రామ పంచాయతీలకు సంబంధించి కొత్తగా ఎన్నికైన ప్రజాప్రతినిధులు స్థానికంగా ఎదుర్కొంటున్న సవాళ్లను తొలగించాలని డిమాండ్ చేస్తూ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు బొట్ల కార్తీక్ పిలుపు మేరకు జిల్లా అధ్యక్షుడు జంగ్ అనిల్ నేతృత్వంలో ప్రతినిధి బృందం జిల్లా అదనపు కలెక్టర్‌ను కలసి వినతిపత్రం సమర్పించింది. ఈ సందర్భంగా ప్రతినిధులు గ్రామాల్లోని పరిస్థితులను జిల్లా అధికారికి వివరించారు. అనంతరం వారు మాట్లాడుతూ పల్లెల పురోగతి కోసం శ్రమిస్తున్న ఉపసర్పంచ్‌లకు, వార్డు సభ్యులకు తగిన హోదా, హక్కులు, భత్యం అందించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఇందులో భాగంగా ఉపసర్పంచ్‌లకు ప్రతి నెలా 5,000 రూపాయలు, వార్డు సభ్యులకు 3,000 రూపాయల చొప్పున గౌరవ వేతనం చెల్లించాలని సూచించారు. గ్రామాల్లో ప్రారంభించే పనుల శంకుస్థాపన, ప్రారంభోత్సవ శిలాఫలకాలపై వీరి పేర్లను ముద్రించేలా చర్యలు తీసుకోవాలన్నారు. పంచాయతీ నిధుల వ్యయం, పనుల బిల్లులు, తీర్మానాలు, చెక్కుల జారీ ప్రక్రియలో ఉపసర్పంచ్‌ల సంతకాలను తప్పనిసరి చేయాలని కోరారు. మండల స్థాయి అభివృద్ధి సమావేశాల్లో తమకు భాగస్వామ్యం కల్పించి గౌరవించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మేరుగు జంపన్న జానీ, నాయకులు బోనగిరి అజయ్ కుమార్, ఎలిగేటి మల్లేశం, తీగుల్ల సతీష్ రెడ్డి, బరత స్వామి, సామల నాగభూషణం, అరిగె రవికుమార్, తమ్మనవేణి రాజయ్య, కత్తెర్ల లచ్చయ్య, తడ్వాయి ప్రమోద్ రెడ్డి, కోల తిరుపతి, బెజ్జంకి యమున రాజేందర్, అయిలవేని తిరుపతి, దయ్యాల రజిత, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీ యోగానంద లక్ష్మీనరసింహస్వామి గిరి ప్రదక్షణ

జూలపల్లి, ప్రభాతవార్త:

జూలపల్లి మండలం పెద్దాపూర్ గ్రామంలో బుధవారం గురు పూర్ణిమ సందర్భంగా పెద్దాపూర్ శివారులోని గుట్ట పై స్వయంభు గా కొలువైన శ్రీ యోగనంద లక్మినర్సింహ స్వామి క్షేత్రంలో 5వ గిరిప్రదక్షిణ కన్నుల పండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని, లక్మినర్సింహ స్వామి కి మొక్కలు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచుల ఫోరం మండల అధ్యక్షులు, సర్పంచ్ తొగరు శ్రీనివాస్, అబ్బాపూర్ సర్పంచ్ దండే వెంకటేశ్వర్లు, తేలుకుంట సర్పంచ్



నాంపల్లి సంపత్ కుమార్, బాలరాజ్ పల్లె సర్పంచ్ కుంటూరి అంజమ్మ లక్ష్మయ్య, సిపెళ్లి గోపాలకృష్ణ, హనుమాన్ భక్త మండలి సభ్యులు బుర్ర నర్సయ్య, అల్లాడి వెంకట నరసయ్య, కంకణాల శ్రీనివాస్, సంకేండ్ల లక్మరాజం, ఆలయ అర్చకులు శ్రీనివాస చార్యులు, కృష్ణమాచార్యులు, గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

భారీ వర్షాల వేళ ఇళ్ల నుంచి బయటకు రావద్దు

పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష

ప్రభావిత ప్రాంతాలను పరిశీలించిన కలెక్టర్, మున్సిపల్ చైర్మన్

పెద్దపల్లి, ప్రభాతవార్త: భారీ వర్షాల వేళ ఇళ్ల నుంచి బయటకు రావద్దని పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష తెలిపారు. గురువారం గత రెండు రోజుల నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా పెద్దపల్లి మున్సిపల్ పరిధిలోని చందపల్లి 17 వార్డ్ పెద్దమ్మ నగర్ ఎస్ ఆర్ ఎస్పి కాలువ, రంగంపల్లి 11 వార్డ్ సాయి గార్డెన్ వద్ద, రాంపల్లి డబుల్ బెడ్ రూంల వద్ద ఇండ్లలోకి వర్షపు నీరు చేరింది. ఈ నేపథ్యంలో కలెక్టర్ కోయ శ్రీ హర్ష, మున్సిపల్ చైర్మన్ నూగిల్ల మల్లయ్య ఆయా పరిసరాలను నేరుగా పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రెండు రోజుల నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల వల్ల పట్టణ ప్రజలు అత్యంత జాగ్రత్తగా ఉండాలని, అత్యవసరమైతే తప్ప ఎవరూ ఇళ్ల నుంచి బయటకు రాకూడదని సూచించారు. ప్రజలకు సహాయంగా నిరంతరం మున్సిపల్ కమిషనర్, తోటి కౌన్సిలర్లు, మున్సిపల్ సిబ్బంది అందుబాటులో ఉంటారని తెలిపారు. రాంపల్లి డబుల్ బెడ్ రూంల వద్ద వరద ఉధృతి ఎక్కువగా ఉన్నందున బాధితుల కోసం తక్షణ ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఆకుల వెంకటేష్, స్థానిక కౌన్సిలర్లు పూదరి మహేందర్, తోట ఫణిందర్ భూపతి, మొలుగూరి కమల్, అక్కేపల్లి సుజాత క్రాంతి, నదీమ్, తూముల లత సుభాష్, జూనియర్ అసిస్టెంట్లు రమాకాంత్, సురేందర్, వార్డ్ ఆఫీసర్లు, సానిటరీ ఇన్స్పెక్టర్ పులిపాక రాజు, జవాన్ బొంగోని అనిల్, ఇతర మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.




పెద్దపల్లి
వార్త

చిల్డ్రన్ హోమ్ నుంచి ఇద్దరు బాలికలు అదృశ్యం

బాలికల ఆచూకీ తెలిస్తే వెంటనే సమాచారం ఇవ్వండి: పోలీసులు

సుల్తానాబాద్, ప్రభాతవార్త:



సుల్తానాబాద్ పట్టణంలోని మార్కండేయ కాలనీలో ఉన్న చిల్డ్రన్ హోమ్ నుంచి ఇద్దరు బాలికలు అదృశ్యమైన ఘటన ఆందోళన కలిగిస్తోంది. ఈ ఘటనపై చిల్డ్రన్ హోమ్ సూపరింటెండెంట్ వనిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పోలీసుల కథనం ప్రకారం, 16 సంవత్సరాలు మరియు 8 సంవత్సరాల వయస్సు గల ఇద్దరు బాలికలు మంగళవారం రాత్రి సమయంలో చిల్డ్రన్ హోమ్ ప్రహరీ గోడ దూకి వెళ్లిపోయారు. సిబ్బంది వెంటనే పరిసర ప్రాంతాల్లో గాలించినప్పటికీ వారి ఆచూకీ లభించలేదు. దీంతో చిల్డ్రన్ హోమ్ సూపరింటెండెంట్ వనిత సుల్తానాబాద్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, పోలీసులు కేసు నమోదు చేసి ప్రత్యేక బృందాలతో గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. అదృశ్యమైన బాలికల ఫొటోలు విడుదల చేసిన పోలీసులు, వారి ఆచూకీ తెలిసిన వారు వెంటనే సుల్తానాబాద్ ఎస్సై 8712656511 లేదా సుల్తానాబాద్ సీఐ 8712656510 నంబర్లకు సమాచారం అందించాలని విజ్ఞప్తి చేశారు. ప్రజల సహకారంతో బాలికలను త్వరితగతిన గుర్తించేందుకు అన్ని చర్యలు చేపడుతున్నట్లు పోలీసులు తెలిపారు

వరద ప్రభావిత ప్రాంతాల్లో అధికారుల పరిశీలన

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి: ఎంపీడీఓ, ఎస్ఐ

ఓదెల, ప్రభాతవార్త:



ఇటీవల కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో ఓదెల మండలం కొలనూర్ గ్రామంలో వరద ప్రభావిత ప్రాంతాలను ఓదెల ఎంపీడీఓ అనిల్ రెడ్డి, పోత్కపల్లి ఎస్ఐ సనత్ రెడ్డి బుధవారం సంయుక్తంగా పరిశీలించారు. గ్రామంలోని రహదారులు, కల్వర్టులు (కాజ్‌వేలు), వర్షపు నీరు నిలిచిపోయిన లోతట్టు ప్రాంతాలను ప్రత్యక్షంగా సందర్శించిన అధికారులు పరిస్థితిని సమీక్షించారు. వర్షపు నీటి ప్రవాహం అధికంగా ఉన్న ప్రాంతాల్లో ప్రజలు, వాహనదారులు అత్యంత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ వాగులు, వంకలు ఉప్పొంగి ప్రవహిస్తున్నందున వరద నీరు పారుతున్న రహదారులు, కల్వర్టులను దాటేందుకు ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రయత్నించవద్దని ప్రజలను హెచ్చరించారు. చిన్న పిల్లలను నీటి ప్రవాహాలు ఉన్న ప్రాంతాలు, ప్రమాదకర ప్రదేశాల వద్దకు వెళ్లకుండా తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. అదేవిధంగా ఏదైనా అత్యవసర పరిస్థితి తలెత్తిన వెంటనే స్థానిక రెవెన్యూ, పోలీసు అధికారులకు సమాచారం అందించి వారి సూచనలను పాటించాలని ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ పరిశీలనలో అధికారులతో పాటు స్థానిక సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

సన్న బియ్యం అర్హులకే అందేలా కట్టుదిట్టమైన పర్యవేక్షణ

అదనపు రెవెన్యూ కలెక్టర్ శ్రీరాములు

పెద్దపల్లి జిల్లా బ్యూరో, ప్రభాతవార్త: జిల్లాలో ప్రభుత్వం ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా పంపిణీ చేస్తున్న సన్న బియ్యం అర్హులైన బీపీఎల్ కుటుంబాలు, విద్యాసంస్థలకు మాత్రమే చేరేలా కట్టుదిట్టమైన పర్యవేక్షణ చేపట్టాలని అదనపు రెవెన్యూ కలెక్టర్ బి. శ్రీరాములు అధికారులను ఆదేశించారు. బుధవారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో పౌర సరఫరాల శాఖ అధికారులతో నిర్వహించిన జిల్లా స్థాయి విజిలెన్స్ సమావేశంలో అదనపు కలెక్టర్ పాల్గొని సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా లిఅదనపు కలెక్టర్ శ్రీరాములు మాట్లాడుతూ, లి ప్రభుత్వం 2025 ఏప్రిల్ 1 నుంచి అన్ని చౌక ధరల దుకాణాల ద్వారా సన్న బియ్యం పంపిణీ చేపట్టిందని తెలిపారు.

విద్యార్థుల.. ప్రజల సౌకర్యార్థం సిటీ బస్సులు నడపాలి

బి ఆర్ ఎస్ యువజన విభాగం చొప్పదండి నియోజకవర్గం ఉపాధ్యక్షులు విజయ్ కుమార్



చొప్పదండి, ప్రభాతవార్త: చొప్పదండి నియోజకవర్గం బి ఆర్ ఎస్ యువజన విభాగం ఉపాధ్యక్షులు భక్తు విజయ్ కుమార్ మాట్లాడుతూ హైదరాబాద్ మహా నగరం తో పాటు ప్రక్కనే ఉన్న గ్రేటర్ వరంగల్ కార్పొరేషన్ మాదిరిగా కరీంనగర్ మునిసిపాల్ కార్పొరేషన్ జనాభా 450000 పై చిలుకు విలీనం అయినా మున్సిపాలిటీ, గ్రామాలతో సెరవేగంగా అభివృద్ధి చెందుతుంది. మన రాష్ట్ర రవాణా శాఖ మంత్రి వర్యులు పొన్నం ప్రభాకర్ కి, ఆర్ టి సి కరీంనగర్ రీజినల్ మేనేజర్ ని కోరుతూ కరీంనగర్ లో సిటీ బస్ లు నడపాలని కోరుతున్నాను. తిమ్మాపూర్ సిటీ బస్ స్టాండ్ టెర్మినాల్ గా తిమ్మాపూర్ధర్మారం వయ కరీంనగర్, తిమ్మాపూర్ నుండి వేములవాడ వయ కరీంనగర్, తిమ్మాపూర్సుల్తానాబాద్ వయ కరీంనగర్, తిమ్మాపూర్గంగాధర వయ కరీంనగర్, తిమ్మాపూర్ హుజురాబాద్ వయ కరీంనగర్ ప్రతి రోజు రాద్ది ఉండే ప్రదేశాలు నిత్యం విద్యార్థులు విద్యాసంస్థలు అయినా కొత్తపల్లి హవేలీ మెడికల్ కళాశాల, నాగునూర్ ప్రతిమ కళాశాల తో పాటు చొప్పదండి లో బి ఇ డి కళాశాల, సుల్తానాబాద్ రూట్ లో ఇంజనీరింగ్, చల్మెడ మెడికల్ కళాశాల, తిమ్మాపూర్ రూట్ లో ఇంజనీరింగ్, ఫార్మసీ, పాలి టెక్నిక్ ఎం బి ఎ, ఎం సి ఎ కళా శాలలు, ఉన్నాయి. ప్రైవేట్ వాహన దారులు ఎక్కువ డబ్బులు దండు కుంటున్నారు, అదేవిధంగా పోకిరిలా బెడదా బాగుంది.విద్యార్థులు ఫుట్ బోర్డు ద్వారా నిత్యం ప్రయాణం చేస్తున్నారు, అదేవిదంగా రైతులు, మహిళలు, ప్రజలకు నిత్యం ప్రయాణం సులభంగా ఉంటది త్వరగా గమ్యం చేరుకుంటారు. కరీంనగర్ రైల్వే స్టేషన్ సమీపంలో చాలా ఇబ్బంది ఉంది త్వరగా ఫ్లైఓవర్ పూర్తి చెయ్యాలని భక్తు విజయ్ కుమార్ కోరారు.

మరో 3 రోజులు భారీ వర్షాలు

ప్రజలు విద్యుత్ సమస్యల పట్ల అప్రమత్తంగా ఉండాలి

చొప్పదండి ఏ ఈ చంద్రయ్య



చొప్పదండి,ప్రభాతవార్త: రాష్ట్రంలో వాతావరణ శాఖ మరో మూడు రోజుల పాటు భారీ వర్షాలు కురుస్తాయని హెచ్చరికలు జారీ చేసిన నేపథ్యంలో చొప్ప దండి మండలం ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఏ ఈ చంద్రయ్య సూచించారు. అధిక వర్షాల కారణంగా విద్యుత్ స్తంభాలు పడిపోవడం, వైర్లు తెగిపడటం, ట్రిప్పింగ్, లో వోల్టేజ్ వంటి సమస్యలు తలెత్తే అవకాశం ఉందని చొప్పదండి 132/33కె వి సబ్‌స్టేషన్ ఏ.ఈ చంద్రయ్య తెలిపారు. ఈ క్రమంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ఉండేందుకు సబ్ స్టేషన్‌లో 24 గంటల పాటు ప్రత్యేక సిబ్బందిని అందుబాటులో ఉంచినట్లు వెల్లడించారు. ప్రజలు పాటించాల్సిన జాగ్రత్తలు తడిసిన విద్యుత్ స్తంభాలు, వైర్లను ముట్టుకోవద్దు,ఇంటి బయట కరెంటు తీగలు తెగిపడి ఉంటే వెంటనే అధికారులకు సమాచారం ఇవ్వాలి,పిల్లలను కరెంటు స్తంభాల దగ్గరకు వెళ్లనివ్వొద్దు, అవసరం లేనప్పుడు మెయిన్ స్విచ్ ఆఫ్ చేయాలి. పట్టణ ప్రజలు అత్యవసర సంప్రదింపు నంబర్లువిద్యుత్ సమస్యలు ఎదురైన వెంటనే కింది నంబర్లను సంప్రదించాలని అధికారులు కోరారు. టోల్ ఫ్రీ 1912 ఏ.ఈ చంద్రయ్య 87124 83370 ఎస్.ఎల్.టి ప్రవీణ్ కుమార్ 87124 88783 ఎల్.టి బ్రహ్మానందం 87124 83362 చొప్పదండి సబ్ స్టేషన్ 87124 83361 లైన్ మెన్ 1 87124 88784 లైన్ మెన్ 2 94915 17504 ఏ.ఈ చంద్రయ్య మాట్లాడుతూ వర్షాల కారణం గా ఎక్కడ సమస్య వచ్చినా వెంటనే మా దృష్టికి తీసుకురావాలి. సిబ్బంది వెంటనే వెళ్లి పరిష్కరిస్తారు. ప్రజలు భయాందోళనకు గురికావద్దు అని స్పష్టం చేశారు. పట్టణ ప్రజలు అత్యవసర సమయాలలో ఈ నెంబర్లను తప్పనిసరిగా గుర్తుంచుకోవాలని, వాతావరణ శాఖ సూచనలు పాటించాలని అధికారులు విజ్ఞప్తి చేశారు.

చైతన్యలో బోనాల పండుగ వేడుకలు

చొప్పదండి,ప్రభాతవార్త:



శ్రీచైతన్య జూనియర్ కళాశాల, చొప్పదండిలో బోనాల పండుగ సందర్భంగా బుధవారం విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బంది ఆధ్వర్యంలో భక్తి, సంప్రదాయం, సాంస్కృతిక వైభవాన్ని ప్రతిబింబించేలా బోనాల వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు సంప్రదాయ వస్త్రధారణలో బోనాలు సమర్పించి, అమ్మవారిని భక్తిశ్రద్ధలతో పూజిం చారు. కళాశాల ప్రాంగణంలో నిర్వహించిన సాంస్కృతిక కార్య క్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణలో భాగంగా ఈ వేడుకలు నిర్వహించడం విశేషం. కళాశాల కరస్పాండెంట్ అమిరిశెట్టి రత్నాకర్ రెడ్డి మాట్లాడుతూ, విద్యార్థులు విద్యతో పాటు మన సంస్కృతి, సంప్రదాయాలను తెలుసుకొని వాటిని ఆచరించడం ఎంతో ముఖ్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అండ్ డైరెక్టర్ గుండేటి వెంకటరమణ డైరెక్టర్లు పంతగాని అనిల్ కుమార్, వెంగళ హరిప్రసాద్ అధ్యాపకులు, రాజేశం, రేఖ, సతీష్,మోనిక రమాదేవి, వందన, జగన్, సంధ్య విద్యార్థులు మరియు సిబ్బంది ఉత్సాహంగా పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు.

రామడుగు పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన సిపీ గౌష్ ఆలం

...రామడుగు, ప్రభాతవార్త,



కరీంనగర్ కమీషనరేట్ పరిధిలోని రామడుగు పోలీసు స్టేషన్‌ను బుధవారంనాడు కరీంనగర్ పోలీస్ కమీషనర్ గౌష్ ఆలం ఐపీఎస్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. అనంతరం పోలీస్ స్టేషన్ ఆవరణలో పలు కేసుల్లో పట్టుబడి స్వాధీనంలో ఉన్న వాహనాల వివరాలు అడిగి తెలుసుకున్నారు. స్టేషన్‌లో ఉన్న సిబ్బందితో మాట్లాడి, వారికి కేటాయించిన విధుల గురించి అడిగారు. సరైన పద్ధతిలో రికార్డుల నిర్వహణ, నమోదైన కేసుల వివరాలు సిసిటిఎన్ఎస్‌లో పొందుపరచాలని ఆదేశించారు. తెలంగాణ పోలీసులు టెక్నాలజీ వినియోగంలో భాగంగా అందుబాటులోకి తెచ్చిన: సీసీటీఎన్ఎస్ 2.0 పిటిషన్ మేనేజ్‌మెంట్ సిస్టమ్‌లో ఈసమన్ల జారీ మరియు అమలు టీఎస్ కాప్ హెచ్ఆర్ఎంఎస్ , ఈసాక్ష్యం టెక్ డాటం, ఐరాడ్ దర్పణ్, సీఈఐఆర్, సైబర్ క్రైమ్ ఆర్థిక,ఆర్థికేతర నేరాల సాఫ్ట్‌వేర్, సీడీఆర్ వంటి అన్ని రకాల అప్లికేషన్‌లపై పూర్తి స్థాయిలో పట్టు సాధించి, వాటిని రోజువారీ విధుల్లో విరివిగా వినియోగించాలని సూచించారు. స్టేషన్‌కు కేటాయించిన వస్తువులను పరిశీలించడంతో పాటు, బ్లూ కోల్ట్స్ సిబ్బంది పోర్టబుల్ ఫింగర్ ప్రింట్ డివైస్‌ను ఉపయోగిస్తున్న తీరును తనిఖీ చేశారు. ఎఫ్ ఐ ఆర్ ఇండెక్స్‌ను పరిశీలించి, పెండింగ్ కేసులపై సమీక్ష జరిపారు. కేసుల పెండింగ్‌కు గల కారణాలను అడిగి తెలుసుకుని, వాటిని త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. నమోదైన సైబర్ నేరాల గురించి వివరాలు తెలుసుకుంటూ, విసిబుల్ పోలిసింగ్ పై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. రామడుగు పోలీసు స్టేషన్ పరిధిలోని అన్ని గ్రామాలను సెక్టార్లుగా, సబ్ సెక్టార్లుగా విభజించి, వాటికి గ్రామ పోలీసు అధికారులను కేటాయించాలని స్పష్టం చేశారు. రౌడీ షీటర్లు, హిస్టరీ షీటర్లపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి వారి కదలికలను ఎప్పటికప్పుడు గమనించాలని, ప్రతి నెల వారికి సంబంధించిన నూతన సమాచారాన్ని నమోదు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో రూరల్ ఏసీపీ విజయకుమార్, చొప్పదండి సర్కిల్ ఇన్స్పెక్టర్ ప్రదీప్ కుమార్, రామడుగు ఎస్సై రాజులతో పాటు ఇతర అధికారులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

చొప్పదండి వార్త

ఇ కె వై సి పేరిట ప్రజలను ఇబ్బందులు పెడుతున్న ప్రభుత్వం

బిజెపి ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు బత్తుల లక్ష్మీనారాయణ



చొప్పదండి,ప్రభాతవార్త: తెలంగాణలోనీ ప్రజలను ఈ కేవైసీ పేరుతో మీసేవ ఆధార్ సెంటర్ చుట్టూ ప్రజలు తిరుగుతూ ఇబ్బందులు పడు తున్నారు వారి బాధలను గుర్తించి ఆన్లైన్ ఆధార్ సెంటర్ చుట్టూ తిరుగుతున్న ఆధార్ అప్డేట్ కావడం లేదు వారి తల్లి తండ్రులు, పిల్లలను పట్టుకొని ఇబ్బందులు పడుతు న్నారన్నారు. ఈ ప్రభుత్వం వెంటనే స్పందించి మరింత ఈ కేవైసీ గడువు పెంచాలని కోరుతున్నామని బిజెపి ఎస్సీ మోర్చా కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు బత్తుల లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. అలాగే ఆధార్ సెంటర్లలో సర్వర్ సరిగా పనిచేయక కంప్యూటర్లు మురాయిస్తున్నాయి 24 గంటలు పని చేసే విధంగా చూడాలని, అలాగే ప్రజలలో ఈ కేవైసీ త్వరగా కాకపోవడంతో ఎక్కడ కుటుంబ సభ్యుల రేషన్ కార్డు లో పేర్లు తొలగిస్తారో అని భయాందోళనలకు గురవుతున్నారు ఈ ప్రభుత్వం అధికారులు, నాయకులు ప్రజల బాధలను గుర్తించి రేషన్ కార్డు ఈ కేవైసీ గడువు పెంచాలని కోరారు.

సాయిబాబా ఆలయంలో ఘనంగా గురుపౌర్ణమి వేడుకలు

చొప్పదండి,ప్రభాతవార్త:



పట్టణంలోని సాయిబాబా దేవాలయం గురు పౌర్ణమి పురస్కరించుకొని ఆలయంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు పాలు కార్యక్రమాలు చేపట్టారు. ఉదయం అభిషేకం, హారతి కార్యక్రమాలు జరిగాయి. మధ్యాహ్నం ప్రత్యేక పల్లకి సేవ, అన్న ప్రసాదం, రాత్రి భజన కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమాల్లో దండె లింగన్న తోపాటు భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

మండల, గ్రామ అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్ష సమావేశం

బీర్ పూర్ ప్రభాత వార్త:

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఆదేశాల మేరకు బుధవారం రోజున మండల ప్రజా పరిషత్ బీర్పూర్ కార్యాలయంలో మండల స్థాయి అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్ష సమావేశం నిర్వ హించారు. నియోజకవర్గ ప్రత్యేక అధికారి జిల్లా పంచాయతీ అధికారి డిపిఓ మరియు గ్రిట్ డీఈఈ ల సమక్షంలో మండల ప్రత్యేక అధికారి, అధ్యక్షతన ఈ సమీక్ష సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వివిధ శాఖల మండల స్థాయి అధికారులు తమ తమ శాఖలకు సంబంధించిన ప్రగతి నివేదికను సమావేశంలో వివరించారు. అనంతరం ప్రస్తుతం ఎల్ ఎస్ ప్రచారాన్ని దృష్టిలో ఉంచుకుని గ్రామ పంచాయతీలలో చెత్త సంక్షేమాలు నిర్వహించాలని సూచించారు. రాబోయే 10 రోజులలో బిజిఆర్ పనులకు ఆటంకం కలగకుండా తగిన చర్యలు తీసుకోవాలని సర్పంచులు కోరారు. ఈ ఈ సమావేశానికి ఎంపీడీవో భీమేష్ ఎం.పీ.ఓ మధుసూదన్ మరియు మండల స్థాయి అధికారులు వివిధ గ్రామాల సర్పంచులు, తదితరులు పాల్గొన్నారు.

సాయిబాబా ఆలయంలో ఘనంగా గురు పౌర్ణమి వేడుకలు

గురు పౌర్ణమి సందర్భంగా బాబాను దర్శించుకున్న
ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్
వేములవాడ టౌన్, ప్రభాతవార్త





వేములవాడ పట్టణంలోని మార్కండేయ నగర్ శ్రీ షిర్డీ సాయిబాబా ఆలయంలో గురు పౌర్ణమి వేడుకలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఉదయం బాబా వారికి పాలాభిషేకం, పుష్పాభిషేకం, హారతి కార్యక్రమాన్ని నిర్వహించారు. వర్షాన్ని సైతం లెక్కచేయకుండా తెల్లవారుజాము నుంచే భక్తులు ఆలయానికి చేరుకుని సాయిబాబాకు పాలాభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించి ఆశీర్వాదాలు పొందారు. ఈ వేడుకల్లో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు, నాయకులు ఏనుగు మనోహర్ రెడ్డి, ప్రతాప రామకృష్ణతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, కౌన్సిలర్లు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించగా, పెద్ద సంఖ్యలో భక్తులు ప్రసాదాన్ని స్వీకరించారు. గురు పౌర్ణమి సందర్భంగా ఆలయం భక్తులతో కిటకిటలాడింది. భారీ వర్షాన్ని సైతం లెక్కచేయకుండా భక్తులు హాజరయ్యారని ఆలయ కమిటీ అధ్యక్షులు వరాల దేవయ్య తెలిపారు. గురు పూర్ణిమ వేడుకలను విజయవంతం చేసిన భక్తులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు కోనమ్మ గారి నాగరాజు, అంబెరి నరసయ్య, గంప రాజేందర్, కుమార్, రైకల పాట శ్రీనివాస్, రవీందర్ రావు, గౌరీ శంకర్, నాగుల యాదగిరి, వెంకటేష్ ,చీటీ రామారావు, కాసర్ల శ్రీనివాస్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు

కురిసిన వరుణ కరుణతో రైతుల్లో కొత్త ఆశలు

హన్మాజీపేట, మల్లారం వద్ద నక్క వాగును పరిశీలించిన
ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్
వేములవాడ రూరల్ ప్రభాత వార్త:

ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో రైతుల కళ్లలో ఆనందం నెలకొందని రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. బుధవారం వేములవాడ రూరల్ మండలంలోని హన్మాజీపేట, మల్లారం గ్రామాల వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న నక్కా వాగును ఆయన పరిశీలించి రైతులతో మాట్లాడారు.ఈ సందర్భంగా రైతు మర్రివల్లి వేణు మాట్లాడుతూ, నిన్నటి వరకు రెండు ఎకరాల్లో ఒక ఎకరంలో మాత్రమే వరి నాట్లు వేశానని, ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో మిగిలిన ఎకరంలో కూడా సాగుకు సిద్ధమవుతున్నట్లు తెలిపారు.అనంతరం ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ, వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టిందన్నారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో



రైతులకు ఊరట లభించిందని, సాగు విస్తీర్ణం పెరిగే అవకాశం ఉందన్నారు. రైతులు ఈ వర్షాలను సద్వినియోగం చేసుకుని వ్యవసాయ పనులను వేగవంతం చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో రూరల్ మండల అధ్యక్షుడు సోయినేని కర్ణాకర్, జిల్లా ప్రధాన కార్యదర్శి వకులాభరణం శ్రీనివాస్, బీసీ సెల్ మండల అధ్యక్షుడు వంగపల్లి మల్లేశం, చిలుక ప్రభాకర్, హరినందన్, రమణ, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

నేడు వేములవాడలో పలు అభివృద్ధి పనులను ప్రారంభించనున్న మంత్రులు

దాదాపు రూ.15 కోట్ల 22 లక్షల నిధులతో అభివృద్ధి పనులు పూర్తి
వేములవాడ, ప్రభాతవార్త:



వేములవాడ పట్టణంలో పలు అభివృద్ధి పనులను మంగళవారం రాష్ట్ర మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు పొన్నం ప్రభాకర్ ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ప్రారంభించనున్నారు. దాదాపు రూ.15 కోట్ల 22 లక్షల నిధులతో పూర్తి చేసిన పనులను ప్రారంభించ నున్నారు. రూ. కోటి 65 లక్షలతో వేములవాడ బస్టాండ్ పునర్నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టనున్నారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ప్రత్యేక చొరవ, నిరంతర పర్యవేక్షణతో ఈ అభివృద్ధి పనులు వేగవంతంగా పూర్తయ్యాయి. ప్రణాళికాబద్ధంగా చేపట్టిన ఈ పనులు జిల్లాలో పర్యాటక, మౌలిక వసతుల అభివృద్ధికి మరింత దోహదపడనున్నాయి.వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయ గుడి చెరువులో బండ్ పార్క్ ఆహ్లాదకరంగా రూపుదిద్దుకుంది. మహా శివుడి విగ్రహం మరింత ఏర్పాటుతో ఆధ్యాత్మికత వెల్లివిరుస్తుంది.పర్యాటకశాఖ ఆధ్వర్యంలో వేములవాడ టెంపుల్ ఏరియా డెవలప్మెంట్ అథారిటీ నిధులు రూ. 12 కోట్లతో వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయ గుడి చెరువులో బండ్ పార్క్ నిర్మాణ పనులు చేపట్టారు. ప్రణాళిక ప్రకారం చేపట్టిన అభివృద్ధి పనులతో పాటు ఆధ్యాత్మికత భావం ఉట్టిపడేలా, భక్తి భావం పెంపొందించేలా పర్యాటక శాఖ అధికారులు బండ్ పార్క్ లో 40 ఫీట్ల ఎత్తైన మహాశివుడి విగ్రహం, సప్తమాతికల విగ్రహాలు ఏర్పాటు చేశారు. గుడి చెరువులో బోటింగ్ సదుపాయం ఏర్పాటు చేసేందుకు పర్యాటక శాఖ అధికారులు సన్నాహాలు చేస్తున్నారు.బండ్ పార్క్ లో నటరాజ్ స్టాచ్యూ ఫౌంటెన్,సూర్య నమస్కార్, వాకింగ్ ట్రాక్, కోబుల్ స్టోన్ ఫ్లోరింగ్,ల్యాండ్ స్కేప్, అంఫ్లీ థియేటర్, తదితర పనులు పూర్తి చేసి ఆకర్షణీయ మొక్కలు నాటారు. కోటి 65 లక్షల రూపాయలతో వేములవాడ బస్టాండ్ పునర్నిర్మాణ పనులకు జిల్లా ఇంచార్జి మంత్రి, మార్కెటింగ్, వ్యవసాయ, చేనేత జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పనులకు గురువారం శంకుస్థాపన చేయనున్నారు. పునర్నిర్మాణ పనుల్లో భాగంగా ఆఫీసు రూమ్స్, బస్ స్టాండ్ ఆవరణ సుందరీకరణ, పచ్చదనం పెంపు తదితర పనులు చేయనున్నారు.

సాయిబాబా ఆలయంలో ఘనంగా గురు పౌర్ణమి వేడుకలు

చందుర్తి / ప్రభాతవార్త



చందుర్తి మండల కేంద్రంలో సాయిబాబా ఆలయంలో గురు పౌర్ణమి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. గురు పౌర్ణమని పురస్కరించుకొని భక్తులు సాయిబాబా ఆలయంలో పాలాభిషేకం. ప్రత్యేక పూజలు చేశారు. ప్రతి సంవత్సరం గురు పౌర్ణమి రోజున ప్రత్యేక పూజలు చేయడం ఆనవాయితీగా వస్తుంది. ఈ సందర్భంగా సాధు సజ్జన భజన మండలి ఆధ్వర్యంలో భజన కార్యక్రమాలను నిర్వ హించారు. ఈ కార్య క్రమంలో నాయకులు తిప్పని శ్రీనివాస్. షిరిడి మల్లేశం. డిష్ రాజు.రవి. లింగాల మల్లయ్య. పులి నారాయణ.శంకరయ్య గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

వేములవాడ వార్త

విలాసాగర్ పాఠశాల అభివృద్ధికి నిరంతరం శ్రమిస్తున్న పూర్వ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల సహకారంతో అనేక వసతుల కల్పన



బోయిన్‌పల్లి,ప్రభాతవార్త: బోయిన్ పల్లి మండలంలోని విలాసాగర్ జడ్పీహెచ్ఎస్ పూర్వ విద్యార్థులు అపూర్వ సమ్మేళనం ద్వారా కలుసుకొని పాఠశాల అభివృద్ధికి అనేక కార్యక్రమాలు నిర్వహిస్తూ విద్యార్థిని విద్యార్థులకు నూతన వసతులను కల్పిస్తూ నిరంతరం సహాయ సహకారాలు అందిస్తున్నారు. నాటి తరం విద్యార్థుల యొక్క గొప్ప ఆలోచన నేటి తరం విద్యార్థులకు అనేక రకాలుగా ఉపయోగపడుతున్నారు. పాఠశాలలో విద్యార్థిని విద్యార్థులకు నోట్ బుక్స్, క్రీడా సామాగ్రి, వాటర్ సదుపాయం లాంటి అనేక వసతులు కల్పించి శభాష్ అని గ్రామస్తుల అభినందనలు పొందుతున్నారు. విలాసాగర్ పాఠశాల పూర్వ విద్యార్థుల సహాయ సహకారాలు తెలిసిన పలువురు హర్షం వ్యక్తం చేస్తూ అభినందిస్తున్నారు. ఈ కార్యక్రమంలో టీ ఎన్ జీ ఓ అధ్యక్షులు మారం జగదీశ్వర్, పూర్వ విద్యార్థుల కమిటీ ప్రధాన కార్యదర్శి గడప కోటేష్ ,కోశాధికారి రుద్ర ఆంజనేయులు, ఉపాధ్యక్షులు మారం సతీష్ కుమార్, కమిటీ సభ్యులు పోలాడి వెంకటేశ్వర్, డాక్టర్ నారాయణ సిపి గిన్నె లక్ష్మణ్, సత్తయ్య, దేవయ్య, భాస్కర్, మాజీ డి సి ఎమ్ ఎస్ చైర్మన్ ముదిగంటి సురేందర్ రెడ్డి,సర్పంచ్ ఏనుగుల కనకయ్య, పూర్వ విద్యార్థి కమిటీ సభ్యులు పెద్ద ఎత్తున ఉన్నారు.

ఘనంగా సంత్ శిరోమణి శ్రీ గురు రవిదాస్ మహారాజ్ 650వ జయంతి ఉత్సవాలు

ప్రభాతవార్త వేములవాడ



వేములవాడ పట్టణంలోని పద్మశాలి సంఘంలో బుధవారంసంత్ శిరోమణి శ్రీ గురు రవిదాస్ మహారాజ్ 650వ జయంతి ఉత్సవాలను బీజేపీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గురు రవిదాస్ మహారాజ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన సమానత్వం, సామాజిక న్యాయం, సోదరభావం కోసం చేసిన కృషిని నాయకులు స్మరించుకున్నారు. ఆయన బోధనలు నేటి సమాజానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కార్య వర్గ సభ్యులు ప్రతాప రామకృష్ణ, బిజెపి పట్టణ అధ్యక్షులు రాపల్లి శ్రీధర్, రేగుల మల్లికార్జున్, సంటి మహేష్ , రేగుల శ్రీకాంత్, సగ్గు రాహుల్, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ కార్మికులకు రెయిన్ కోట్లు పంపిణీ

కోనరావుపేటరూరల్, ప్రభాతవార్త:



గ్రామపంచాయతీలో పనిచేస్తున్న సిబ్బందికి రెయిన్ కోట్లు పంపిణీ చేసినట్లు ఉపసర్పంచ్ తిక్కల నవీన్ తెలిపారు. వర్షాకాలం కావడంతో వర్షం పడుతున్నా గ్రామంలో పనులు చేయాల్సి వస్తుంది. అందువల్ల గ్రామంలో పనిచేస్తున్న పంచాయతీ సిబ్బంది కోసం తెప్పించి బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అందించారు. వారి ఆరోగ్యం బాగుండాలనే ఈ రెయిన్ కోట్లు అందించామని ఉపసర్పంచ్ నవీన్ అన్నారు.

పోతారంలో చిన్నపాటి వర్షానికే మునిగిన ప్రధాన రహదారి

డ్రైనేజీ సమస్య తీర్చకపోతే ఆందోళనలు చేపడతాం

మంథని డివిజన్ దళిత నాయకుడు ఊట్ల శ్రీను

ముత్తారం, ప్రభాతవార్త:

ముత్తారం మండలం పోతారం గ్రామంలో చిన్నపాటి వర్షానికే ప్రధాన రహదారిపై నడుము లోతు నీరు చేరి ప్రజలు నరకం చూస్తున్నారని మంథని డివిజన్ దళిత నాయకుడు ఊట్ల శ్రీను ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బుధవారం పోతారంలో కురిసిన చిన్నపాటి వర్షానికే ప్రధాన రహదారిపై నడుము లోతు వరకు వర్షపు నీరు నిలిచిపోవడంతో గ్రామ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని, పసిపిల్లల నుంచి వృద్ధుల వరకు నీటిలోనే నడుచుకుంటూ రాకపోకలు సాగించాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. గ్రామంలో వర్షపు నీరు నిలిచిపోయే సమస్యపై గ్రామ పంచాయతీ పాలకవర్గానికి, గ్రామ కార్యదర్శికి, ఎంపిడిఓకు, జిల్లా అధికారులకు ఎన్నోసార్లు విన్నవించినప్పటికీ ఎలాంటి శాశ్వత చర్యలు చేపట్టలేదని



తెలిపారు. గ్రామ ప్రజల ప్రాథమిక సమస్యలను పరిష్కరించడంలో స్థానిక పాలకవర్గం పూర్తిగా విఫలమైందని మండిపడ్డారు. ప్రజల భద్రత, సౌకర్యాలను దృష్టిలో ఉంచుకుని వెంటనే డ్రైనేజీ వ్యవస్థను అభివృద్ధి చేసి, రహదారిపై నిలిచే వర్షపు నీటికి శాశ్వత పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు. అధికారులు స్పందించకపోతే గ్రామ ప్రజలతో కలిసి ప్రజాస్వామ్యబద్ధంగా పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని ఊట్ల శ్రీను హెచ్చరించారు.

మంథని ప్రజలకు నాణ్యమైన వైద్యం అందిస్తాం

-మంత్రి శ్రీధర్ బాబు

మంథని ప్రభాతవార్త:



మంత్రి నియోజకవర్గ ప్రజలకు నాణ్యమైన వైద్యాన్ని అందించడానికి కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని విధాలుగా చర్యలు తీసుకుంటుంది అని రాష్ట్ర ఐటీ మంత్రి శ్రీధర్ బాబు అన్నారు.బుధవారం మంథని ప్రభుత్వ ఆస్పత్రికి నూతనంగా నియమకమైన రెగ్యులర్ డాక్టర్స్ మంత్రి శ్రీధర్ బాబును కలిశారు.ముందుగా మంథని ప్రభుత్వ ఆసుపత్రి నూతనంగా సూపరిండెంట్ గా పదవి బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ టీవీ రాజశేఖర్ రెడ్డి మంత్రి శ్రీధర్ బాబు కు పూల మొక్క అందించారు.ఈ సుందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ ముందుగా ఆసుపత్రి సూపరిండెంట్, గైనకాలజిస్ట్,అనస్థీషియా డాక్టర్స్ కి శుభాకాంక్షలు తెలిపారు. ఈ మంథని ప్రాంతంలో ప్రభుత్వ ఆసుపత్రిలో రాష్ట్ర ప్రభుత్వం అన్ని రకాల సదుపాయాలు కల్పించడం జరిగిందని, ఈ ప్రాంత ప్రజలందరికీ నాణ్యమైన వైద్యాన్ని అందించాలని, మతశిశు వైద్య సేవలను అందరికీ అందించాలని, ఇక్కడ ప్రసూతి సేవలను ఇతర ప్రాంతాలకు వెళ్లకుండా చూడాలని మంథని చుట్టుప్రక్కల గ్రామాల నుండి వచ్చే ప్రెగ్నెన్సీ కేసులను రిఫర్ చేయకుండా ఇక్కడే అయ్యేవిధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు.ఎక్కువగా సాధారణ ప్రసవాలకు జరిగే విధంగా చూడాలన్నారు.మంథని ప్రభుత్వ ఆసుపత్రిలో ఇటీవల నియామకమైన డెంటల్ స్పెషలిస్ట్ డాక్టర్ పూర్ణిమచే దంత వైద్య సేవలను ఈ ప్రాంత ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని డాక్టర్స్ కి మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు.

వైభవంగా శ్రీ సాయిబాబా ఆలయంలో గురు పౌర్ణమి వేడుకలు

ప్రత్యేక పూజలు నిర్వహించిన జిఎంసుంకరి మధుసూదన్

రామగిరి ప్రభాతవార్త:



రామగిరి మండలం వన్నూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని సెంటినరీ కాలనీలో గల శ్రీ షిర్డీ సాయిబాబా మందిరంలో బుధవారం గురు పౌర్ణమి మహోత్సవం భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. స్థానాచార్యులు గోవర్ధనగిరి వేణుమనోహరాచార్యులు మరియు ఆలయ పూజారి గోవర్ధనగిరిశ్యామసుందరాచార్యులు షిరిడి సాయిబాబాకు పాలాభిషేకాలు, పుష్పాభిషేకాలు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గురు పౌర్ణమి సందర్భంగా షిరిడి సాయిబాబా ఆలయంలో ఆర్ జి శ్రీ జియం సుంకర మధుసూదన్ ప్రత్యేక పూజ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఉదయం నగర సంకీర్తనతో కార్యక్రమాలు ప్రారంభమై, కాకడ హారతి, గణపతి పూజ, రక్షాబంధనం, శతఘటాభిషేకం, శ్రీ సాయినాథుని సహస్రనామార్చన, మధ్యాహ్న హారతి, తీర్థప్రసాదం, అనంతరం మహా అన్నప్రసాద కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం సంధ్య హారతి, పల్లకి సేవ, భజన కార్యక్రమాలు, సేజ హారతి తదితర విశేష పూజా కార్యక్రమాలు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అధిక సంఖ్యలో చుట్టుపక్కల గ్రామాల నుండి భక్తుల తరలి వచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ వర్కింగ్ చైర్మన్ వనం రాంచందర్ రావు, చైర్మన్ గంట వెంకటరమణ రెడ్డి, వైస్ చైర్మన్లు కాటం సత్యం, కోరుకొప్పుల తులసిరామ్ గౌడ్, తిప్పర్తి రవీందర్ రెడ్డి, ట్రెజరర్ ఎలిశెట్టి విశ్వేశ్వర్, సెక్రటరీ ముప్పిడి రవీందర్, జాయింట్ సెక్రటరీ ఏగోలపు సత్యనారాయణ గౌడ్, తో పాటు భక్తులు పాల్గొన్నారు.

వి.బి.జీ రామ్ జీ (ఉపాధి హామీ) ఉద్యోగులకు పే స్కేల్ అమలు చేయాలి

ఎంపీడీవోకు వినతి పత్రం అందజేత

రామగిరి ప్రభాతవార్త:

వి.బి.జీ రామ్ జీ (ఉపాధి హామీ) ఉద్యోగులు బుధవారం రామగిరి ఎంపీడీవో బద్రి శైలజ రాణి కి సమ్మె నోటీసు అందజేశారు.గ్రామీణాభివృద్ధి శాఖ పరిధిలోని ఎస్ఆర్డీఎస్, (వీబీ జీ రాంజీ) ఎన్టీఈ ఉద్యోగులు తమ న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం నిరసన బాట పట్టాలని నిర్ణయించారు. మూడు నెలలుగా వేతనాలు రాక తీవ్ర ఆర్థిక, మానసిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, తక్షణమే బకాయి వేతనాలు విడుదల చేయాలని ఎస్ఆర్డీఎస్ ఎంప్లాయీస్ జాయింట్ యాక్షన్ కమిటీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. 2026 ఆగస్టు 15 నాటికి నూతన హెచ్ఆర్ పాలసీని అమలు చేస్తూ ఉత్తర్వులు ఇవ్వాలని, మూడు నెలల వేతనాలను ఒకేసారి విడుదల చేయాలని, ప్రతి నెలా 1వ తేదీనే జీతాలు చెల్లించాలని, గ్రేడ్ పే, పదోన్న తులు, బడ్జెట్, ట్రావెల్ అలవెన్సుల సమస్యలను వెంటనే పరి ష్కరించాలని జేఏసీ డిమాండ్ చేసింది. తమ డిమాండ్లను పరి ష్కరించకపోతే దశలవారీగా నిరసనకు దిగుతామని హెచ్చ రించింది. ఆగస్టు 15 నాటికి ప్రభుత్వం నుంచి స్పష్టమైన ప్రకటన రాకపోతే, 16వ తేదీ నుంచి రాష్ట్రవ్యాప్తంగా నిరస నలు, తీవ్రస్థాయి ఆందోళనలు చేపడతామని జేఏసీ రాష్ట్ర ట్రెజరర్ కొండ సత్యనారాయణ స్పష్టం చేశారు. ఈ కార్య క్రమములో టిజి ఆర్ డి జేఏసీ రాష్ట్ర ట్రెజరర్ కొండ. సత్యనారాయణ, ఇంజనీరింగ్ కన్సల్టెంట్.వి. మోనిక, సాంకేతిక సహాయకులు. మల్క అఖిల, నేరెళ్ల సుప్రియ పాల్గొన్నారు.



మంథని వార్త

ఇనుముల సతీష్‌ను పరామర్శించిన మంత్రి శ్రీధర్ బాబు

మంథని ప్రభాతవార్త:



మంథని పట్టణంలో గత నాలుగు రోజుల క్రితం ఆసుపత్రి లో చికిత్స పొందుతూ ఆకస్మికంగా మృతి చెందిన మంథని మాజీ ఉపసర్పంచ్ ఇనుముల సతీష్ మాతృమూర్తి గౌరమ్మ చిత్రపటానికి ఐటీ మంత్రి శ్రీధర్ బాబు పూలమాలల వేసి నివాళులు అర్పించారు. మంగళవారం రాత్రి ఇనుముల గౌరమ్మ నివాసానికి వెళ్లి ఘనంగా నివాళులు అర్పించారు.అనంతరం సతీష్ ను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపి మృతికి గల కారణాలు,వివరాలు అడిగి తెలుసు కున్నారు. అనంతరం సతీష్ కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. స్థానిక కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

నీట మునిగిన పొలాలను పరిశీలించిన తహసిల్దార్

మంథని రూరల్ ప్రభాతవార్త:



రెండు రోజుల నుండి కురుస్తున్న భారీవర్షలకు ఎగువ నుండి భారీ వరద రావడంతో నాటు పెట్టిన పొలాలన్నీ నీట మునిగినాయి. విషయం తెలిసిన వెంటనే మంథని తహశీల్దార్ ఆరిఫ్ ఉద్దీన్ ఆర్ఐ సదయ్య కన్నాల గ్రామంలో స్థానిక సర్పంచ్ గుడిసె గట్టయ్య యాదవ్ తో బుధవారం కలిసి పొలాలను పరిశీలించారు అనంతరం స్థానిక సర్పంచ్ గత నెల రోజుల క్రితమే వేంపాడు కన్నాల గ్రామ రైతులతో కలిసి నేషనల్ హైవే మీద రెండు పైపులు వేయాలని మంథని ఆర్డీవో సురేష్ వినతిపత్రం అందించారు. పైపులు వేస్తే ఈ పరిస్థితి ఉండేది కాదని గ్రామ సర్పంచ్ రైతులు ఆవేదన వ్యక్తం చేశారు ఇప్పటికైనా నేషనల్ హైవే అధికారులతో మాట్లాడి పైపులు వేయాలని కోరారు నీట మునిగిన పొలాలకు నష్టపరిహారం చెల్లించాలని గ్రామ సర్పంచ్ రైతులు కోరారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ మదన్మోహన్ గ్రామ రైతులు చిదురాల సురేందర్ రెడ్డి ఐలి తిరుపతి పాల్గొన్నారు.

శాకంబరీ అలంకరణలో మహాలక్ష్మి దర్శనం

మంథని ప్రభాతవార్త:



మంత్రపురి శ్రీ మహాలక్ష్మీ అమ్మవారు శాకంబరీ అలంకరణలో బుధవారం భక్తులకు దర్శనమిచ్చారు. స్థానిక శ్రీ మహాలక్ష్మి ఆలయంలో ఆషాడ శుద్ధ పౌర్ణమి (గురు పౌర్ణమిని)ని పురస్కరించుకొని అమ్మవారికి శాకాంబరీ మహోత్సవాన్ని ఆలయ అర్చకులు మారుపాక ప్రశాంత్ శర్మ ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ఉదయం 4 గంటలకు అభిషేకము, 6 గంటలకు అర్చన కార్యక్రమాలను పూర్తి చేశారు. అనంతరం భక్తులు, దాతలు సమర్పించిన వివిధ రకాల కూరగాయలు, ఆకు కూరలయ, పండ్లతో అమ్మవారిని, గర్భాలయ ప్రాంగణాన్ని ప్రత్యేక అలంకరించారు. శాకంబరీగా అలంకరణలో ఉన్న అమ్మవారిని భక్తులు తనివితీర దర్శించుకొని తన్మయత్వం పొందారు. . అలయ ప్రాంగణంలో శ్రీ లలితా సహస్రనామ స్తోత్ర పారాయణాన్ని నిర్వహించారు. ఈకార్యక్రమాల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొనడంతో ఆలయ ప్రాంగణం సందడిగా మారింది.

భారీ వర్షాలతో రైతుల్లో ఆనందం

మండల వ్యాప్తంగా 40 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు

వరి నాట్లకు అనుకూల పరిస్థితులు

జలకళ సంతరించుకున్న చెరువులు, కుంటలు

గొల్లపల్లి, జూలై 29 (ప్రభాతవార్త):



గత కొద్దిరోజులుగా ఎల్‌నినో ప్రభావంతో ఈ ఏడాది వర్షపాతం తక్కువగా నమోదయ్యే అవకాశం ఉందని వాతావరణ శాస్త్రవేత్తలు హెచ్చరిస్తూ వచ్చినప్పటికీ, గత రెండు రోజులుగా తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా కురుస్తున్న భారీ వర్షాలు రైతుల్లో కొత్త ఆశలు నింపాయి. గొల్లపల్లి మండలంలోనూ విస్తారంగా కురిసిన వర్షాలతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలతో మండలంలోని చెరువులు, కుంటలు, వాగులు జలకళను సంతరించుకుని పొంగిపొర్లుతున్నాయి. వర్షాభావం కారణంగా ఖరీఫ్ సాగుపై ఆందోళనలో ఉన్న రైతులకు ఈ వర్షాలు ఎంతో ఊరటనిచ్చాయి. ఇప్పటికే నారుమళ్లు సిద్ధం చేసి వర్షాల కోసం ఎదురుచూస్తున్న రైతులు ఇప్పుడు వరి నాట్ల పనులను వేగవంతం చేస్తున్నారు. పొలాల్లో తగినంత తేమ ఏర్పడటంతో వ్యవసాయ పనులు జోరందుకున్నాయి.వ్యవసాయానికి అనుకూలంగా ఇదే తరహాలో వర్షాలు కొనసాగితే ఈ ఏడాది పంట దిగుబడులు ఆశాజనకంగా ఉంటాయని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం మండల వ్యాప్తంగా రైతులు నాట్ల పనుల్లో నిమగ్నమై ఖరీఫ్ సాగును వేగవంతం చేస్తున్నారు.

40 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు

మండల వ్యాప్తంగా సుమారు 40 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. మండలంలోని తిరుమలాపూర్ గ్రామంలో మంగళవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి ఓ ఇల్లు పాక్షికంగా దెబ్బతింది. అలాగే పలుచోట్ల చెట్లు విరిగి పడటంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. తహసీల్దార్ కార్యాలయం ముందు గాలికి భారీ చెట్టు విరిగి పడగా, అధికారులు, గ్రామపంచాయతీ సిబ్బంది వెంటనే స్పందించి చెట్లను తొలగించి రాకపోకలను పునరుద్ధరించారు.మండల కేంద్రంలోని చర్చివాడ, ఎంజేపీ గురుకుల పాఠశాల పరిసరాలు, ఎస్సీ కాలనీల్లో వర్షపు నీరు నిలిచి ఇండ్లలోకి వర్షపు నీరు చేరడంతో స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సమాచారం అందుకున్న గ్రామ సర్పంచ్, ఉపసర్పంచ్, గ్రామపంచాయతీ సిబ్బంది జేసీబీల సహాయంతో నీటిని తొలగించి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టారు.భారీ వర్షాలతో ఒకవైపు రైతుల్లో ఆనందం నెలకొనగా, మరోవైపు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.

గురు పౌర్ణమి వేడుకల్లో పాల్గొన్న మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్

సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు

పెగడపల్లి, ప్రభాతవార్త:

గురు పౌర్ణమి సందర్భంగా పెగడపల్లి మండలం రాంబద్రునిపల్లె గ్రామంలోని శ్రీ సాయిబాబా ఆలయంలో రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ప్రత్యేక పూజలు నిర్వహించారు.బుధవారం ఆలయాన్ని దర్శించుకున్న మంత్రి సాయిబాబా స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రజలందరికీ సాయిబాబా ఆశీస్సులు లభించాలని, ప్రజలు సుఖశాంతులతో, ఆయురారోగ్యాలతో, సుభిక్షంగా జీవించాలని ప్రార్థించారు.గురు పౌర్ణమి సందర్భంగా గురువుల మహిమను స్మరించుకుంటూ భక్తిశ్రద్ధలతో నిర్వహించిన పూజా కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. ఆలయానికి వచ్చిన



భక్తులతో ముచ్చటించారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ బుర్ర రాములు గౌడ్, పెగడపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తిరుపతి కడారి, నాయకులు ఓరగల శ్రీనివాస్, సంధి మల్లారెడ్డి, పల్లె లింగారెడ్డి, పుల్కం జలపతి,వ్ దీకొండ మహేందర్ భక్తులు తదితరులు పాల్గొన్నారు.

గొర్రెల కాపరులు అప్రమత్తంగా ఉండాలి

పెగడపల్లి, ప్రభాతవార్త:

రాష్ట్రవ్యాప్తంగా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో గొర్రెలు, మేకల కాపరులు అప్రమత్తంగా ఉండాలని అఖిల భారత యాదవ మహాసభ పెగడపల్లి మండల గౌరవ అధ్యక్షుడు పలుమారు విజయ్ యాదవ్ సూచించారు.వర్షాల కారణంగా వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నందున గొర్రెలు, మేకలను నీటి ప్రవాహాల గుండా తీసుకెళ్లవద్దని సూచించారు. అలాగే వర్షాకాలంలో బ్లూ టంగ్, ఫుట్ రాట్ వంటి సీజనల్ వ్యాధుల నివారణకు పశువైద్యుల సూచన మేరకు టీకాలు వేయించి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. పశుసంపదను కాపాడేందుకు ప్రతి గొర్రెల కాపరి అప్రమత్తంగా వ్యవహరించాలని విజ్ఞప్తి చేశారు

భారీ వర్షాల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలి

ఎస్పై నరేష్ కుమార్

కొడిమ్యాల ప్రభాతవార్త:

జిల్లాలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కొడిమ్యాల ఎస్సై ఏ. నరేష్ కుమార్ సూచించారు. రైతులు పొలం పనులకు వెళ్లే సమయంలో విద్యుత్ స్తంభాలు, తెగిపోయిన విద్యుత్ తీగలు, మోటార్ స్టార్టర్లు, ఎలక్ట్రికల్ కనెక్షన్ల విషయంలో అత్యంత జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. చెరువులు, కుంటలు, వాగులు పొంగిపొర్లే అవకాశం ఉన్నందున వాటిని దాటే ప్రయత్నం చేయవద్దని, అవసరమైతే తప్ప దూర ప్రయాణాలు చేయకుండా ఉండాలని సూచించారు. వర్షాల కారణంగా చేపలు పట్టేందుకు, ఈత కొట్టేందుకు చెరువులు, కుంటలు, వాగుల వద్దకు ఎవరూ వెళ్లరాదని హెచ్చరించారు. బలమైన ఈదురుగాలుల వల్ల చెట్లు, కొమ్మలు విరిగి రహదారులపై పడే అవకాశం ఉందని, శిథిలావస్థలో ఉన్న భవనాలకు దూరంగా ఉండాలని సూచించారు. ప్రజలందరూ అధికారుల సూచనలు పాటిస్తూ అప్రమత్తంగా ఉండి తమ ప్రాణాలు, ఆస్తులను కాపాడుకోవాలని ఎస్సై ఏ. నరేష్ కుమార్ విజ్ఞప్తి చేశారు.

నాటు పనులకు వెళ్లి
తిరిగిరాని లోకాలకు

గొల్లపల్లి, జూలై 29 (ప్రభాతవార్త):



వరి నాట్ల కోసం పొలాన్ని సిద్ధం చేసేందుకు వెళ్లిన ఓ రైతును విద్యుత్ ఘాతం రూపంలో మృత్యువు కబళించిన హృదయవిదారక ఘటన జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలం శంకర్రా పుపేట గ్రామంలో బుధవారం చోటుచేసుకుంది.స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన దర్ర రాజన్న (45) వ్యవసాయమే జీవనాధారంగా కుటుంబాన్ని పోషిస్తూ వస్తున్నారు. మంగళవారం రాత్రి కురిసిన భారీ వర్షంతో వరి నాట్లకు అనుకూల పరిస్థితులు ఏర్పడటంతో బుధవారం ట్రాక్టర్‌తో పొలాన్ని దున్నిస్తూ పనుల్లో నిమగ్నమయ్యారు. ఈ క్రమంలో వ్యవసాయ బావి వద్ద మోటార్ ఆన్ చేసేందుకు వెళ్లిన రాజన్న ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురై తీవ్రంగా గాయపడ్డారు. గమనించిన గ్రామస్తులు వెంటనే ఆయనను ఆసుపత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.మృతుడు రాజన్నకు భార్య జలతో పాటు ముగ్గురు కుమారులు మనోజ్, గణేష్, రాకేష్ ఉన్నారు. కుటుంబానికి ఆయనే పెద్దదిక్కు. రైతు ఆకస్మిక మృతితో కుటుంబ సభ్యుల రోదనలు ప్రతి ఒక్కరినీ కంట తడి పెట్టించాయి. తండ్రి శాశ్వతంగా దూరమయ్యాడనే నిజాన్ని జీర్ణించుకోలేక కుమారులు విలపించిన దృశ్యాలు అక్కడున్న వారిని కంటతడి పెట్టించాయి. ఈ ఘటనతో శంకర్రావుపేట గ్రామం విషాద ఛాయలు అలుముకున్నాయి. గ్రామస్తులు పెద్ద సంఖ్యలో చేరుకుని కుటుంబ సభ్యులను ఓదార్చారు. మృతుడి కుటుంబానికి ప్రభుత్వం తక్షణ ఆర్థిక సాయం అందించడంతో పాటు కుటుంబంలోని ఒకరికి ఉద్యోగం కల్పించాలని గ్రామస్తులు, రైతులు ప్రభుత్వాన్ని కోరారు.ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. విద్యుత్ అధికారులు సంఘటన స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు.

ధర్మపురి వార్త

రామలింగేశ్వర స్వామి ఆలయంలో క్షీరాభిషేకం

ధర్మపురి, ప్రభాతవార్త



గురు పౌర్ణమి పర్వదినం సందర్భంగా ధర్మపురి శ్రీ రామలింగేశ్వర స్వామి దేవస్థానంలో బుధవారం ఆదిశంకరాచార్యుల వారికి శిరాభిషేకం నిర్వహించారు. ఉదయం వేళలో అర్చకులు, వేద పండితులు స్వామివారికి రుద్ర నమక చమకంతో క్షీరాభిషేకం నిర్వహించిన అనంతరం హారతి, మంత్రపుష్పం తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. స్థానిక భక్తులు శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయంతో పాటు, శ్రీ లక్ష్మీనర సింహస్వామి దేవాలయాన్ని దర్శించుకుని పూజల్లో పాల్గొన్నారు.

కేజీబీవీలో గురు పౌర్ణమి వేడుకలు

గొల్లపల్లి, జూలై 29 (ప్రభాతవార్త):



గొల్లపల్లి మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ)లో లయన్స్ క్లబ్ గొల్లపల్లి ఆధ్వర్యంలో బుధవారం గురు పౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా గురు-శిష్యుల బంధం, గురువుల గొప్పతనం, వారి విలువలపై విద్యార్థినులకు ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. అనంతరం సమాజ శ్రేయస్సు కోసం అహర్నిశలు శ్రమిస్తున్న ఉపాధ్యాయులకు ఖిగురు వందనంఖి సమర్పించి ఘనంగా సన్మానించారు.ముఖ్య అతిథులుగా విచ్చేసిన లీడ్ ఇండియా రాష్ట్ర శిక్షణ సమన్వయకర్త తాడూరి శ్రీనివాస్ ఆచార్య, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు బొమ్మెన కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణ, సన్మార్గం, ఉపాధ్యాయుల పట్ల గౌరవభావం పెంపొందించుకోవాలని సూచించారు. గురువులు చూపిన మార్గంలో నడిస్తే జీవితంలో ఉన్నత శిఖరాలను చేరుకోవచ్చని తెలిపారు. అజ్ఞానమనే చీకటిని తొలగించి జ్ఞానమనే వెలుగును ప్రసరింపజేసే పవిత్రమైన వ్యక్తులు గురువులని కొనియాడారు. లయన్స్ క్లబ్ ఖిఏ సర్వ్‌ఖి అనే సేవా సూత్రంతో పనిచేస్తోందని, ఆ సేవాభావాన్ని నేర్పింది కూడా గురువులేనని అన్నారు.ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ కోశాధికారి సట్ట సురేష్, కేజీబీవీ ప్రత్యేక అధికారి పద్మ, ఉపాధ్యాయురాళ్లు జలజ, జ్యోతిరాణి, స్రవంతి, అనూష, సుస్మిత, శ్యామల, గంగ జమున, లత, శైలజ, భానుప్రియ, మహేశ్వరీ, వనజ, విజయలక్ష్మి మ్మ, మంగమ్మ, లయన్స్ క్లబ్ సభ్యులు, పాఠశాల సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

భారీ వర్షానికి పొంగిన వాగులు

ధర్మపురి - జగిత్యాల మధ్య నిలిచిన రాకపోకలు

ధర్మపురి,ప్రభాతవార్త



ధర్మపురి మండలంతో పాటు, చుట్టుపక్కన ప్రాంతాల్లో మంగళవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి వాగులు,కుంటలు నీటితో నిండిపోయాయి. ధర్మపురి మండలంలోని అక్కాయి పల్లె వద్ద గల వాగు నీటి మునగడంతో ధర్మపురి, జగిత్యాల మధ్య రాకపోకలు బుధవారం నిలిచిపోయాయి. దాంతో ప్రయాణికులు ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా తమ ప్రయాణాలను కొనసాగించారు. గోదావరి నదిలోకి వరద నీరు చేరడంతో నది ప్రవాహం పెరిగింది.అలాగే పలుచెరువులలోకి నీరు రావడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

వరద ప్రాంతాల్లో పోలీసులు అప్రమత్తంగా ఉండాలి

రామగుండం సీపీ అంబర్ కిషోర్ ఝా

క్షేత్రస్థాయిలో వరద పరిస్థితుల పరిశీలన

పెద్దపల్లి జిల్లా బ్యూరో (గోదావరిఖని క్రైం), ప్రభాతవార్త:



వరద ప్రాంతాల్లో పోలీసులు అప్రమత్తంగా ఉండాలని రామగుండం సీపీ అంబర్ కిషోర్ ఝా తెలిపారు. బుధవారం రామగుండం పోలీస్ కమిషనరేట్ పెద్దపల్లి జోన్ గోదావరిఖని టూ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా ఆరఎఫ్సిఎల్ ప్రాంతంలోని వరద నీరు డ్రైనేజీ కాలువల ద్వారా వీర్లపల్లి గ్రామంలోకి చేరడంతో ఆ ప్రాంతాన్ని గోదావరిఖని ఏసీపీ రమేష్, గోదావరిఖని టూ టౌన్ ఇన్స్పెక్టర్ ప్రసాద్రావు, గోదావరిఖని వన్ టౌన్ ఇన్స్పెక్టర్ ఇంద్రసేనారెడ్డిలతో కలిసి క్షేత్రస్థాయిలో పర్యటించి పరిశీలించారు. ఈ సందర్భంగా వరద ప్రభావిత ప్రాంతాలను పరిశీలించిన సీపీ మాట్లాడుతూ భారీ వర్షాల కారణంగా వరద ప్రవాహం అధికంగా ఉన్నందున ప్రజలతో పాటు పోలీసు అధికారులు, సిబ్బంది కూడా నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఇండ్లలోకి వరద నీరు చేరే ప్రమాదం ఉన్నట్లయితే వెంటనే బాధితులను సురక్షిత ప్రాంతాలకు తరలించేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రజల రక్షణ కోసం పోలీసులు 24/7 అప్రమత్తంగా ఉండి ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటారని తెలిపారు. వాగులు, వంకలు, చెరువులు, నదుల్లో వరద ప్రవాహం ఉధృతంగా ఉన్నందున వాటి వద్దకు ఎవరూ వెళ్లరాదని సూచించారు. గోదావరి, మానేరు నదుల పరివాహక ప్రాంతాల ప్రజలు మరింత జాగ్రత్తగా ఉండాలని, చెరువులు, వాగులు, ప్రాజెక్టుల వద్దకు ప్రజలు, మత్స్యకారులు ఎట్టి పరిస్థితుల్లోనూ చేపల వేటకు వెళ్లవద్దన్నారు. వర్షపు నీటి కారణంగా రహదారులపై వాహనాలు అదుపు తప్పే ప్రమాదం ఉన్నందున వాహనదారులు పరిమిత వేగంతో మాత్రమే ప్రయాణించాలని తెలిపారు. పిల్లలు, యువకులు చెరువులు, నదుల వద్దకు సెల్ఫీలు దిగడానికి లేదా ఈత కొట్టడానికి వెళ్లకుండా తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని కోరారు. విపత్కర పరిస్థితుల్లో ప్రజలకు సేవలందించేందుకు జిల్లా పోలీసు యంత్రాంగం సిద్ధంగా ఉందని, అత్యవసర సహాయం కోసం వెంటనే డయల్ 100 కు కాల్ చేయాలని లేదా స్థానిక పోలీసులను సంప్రదించాలని సీపీ వెల్లడించారు.

భారీ వర్షాల నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలి

-జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్

జగిత్యాల బ్యూరో ప్రభాత వార్త:



జగిత్యాల జిల్లాలో భారీ వర్షాల హెచ్చరికల నేపథ్యంలో అన్ని శాఖల అధికారులు పూర్తి అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ ఆదేశించారు. జగిత్యాల జిల్లాలో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో జిల్లా కలెక్టర్ బి సత్యప్రసాద్ బుధవారం క్షేత్రస్థాయిలో పర్యటించి అధికారులకు పలు సూచనలు చేశారు.జగిత్యాల రూరల్ మండలం అనంతరం, గొల్లపేట లో, ధర్మపురి మండలం నేరెళ్ల , ఆక్సాయిపల్లి గ్రామాల పరిధిలో గల లో లెవల్ వంతెనల పై నుండి వరద నీరు ప్రవహిస్తున్నందున వరద పరిస్థితి ని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ పరిశీలించారు. జిల్లా కలెక్టర్ బి సత్య ప్రసాద్ మాట్లాడుతూ జిల్లా అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లు అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని సూచించారు.అన్ని శాఖల అధికారులు తమ ప్రధాన కార్యాలయాల్లోనే అందుబాటులో ఉండాలని, ముందస్తు అనుమతి లేకుండా ప్రధాన కార్యాలయాలను విడిచి వెళ్లరాదని కలెక్టర్ స్పష్టం చేశారు. వర్షాల కారణంగా ఎటువంటి సంఘటనలు, నష్టాలు, నీటి ముంపు, ప్రజల నుంచి ఫిర్యాదులు వచ్చినా వెంటనే స్పందించి సమస్యలను పరిష్కరించాలని, తీసుకున్న చర్యలను ఆలస్యం చేయకుండా జిల్లా కంట్రోల్ రూమ్‌తో పాటు జిల్లా యంత్రాంగానికి తెలియజేయాలని ఆదేశించారు.ముఖ్యంగా గోదావరి పరీవాహక ప్రాంత మండలాల అధికారులు ప్రత్యేక అప్రమత్తతతో వ్యవహరించాలని, తరచూ క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ గోదావరి నీటిమట్టాన్ని నిరంతరం పరిశీలించాలని సూచించారు. ముంపునకు గురయ్యే అవకాశం ఉన్న గ్రామాలు, కాలనీలను ముందుగానే గుర్తించి, ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా అవసరమైన అన్ని ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని పేర్కొన్నారు.మున్సిపల్ కమిషనర్లు పట్టణ ప్రాంతాల్లో డ్రైనేజీల్లో ఏర్పడిన అడ్డంకులను వెంటనే తొలగించి, వర్షపు నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. లోతట్టు ప్రాంతాల్లో నీటిముంపు సమస్యలు తలెత్తకుండా నిరంతరం పర్యవేక్షిస్తూ, అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు అవసరమైన సిబ్బంది, యంత్ర సామగ్రిని సిద్ధంగా ఉంచాలని సూచించారు.అదేవిధంగా తహసీల్దార్లు, ఎంపీడీఓలు, తమ పరిధిలో ప్రత్యామ్నాయ పునరావాస కేంద్రాలను గుర్తించి, తాగునీరు, విద్యుత్, పారిశుద్ధం, ఆహారం తదితర మౌలిక వసతులతో సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. అవసరమైతే ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని తెలిపారు.అన్ని శాఖల అధికారులు జిల్లా యంత్రాంగంతో నిరంతరం సమన్వయం కొనసాగిస్తూ, 24 గంటలూ పరిస్థితిని పర్యవేక్షించాలని, ప్రజల ప్రాణాలు, ఆస్తుల రక్షణే అత్యంత ప్రాధాన్యతగా భావించి వేగవంతంగా, సమర్థవంతంగా చర్యలు చేపట్టాలని ఆదేశించారు.ఈ పర్యటనలో కలెక్టర్ వెంట జగిత్యాల ఆర్డీవో మధుసూదన్ జగిత్యాల రూరల్ తహసిల్దార్ హకీం ధర్మపురి తాసిల్దార్ శ్రీనివాస్ మరియు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగాలి

-ప్రజలకు మెరుగైన సౌకర్యాల కల్పనే ప్రభుత్వ ధ్యేయం

-మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్

పెగడపల్లి, ప్రభాతవార్త:



గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యతనిస్తూ ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని తెలంగాణ రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. పెగడపల్లి ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం మండల ప్రత్యేక అధికారి శ్రీకాంత్ అధ్యక్షతన నిర్వహించిన గ్రామ, మండల అభివృద్ధి కార్యక్రమాల సమీక్ష సమావేశంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మండలంలోని గ్రామాల అభివృద్ధి పనులు, తాగునీటి సమస్యలు, పారిశుద్ధ్య నిర్వహణ, గ్రామ పంచాయతీల సమస్యలపై సర్పంచులు, అధికారులతో సమీక్షించారు. ఆయా గ్రామాల సర్పంచులు గ్రామ సమస్యల గూర్చి తెలిపారు.వర్షాకాలం నేపథ్యంలో గ్రామాల్లో సీజనల్ వ్యాధుల నియంత్రణకు వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని మంత్రి సూచించారు. పారిశుద్ధంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, ప్రజల్లో ఆరోగ్య అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు.గ్రామాల్లో నెలకొన్న సమస్యలను గుర్తించి వెంటనే పరిష్కరించాలని, అభివృద్ధి పనులను నాణ్యతతో నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ప్రతి గ్రామంలో తాగునీటి సరఫరా సక్రమంగా ఉండేలా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు.ప్రజలకు ప్రభుత్వ సేవలు అందించడంలో నిర్లక్ష్యం ఉండకూడదని మంత్రి పేర్కొన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేస్తేనే గ్రామాల సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని అన్నారు.ఈ సమావేశంలో మార్కెట్ కమిటీ చైర్మన్ బుర్ర రాములు గౌడ్, తాసిల్దార్ నిజాముద్దీన్, ఎంపీడీవో ప్రేమ్ సాగర్, ఎంపీ ఓ శశి కుమార్ రెడ్డి, ఆయా గ్రామాల సర్పంచులు, అధికా రులు, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

చెరువా..కళాశాలా..!

జగిత్యాల టౌన్,ప్రభాత వార్త:



జగిత్యాల ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ఆవరణలోనుండి నీరు బయటకు ప్రవహించే మార్గం లేకపోవడంతో విద్యార్థినులు తరగతిగదులకు రాకపోకలకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కళాశాలలో తరగతి గదులలో నీరు నిలుస్తుండడంతో చదువులకు ఆటంకాలు ఏర్పడుతున్నాయి. ఇంకుడుగుంతలు నిర్మించిగానీ, కాలువలను ఏర్పాటుచేసి కానీ నీటిని తరలించాలని, లేనట్లయితే వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నదని బాలికలు పేర్కొంటున్నారు.

నేతన్నల ఆత్మగౌరవానికి... నిధుల 'గ్రహణం'!

రూ. 5 కోట్ల భవనం పునాధుల్లోనే బందీ..బిల్లులు రాక నిలిచిన భవన నిర్మాణం

నేడు మంత్రులు పొన్నం, తుమ్మల పర్యటన.. నెరవేరేనా పద్మశాలీల నిరీక్ష?

సిరిసిల్ల బ్యూరో , ప్రభాతవార్త

రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో పద్మశాలీ సామాజిక వర్గం ఆత్మగౌరవ ప్రతీకగా నిర్మించతలపెట్టిన 'పద్మశాలీ ఆత్మగౌరవ భవనం' నేడు పాలకుల నిరక్ష్యం, నిధుల లేమితో పునాధులకే పరిమితమైంది. గత బీఆర్ఎస్ ప్రభుత్వం సిరిసిల్ల బైపాస్ రోడ్డులో రూ. కోట్లాది విలువైన ఐదు ఎకరాల స్థలాన్ని కేటాయించి, మొదటి విడతగా రూ. 5 కోట్లు మంజూరు చేసింది. పనులు వేగంగా ప్రారంభమై పునాధులు, పిల్లర్ల దశకు చేరుకున్న సమయంలో ప్రభుత్వం మారడం, ఆ వెంటనే బిల్లులు నిలిచిపోవడంతో కాంట్రాక్టర్ పనులను అర్ధాంతరంగా నిలిపివేశారు.భవన నిర్మాణంలో భాగంగా ఇప్పటివరకు దాదాపు 50 శాతం (రూ. 2.50 కోట్ల విలువైన) పనులు పూర్తయ్యాయి. అయితే, ప్రభుత్వం నుంచి ఒక్క రూపాయి కూడా బిల్లు విడుదల కాకపోవడంతో కాంట్రాక్టర్ తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోయారు.నిర్మాణ పనులు నిలిచిపోవడంతో తవ్విన గుంతల్లో వర్షపు నీరు చేరి ఫిల్లర్లు మునిగిపోతున్నాయి. లోపల ఉన్న ఐరన్ సలాకాలు చిలుము పట్టి దెబ్బతినే పరిస్థితి ఏర్పడింది.కనీసం భూమి లెవెల్ (ప్లింత్ లెవెల్) వరకైనా నిర్మాణం పూర్తి చేసి మట్టి పూడ్చితే, పటిష్టమైన ఫిల్లర్లు పాడవకుండా ఉంటాయని పద్మశాలీ సంఘం నేతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల సమయంలో సిరిసిల్ల పద్మశాలీ సంఘం నేతలు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ దృష్టికి ఈ సమస్యను పలుమార్లు తీసుకెళ్లారు. అప్పట్లో స్పందించిన మంత్రి.. కాంట్రాక్టర్‌తో మాట్లాడి పనులు పునఃప్రారంభించాలని, బిల్లులు త్వరలోనే మంజూరు చేయిస్తామని హామీ ఇచ్చారు. మంత్రి హామీతో నమ్మి కాంట్రాక్టర్ మరో రూ. కోటి విలువైన పనులు పూర్తి చేసి, తాత్కాలికంగా మట్టిని ఫిల్ చేశారు. కానీ, నెలలు గడుస్తున్నా ఆ బిల్లులు కూడా విడుదల కాకపోవడంతో పనులు పూర్తిగా పడకేసాయి. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు దాటుతున్నా నిధుల విడుదలపై స్పష్టత లేకపోవడంపై పద్మశాలీ సామాజిక వర్గం తీవ్ర అసంతృప్తితో ఉంది.గురువారం రాజన్న సిరిసిల్ల జిల్లాలో మంత్రులు పొన్నం ప్రభాకర్, తుమ్మల నాగేశ్వరరావు పర్యటించనున్నారు. ఈ పర్యటన సందర్భంగానైనా సిరిసిల్ల పద్మశాలీ భవన పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేసి, నిర్మాణాన్ని వేగవంతం చేసేలా స్పష్టమైన ప్రకటన చేయాలని నేత కార్మికులు, పద్మశాలీ సంఘం నాయకులు విజ్ఞప్తి చేస్తున్నారు.



హౌసింగ్ బోర్డు వరద ముప్పు ప్రాంతాలను పరిశీలించిన మున్సిపల్ చైర్మన్..

జమ్మికుంట/ హుజూరాబాద్ , ప్రభాతవార్త:

కరీంనగర్ జిల్లా హుజురాబాద్ నియోజకవర్గం జమ్మికుంట మున్సిపాలిటీ పరిధిలోని హౌసింగ్‌బోర్డు, అంబేద్కర్ కాలనీ వరద ముంపు లోతట్టు ప్రాంతాలు గత 15 సంవత్సరాలుగా ఈ నియోజకవర్గ రాజకీయ పార్టీల నేతలకు ఎన్నికల నినాదంగా మారిపోయి, ఈ ప్రాంత ముంపు ప్రజలను వరదల సంబవించినప్పుడు కంటితుడుపు చర్యగా కాలనీలను సందర్శించడం, ఓదార్పులు చేయడం, ప్రజల భుజాల మీద చేతులు వేసి సానుభూతి ప్రకటించడం కోట్ల రూపాయలు వెచ్చించి శాశ్వత పరిష్కారం చేపడుతామంటూ ఓట్లు దండుకుని పీఠాలెక్కిన నేతలంతా హౌసింగ్‌బోర్డు ముప్పు ప్రాంతాలను మరిచిపోయారని ఈ ప్రాంత ప్రజలు పార్టీల నేతలపై



దుమ్మెత్తిపోస్తున్నారు.

వర్షాకాలం వచ్చిదంటే సుమారు 400కుటుంబాలు రేయింబగళ్లు బిక్కుబిక్కుమంటూ హౌసింగ్‌బోర్డు కాలనీ అంబేద్కర్ కాలనీ, కృష్ణకాలనీ, హరితనగర్ లోతట్టు ప్రాంతాల ప్రజలు నీళ్లు ఎక్కడ ఇండ్లలోకి ముంచుకొస్తాయన్న భయంతో తల్లడిల్లిపోతుంటారు. ఇప్పటికే పలుమార్లు వందలాది ఇండ్లు నీటమునిగి, కట్టుబట్టలతో బయటకు వెళ్లిన రోజులు కొకొల్లలు. ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకున్న జమ్మికుంట మున్సిపాలిటీ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ (దిలీప్), ఆరోవ వార్డు కౌన్సిలర్ శ్రీపతి స్వర్ణలత నరేష్‌లు మున్సిపల్ సిబ్బందితో జెసిబిని తీసుకువచ్చి హుజూరాబాద్ రోడ్‌లో ఉన్న ముంపు ప్రాంతాలలో రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు నీరు ఎక్కడ ఆగకుండా కాల్వలలో ప్లాస్టిక్ కవర్లు, బాటిళ్లు చెత్త డ్రైనేజీలో ఇరుక్కుపోవడం వల్ల జెసిబి సహాయంతో అంత తోలగించారు. లోతట్టు ప్రాంతాలలో పర్యటించి, ముందు జాగ్రత్త చర్యగా ఆ ప్రాంత ప్రజలను అప్రమత్తం చేసారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్‌కుమార్ మాట్లాడుతూ హౌసింగ్‌బోర్డులో ముంపు గురవుతున్న ప్రాంతాలను దృష్టిలో పెట్టుకుని శాశ్వత డ్రైనేజీ నిర్మాణానికి ప్రణాళికలు రూపొందించి ప్రభుత్వానికి పంపడం జరిగిందని, వరుద కాల్వ నిర్మాణం పూర్తి చేస్తామని చైర్మన్ హామీ ఇచ్చారు. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో ప్రజలు 30వార్డులలో అప్రమత్తంగా ఉండాలని చైర్మన్ దిలీప్ విజ్ఞప్తి చేసారు.

రోడ్డు పై గుంతలను పూడ్చండి.. ఆర్ అండ్ బి అధికారుల పనితీరుపై పచ్చునూర్ ప్రజల ఆగ్రహం..

మానకొండూర్, ప్రభాతవార్త :

మండలంలోని పచ్చునూర్ గ్రామంలో ని ప్రధాన రహదారి పై పడ్డ



గుంతలతో ప్రయాణికులు, వాహనాదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్న సంబంధిత అధికారులు పట్టించుకోవడంలేదన్నారు. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు రహదారిపై పడ్డ గుంతలు ఏర్పడక వాహనదారులు అదుపుతప్పి పలు ప్రమాదాలు చోటుచేసుకున్నాయని స్థానికులు ఆరోపించారు. వీణవంక మండలం నుండి మానకొండూరుకు వెళ్లే ప్రధాన రహదారి పచ్చునూర్ గ్రామంలోని చర్చి సమీపంలోని ప్రధాన మూల మలుపు వద్ద , పెద్దమ్మ దేవాలయం వద్ద, నర్సరీ కేంద్రం వద్ద గల ప్రధాన రహదారిపై భారీ గుంతలతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అలాగే రాత్రి వేళలో వాహనదారులకు గుంతలు ఏర్పడక పలు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని తెలిపారు. వీణవంక మండలం నుండి మానకొండూరు వైపుగా నిత్యం ఇసుక లారీల అధిక లోడు రవాణాతో రహదారి పలుచోట్ల ధ్వంసం అయిందన్నారు. ఈ ప్రధాన రహదారిపై మానకొండూరు నుండి వీణవంకకు ప్రతిరోజు వందలాది వాహనాలు రాకపోకలు కొనసాగుతూ ఉంటాయని ఈ గుంతల రోడ్డుపై ప్రయాణించాలంటే ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. మండల ఆర్ అండ్ బి అధికారులకు గ్రామస్తులు పలుమార్లు తెలిపిన పట్టించుకోవడంలేదని, ఎమ్మెల్యే స్వగ్రామంలో ప్రజా సమస్యలపై పరిష్కరించడంలో అధికారుల నిరక్ష్యం పూర్తిగా కనిపిస్తుందని, అధికారుల పనితీరుపై స్థానిక ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి రోడ్డుపై పడ్డ గుంతలను పూడ్చి మరమ్మతులు చేపట్టాలని స్థానికులు ప్రజలు కోరుతున్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రెండవ రోజు కార్యశాల విజయవంతం

హుజూరాబాద్ టౌన్, ప్రభాత వార్త:

శాతవాహన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అకాడమిక్ ఎంపవర్‌మెంట్ ప్రోగ్రాం 100 రోజుల కార్యాచరణలో భాగంగా, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, హుజూరాబాద్, శాతవాహన విశ్వవిద్యాలయం తెలుగు విభాగం సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సృజనాత్మక రచన – స్క్రిప్ట్ రచనా నైపుణ్యాలు అనే రెండు రోజుల కార్యశాల రెండవ రోజు బుధవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ముఖ్య వక్తగా పాల్గొన్న ప్రభుత్వ డిగ్రీ కళాశాల, సిద్దిపేట తెలుగు అధ్యాపకులు ప్రొఫెసర్ మట్టా సంపత్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ... తెలంగాణ సాహిత్యం, భాష, సంస్కృతి, జానపద సంపదలు మన సమాజానికి అమూల్యమైన వారసత్వమని పేర్కొన్నారు. ఆధునిక సాంకేతిక యుగంలోనూ ఈ సంపదను సంరక్షించి, భావితరాలకు



అందించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. ముఖ్యంగా యువత తెలంగాణ జానపద సంపద, స్థానిక భాషా వైవిధ్యం, సాహిత్య సంప్రదాయాలపై అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. అనంతరం మహాత్మా జ్యోతిబా పూలే గురుకుల డిగ్రీ కళాశాల, నిర్మల్ అధ్యాపకులు డా. బట్టు విజయ్ కుమార్ తెలుగులో ఆధునిక సాహిత్య రూపాలు – సృజనాత్మక వికాసం అనే అంశంపై ప్రసంగించారు. మినీ కవిత, హైకూ, నానీలు, రుబాయి, గజల్ వంటి ఆధునిక కవితా రూపాల స్వరూపం, నిర్మాణం, సృజనాత్మకత, భావవ్యక్తీకరణ అంశాలను వివరించారు. సమకాలీన భావాలను సంక్షిప్తంగా, ప్రభావవంతంగా వ్యక్తీకరించడానికి ఈ సాహిత్య రూపాలు ఎంతో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. మరోవక్త మహాత్మా జ్యోతిబా పూలే తెలంగాణ వెనుకబడిన తరగతుల సంక్షేమ మహిళా డిగ్రీ కళాశాల ఖమ్మం అధ్యాపకురాలు కొండా ప్రవళిక జానపద గేయాల సేకరణ – డాక్యుమెంటేషన్ విధానాలు, ఆవశ్యకత అనే అంశంపై ప్రసంగించారు. జానపద గేయాల సేకరణలో అనుసరించాల్సిన పరిశోధనా పద్ధతులు, క్షేత్రస్థాయి అధ్యయనం, ఆడియో–వీడియో రికార్డింగ్, లిఖిత రూపంలో భద్రపరచడం, డిజిటల్ డాక్యుమెంటేషన్ వంటి అంశాలను వివరించారు. తెలంగాణ జానపద సంపదను పరిరక్షించడానికి శాస్త్రీయ డాక్యుమెంటేషన్ అత్యంత అవసరమని ఆమె పేర్కొన్నారు. ఈ సందర్భంగా కార్యశాలలో పాల్గొన్న విద్యార్థులు తాము రచించిన కవితలను వేదికపై చదివి వినిపించారు. వారి సృజనాత్మక రచనలను అధ్యాపకులు అభినందిస్తూ విలువైన సూచనలు చేశారు. కార్యశాల ముగింపు సందర్భంగా పాల్గొన్న విద్యార్థులకు ధ్రువపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డా. పి. ఇందిరా దేవి, కార్యక్రమ కో ఆర్డినేటర్ ప్రొఫెసర్ కొత్తిరెడ్డి మల్లారెడ్డి కళాశాల అకాడమిక్ కో ఆర్డినేటర్ డా. కె. లింగారెడ్డి, ఐ.క్యు.ఎ.సి.కో ఆర్డినేటర్ డా. బి. రేణుక, అధ్యాపకులు డా. వి. స్వరూపా రాణి, డా. సరళ ఝాన్సి, పల్లవి, ఓదెలు, రమ, సుమలత, నరేందర్, మహిపాల్ రెడ్డి, స్వప్న, విద్యార్థినీ, విద్యార్థులు, పరిశోధక విద్యార్థులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ మార్క్ కృత్రిమ కరువు... నీళ్లు లేక ఆగిన వరి నాట్లు

-- ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి తీవ్ర ఆగ్రహం

జమ్మికుంట/హుజూరాబాద్, ప్రభాత వార్త:



ప్రభుత్వానికి ముందస్తు ప్రణాళిక, దూరదృష్టి లేకపోవడం వల్లే నేడు కమాండ్ ఏరియాలోని రైతాంగం వరి నాట్లు కూడా వేయలేని దయనీయ స్థితికి చేరుకుందని హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి మండిపడ్డారు. బుధవారం హుజూరాబాద్ మండలం సిర్సపల్లి గ్రామంలో సాగునీరు అందక నాట్లు పడని పొలాలను ఆయన స్వయంగా పరిశీలించారు. నీటి ఎద్దడిని తట్టుకోవడానికి బావులు తవ్వుకుంటున్న రైతులను పరామర్శించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ... పదేళ్ల క్రితం తెలంగాణలో నీటి కొరత తీవ్రంగా ఉండేదని, అయితే రైతు సంక్షేమమే ధ్యేయంగా మాజీ సీఎం కేసీఆర్ మిషన్ భగీరథ, మిషన్ కాకతీయలతో పాటు కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మించారని గుర్తుచేశారు. కేసీఆర్ దూరదృష్టి వల్ల వేసవిలో కూడా చెరువులు మత్తడి దుమికాయని, కానీ కాంగ్రెస్ ప్రభుత్వం లేనిపోని అబద్దాలు చెప్పి అధికారంలోకి వచ్చి రైతులను ముంచుతోందని విమర్శించారు. ఎల్ నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఉంటాయని శాస్త్రవేత్తలు ముందే హెచ్చరించినా ప్రభుత్వం మేల్కొనలేదన్నారు. సముద్రంలో వృథాగా కలుస్తున్న నీటిని కన్నెపల్లి పంప్ హౌస్ ద్వారా ఎత్తిపోయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం కృత్రిమ కరువును సృష్టించిందని ఆరోపించారు. పంపింగ్ చేస్తే కేసీఆర్‌కు మంచి పేరు వస్తుందనే అసూయతో సీఎం రేవంత్ రెడ్డి మొండిగా వ్యవహరిస్తూ రైతుల కడుపు కొడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

-- పోలీసుల బందోబస్తు పై ఆగ్రహం...

నియోజకవర్గ ప్రజాసమస్యలపై కలెక్టర్‌ను కలవడానికి వెళ్తుంటే పోలీసులు తనను అడ్డుకుంటున్నారని ఎమ్మెల్యే ధ్వజమెత్తారు. పోలీసుల వైఫల్యాలను ప్రశ్నిస్తున్నందుకే సిపి, సీఎం రేవంత్ రెడ్డిలు తనపై ఒత్తిడి తెస్తున్నారని, ఎన్ని అడ్డంకులు సృష్టించినా ప్రజల తరఫున తన పోరాటం ఆగదని స్పష్టం చేశారు. రాజకీయాలు ఎన్నికల వరకే పరిమితం చేయాలని, కేసీఆర్‌పై ఉన్న కోపంతో రైతులను బలిచేయకూడదని హితవు పలికారు. ఇప్పటికైనా ప్రభుత్వం కన్నెపల్లి పంప్ హౌస్ నుండి నీటిని ఎత్తిపోసి ఆయకట్టు రైతులను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.



భక్తిశ్రద్ధలతో గురు పౌర్ణమి వేడుకలు

హుజూరాబాద్ టౌన్, ప్రభాత వార్త:

అజ్ఞానాన్ని తొలగించి జ్ఞానాన్ని పంచే గురువులను పూజించే పవిత్ర పర్వదినం గురు పౌర్ణమిని బుధవారం హుజూరాబాద్ పట్టణంలో ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. ఆషాఢ శుద్ధ పౌర్ణమి రోజును పురస్కరించుకొని విద్యాసంస్థల్లో గురు పూజలు, ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, భజనలు, అన్నదాన కార్యక్రమాలు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పట్టణంలోని శ్రీ గణపతి దత్తాత్రేయ సహిత షిరిడీ సాయిబాబా ఆలయంలో చైర్మన్ వెంపటి సదానందం, అర్చకులు వరుణ్ అయ్యగార్ల ఆధ్వర్యంలో గురుపౌర్ణమి ప్రత్యేక పూజలు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆలయాన్ని పూలతో అలంకరించి ఉదయం నుంచే పూజలు ప్రారంభించారు. భక్తులు వర్షాన్ని సైతం లెక్క చేయకుండా బాబా ఆలయానికి తరలివచ్చి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయంలో కలుష పూజ. అభి షేకం, హారతి, మంత్ర పుష్పం, తీర్థప్రసాద వితరణ, పల్లకీ సేవ, విశేష పూజలను నిర్వహించారు. భక్తుల సాయి నామస్మరణలతో ఆలయ ప్రాంగణమంతా మార్మోమోగింది. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. శ్రీ షిరిడీ సాయిబాబా దివ్య ఆశీస్సులు ప్రజలందరిపై ఎల్లప్పుడూ ఉండాలని, అందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆలయంలో విశేష పూజలు నిర్వహించినట్లు ఆలయ అర్చకులు అరుణ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



వర్షంలోనూ ప్రజాక్షేమమే ధ్యేయం

తుంగూరు చెరువులు, మత్తడులను పరిశీలించిన సర్పంచ్ రాజగోపాల్ రావు

బీర్ పూర్ ప్రభాత వార్త.జగిత్యాల జిల్లా బీర్‌పూర్ మండలంలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో గ్రామ ప్రజలకు ఎలాంటి కష్టం రాకుండా చూడటమే ధ్యేయంగా తుంగూరు గ్రామ సర్పంచ్ రాజగోపాల్ రావు తన ప్రజా నిబద్ధతను చాటుకున్నారు. కుండపోత వర్షాన్ని సైతం లెక్కచేయకుండా బుధవారం ఉదయాన్నే తన పాలకవర్గంతో కలిసి గ్రామంలోని చెరువులు, కుంటలు మరియు మత్తడి పరిసర ప్రాంతాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఇటీవల నూతనంగా నిర్మిస్తున్న శ్రీ రాజరాజేశ్వర స్వామి గుడి వద్దగల మత్తడి బ్రిడ్జి పరిసరాల్లో చుట్టుపక్కల పొలాల నుంచి వరద నీరు ఎక్కువగా ప్రవహిస్తుండటంతో, నిర్మాణంలో ఉన్న బ్రిడ్జి వద్ద వరద ఉధృతిని ఆయన దగ్గరుండి పర్యవేక్షించారు. అలాగే గ్రామంలోని చెరువుల నీటిమట్టాన్ని, తూముల పరిస్థితిని నిశితంగా పరిశీలిస్తూ, అత్యవసర సమయాల్లో తూములు మరియు చెరువు గేట్లకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తుగా పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. ఎమ్మెల్యే సంజయ్ కుమార్ వరదల పరిస్థితిని గురించి నిత్యం తెలుసుకుంటు తగు సూచనలు చేశారని వారి సూచనల మేరకు గ్రామ పాలకవర్గం అప్రమత్తంగా ఉందని



వరద వల్ల ఎలాంటి అత్యవసర పరిస్థితి ఎదురైనా ఎదుర్కొనేందుకు గ్రామపంచాయతీ పాలకవర్గం పూర్తి అప్రమత్తంగా ఉందని స్పష్టం చేశారు. వర్షాల ఉధృతి దృష్ట్యా గ్రామ ప్రజలు, ముఖ్యంగా వ్యవసాయదారులు చెరువులు, కుంటలు, మత్తడి ప్రాంతాలకు వెళ్లకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఏ చిన్న సమస్య వచ్చినా వెంటనే గ్రామపంచాయతీ పాలకవర్గాన్ని గానీ, అధికారులను గానీ సంప్రదించాలని కోరారు. వర్షంలో సైతం స్వయంగా రంగంలోకి దిగి నిత్యం గ్రామాన్ని, ప్రజల క్షేమాన్ని పర్యవేక్షిస్తున్న సర్పంచ్ రాజగోపాల్ రావు మరియు పాలకవర్గం పనితీరుపై తుంగూరు గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ కొనియాడుతున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ రాజగోపాల్ రావు, ఉప సర్పంచ్ శీలం లింగన్న,వార్డు మెంబర్ బండారి తిరుపతి మరియు గ్రామస్తులు పాలకవర్గం పాల్గొన్నారు.

భారీ వర్షాల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలి

-జిల్లా కలెక్టర్‌ను కోరిన ఎంపీ ధర్మపురి అర్వింద్

జగిత్యాల బ్యూరో ప్రభాత వార్త:జగిత్యాల జిల్లాలో కురుస్తున్న భారీ



వర్షాల నేపథ్యంలో జిల్లా కలెక్టర్‌ను పలు కీలక అంశాలపై నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ విజ్ఞప్తి చేశారు. పార్లమెంట్ సమావేశంలో పాల్గొంటున్న ఆయన, భారీ వర్షాల నేపథ్యంలో బుధవారం చరవాణి ద్వారా కలెక్టర్ తో మాట్లాడారు.మున్సిపల్, రెవెన్యూ, పంచాయతీరాజ్, ఆరోగ్య శాఖ, వాటర్ సప్లై, విద్యుత్ శాఖ, ఆర్ అండ్ బీ జాతీయ రహదారుల సంస్థ తో పాటు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని సూచించారు.అలాగే జిల్లాలోని చెరువులు, కుంటలు, ప్రాజెక్టుల బలహీనంగా ఉన్న కట్టలపై ప్రత్యేక దృష్టి సారించాలని, ఎప్పటికప్పుడు పరిస్థితిని పర్యవేక్షిస్తూ అవసరమైన రక్షణ చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్‌ను కోరారు. వాతావరణ శాఖ రానున్న రెండు రోజుల పాటు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరించిన నేపథ్యంలో జిల్లా యంత్రాంగం పూర్తిస్థాయిలో అప్రమత్తంగా ఉండి ముందస్తు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.లోతట్టు ప్రాంతాల్లోని ప్రజలకు నిత్యావసర వస్తువులు, స్వచ్ఛమైన తాగునీరు, వైద్య సేవలు తదితర సౌకర్యాలను అందుబాటులో ఉంచాలని కోరారు.ఈ సందర్భంగా ఎంపీ ధర్మపురి అర్వింద్ ప్రజలకు విజ్ఞప్తి చేస్తూ,అవసరమైతే తప్ప ఇళ్ల నుంచి బయటకు రావద్దని, వరద నీరు ప్రవహిస్తున్న ప్రాంతాలు, వాగులు, వంకలు దాటేందుకు ప్రయత్నించవద్దని, జిల్లా యంత్రాంగం జారీ చేసే సూచనలను తప్పనిసరిగా పాటిస్తూ అప్రమత్తంగా ఉండాలని కోరారు.

ఓదెలలో మడేలయ్యకు బోనాలు

ఓదెల,ప్రభాతవార్త:



ఓదెల మండల కేంద్రంలో రజకుల ఆరాధ్య దైవమైన మడేలేశ్వర స్వామికి ఘనంగా బోనాలు సమర్పించారు బుధవారం ఈ సందర్భంగా రజక సంఘం ఆధ్వర్యంలో మడలేశ్వర స్వామికి అంగరంగ వైభవంగా మహిళలు బోనాలతో డప్పు చప్పుల తో శివసత్తుల పూనకాలతో ముందుగా పోచమ్మ తల్లికి మొక్కులు చెల్లించుకుని వారి ఆరాధ్య దైవం అయిన మడేలయ్యా ఆలయానికి చేరుకొని బోనాలను సమర్పించి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వచ్చిన గ్రామ సర్పంచ్ కనికిరెడ్డి సతీష్ మాజీ సర్పంచ్ ఆకుల మహేందర్ ఉపసర్పంచ్ గోపతి శ్రీలత ప్రవీణ్ లను సంఘం ఆధ్వర్యంలో శాలువాలతో ఘనంగా సన్మానించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ ప్రజలందరూ పాడిపంటలతో ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో ఉండాలని ఆ స్వామిని కోరారు ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు పైడిపల్లి రమేష్, కార్యదర్శి చాతల్ల విష్ణు, సంగం పెద్దలు మేడిచెల్ముల చంద్రయ్య, రామడుగు వెంకటేష్, చాతల్ల రామస్వామి, రామడుగు రాములు, చాతల్ల శ్రీనివాస్, మడికొండ వీరయ్య, సమ్మయ్య, రామడుగు మొండి, చాతల్ల రవి, కుమారస్వామి, హరీష్, శ్రీనివాస్, రాజేశం, కుమార్,రాఖి,శ్రావణ్, వెంకటేష్,కిషన్,రాజశేఖర్ శ్రీనివాస్,రాము మహిళలు యువకులు పెద్దలు తదితరులు పాల్గొన్నారు

పాఠశాలల్లో వర్షపు నీటిని వెంటనే తొలగించాలి

సీపీఐ(ఎం) నాయకుడు కల్లెపల్లి అశోక్



పెద్దపల్లి, ప్రభాతవార్త: పాఠశాలల్లో నిలిచిన వర్షపు నీటిని వెంటనే తొలగించాలని సీపీఐ(ఎం) నాయకుడు కల్లెపల్లి అశోక్ డిమాండ్ చేశారు. బుధవారం భారీ వర్షాల కారణంగా రాఘవాపూర్ గ్రామంలోని 3 ప్రభుత్వ పాఠశాలల ప్రాంగణాల్లోకి వర్షపు నీరు చేరి పాఠశాలలు జలమయంగా మారిన ప్రదేశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షపు నీటి వల్ల విద్యార్థులు, ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. నీరు ఎక్కువ రోజులు నిల్వ ఉండడం వల్ల పాములు, తేళ్లు వంటి విషపూరిత జీవులు వచ్చే ప్రమాదం ఉందన్నారు. ఇది విద్యార్థుల భద్రతకు తీవ్రమైన ముప్పుగా మారే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం బడుల అభివృద్ధికి నిధులు ఇస్తున్నామని చెబుతున్నా ఇక్కడి పరిస్థితి భిన్నంగా ఉందన్నారు. కలెక్టర్, స్థానిక ఎమ్మెల్యే, జిల్లా విద్యాశాఖ అధికారి డిఈఓ తక్షణమే స్పందించి పాఠశాలలను పరిశీలించాలని కోరారు. నిల్వ నీటిని తొలగించి శాశ్వత పరిష్కార చర్యలు చేపట్టాలన్నారు. విద్యార్థుల భద్రతను దృష్టిలో ఉంచుకుని సాధారణ పరిస్థితులు నెలకొల్పాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) నాయకుడు శ్రావణ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

అత్యధిక వర్షపాతం నమోదుప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- తహసీల్దార్ వాహిదోద్దిన్, ఎస్సై గీత

సారంగాపూర్, ప్రభాత వార్త : గత 24 గంటల్లో సారంగాపూర్ మండలంలో 176.3 మిల్లీమీటర్ల (మి.మీ.) అత్యధిక వర్షపాతం నమోదైంది. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా వాగులు, వంకలు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. లోతట్టు ప్రాంతాలు జలమయమవడంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ వాహిదోద్దిన్, ఎస్సై గీత సూచించారు.అత్యవసర పరిస్థితులు మినహా ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావద్దని, వాగులు, వంకలు దాటే ప్రయత్నం చేయవద్దని హెచ్చరించారు. భారీ వర్షాల కారణంగా ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నందున చిన్నారులను వరద నీటి సమీపానికి వెళ్లనివ్వకుండా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు.రైతులు వ్యవసాయ పనులకు వెళ్లే సమయంలో అప్రమత్తంగా ఉండాలని, విద్యుత్ తీగలు తెగి కనిపిస్తే వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని సూచించారు.

చినుకు పడితే చిత్తడే!

గుంతల రోడ్లు... నరకయాత పాలకులకు ప్రభుత్వానికి పట్టింపేది?

ప్రభాతవార్త కోనరావుపేట:



పాలకులు మారినా ప్రభుత్వాలు మారినా మండల కేంద్ర రోడ్లు మారడం లేదు ప్రధాన రోడ్లన్నీ శిథిలావస్థకు చేరుకు న్నాయి. చినుకు పడితే చిత్తడే రోడ్లు చెరువుల తలపడుతున్నాయి వందలాది వాహనాలు, వేలాది ప్రజలు ప్రయాణించే రోడ్ల పరిస్థితి అత్యంత దయనీయంగా ఉంది.ఆకాశంలో చిన్న చినుకు పడినా చాలు రోడ్లన్నీ చిత్తడిగా మారిపో తున్నాయి. పెద్ద పెద్ద గుంతలు నీటితో నిండి చెరువుల్లా కనిపిస్తున్నాయి. ద్విచక్ర వాహనం పై వెళ్లేవారు గుంతల నరకయాతన అనుభవిస్తున్నారు ఎన్నికల ముందు అభివృద్ధి చేస్తానని వాగ్దానం చేస్తున్న నాయకులు హామీలను మర్చిపోతున్నారు ప్రభుత్వాలు మారిన నాయకులు మారిన మండల కేంద్ర రోడ్లు దుస్థితి మాత్రం మారడం లేదు అని మండల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు ఇకనైనా ప్రభుత్వం వెంటనే రోడ్లు వెయ్యాలని మండల కేంద్ర ప్రజలు ప్రభుత్వాన్ని కోరుతున్నారు

ఎల్లంపల్లి ప్రాజెక్టుకు భారీ వరద ప్రవాహం

ఎగువ ప్రాంతాల నుంచి కొనసాగుతున్న భారీ నీటి రాక ప్రాజెక్టు గేట్లు మూసివేత.. దిగువకు నీటి విడుదల

గోదావరిఖని ,ప్రభాతవార్త: భారీ వర్షాల ప్రభావంతో శ్రీపాద ఎల్లంపల్లి



ప్రాజెక్టుకు వరద ప్రవాహం కొనసాగుతోంది. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో ప్రాజెక్టులోకి పెద్ద ఎత్తున నీరు వచ్చి చేరుతోంది. బుధవారం సాయంత్రం 6 గంటల సమయానికి ప్రాజెక్టులోకి 75,328 క్యూసెక్కుల నీరు వచ్చి చేరినట్లు అధికారులు వెల్లడించారు.ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 148 మీటర్లు కాగా, ప్రస్తుతం నీటి మట్టం 144.22 మీటర్లకు చేరుకుంది. ప్రాజెక్టు మొత్తం నీటి నిల్వ సామర్థం 20.1754 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 11.1105 టీఎంసీల నీరు నిల్వ ఉంది. వరద ప్రవాహాన్ని అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ పరిస్థితిని సమీక్షిస్తున్నారు. ప్రాజెక్టులోకి వస్తున్న నీటిని నియంత్రిత పద్ధతిలో దిగువ ప్రాంతాలకు విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం ప్రాజెక్టు నుంచి మొత్తం 12,875 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. ఇందులో నంది పంప్‌హౌస్ ద్వారా 12,600 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. హైదరాబాద్ మెట్రో వాటర్ సప్లైకు 275 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు.ప్రస్తుతం ప్రాజెక్టులోని 62 గేట్లలో ఏ ఒక్క గేటును కూడా ఎత్తలేదు. గేట్ల ద్వారా నీటి విడుదల లేకుండానే విద్యుత్ ఉత్పత్తి, ఇతర అవసరాల మేరకు నీటి విడుదల కొనసాగుతోంది. ఎగువ ప్రాంతాల నుంచి వచ్చే వరద ప్రవాహాన్ని బట్టి భవిష్యత్‌లో నీటి విడుదలపై నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు పరివాహక ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిస్తే వరద ప్రవాహం మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. దీంతో ప్రాజెక్టు పరిసర ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. నదీ పరివాహక ప్రాంతాల్లోకి వెళ్లకుండా జాగ్రత్తలు పాటించాలని అధికారులు విజ్ఞప్తి చేస్తున్నారు.ప్రాజెక్టు నీటి నిల్వలు క్రమంగా పెరుగుతున్న నేపథ్యంలో సాగు, తాగునీటి అవసరాలకు భరోసా కలుగుతోంది. మరోవైపు వరద పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని అధికారులు ప్రాజెక్టు వద్ద ప్రత్యేక పర్యవేక్షణ కొనసాగిస్తున్నారు. ఇన్‌ఫ్లో, ఔట్‌ఫ్లో వివరాలను ఎప్పటికప్పుడు నమోదు చేస్తూ నీటి నిర్వహణ చేపడుతున్నారు.వర్షాలు కొనసాగితే ఎల్లంపల్లి ప్రాజెక్టులోకి మరింత వరద నీరు చేరే అవకాశం ఉన్నందున అధికారులు అప్రమత్తంగా ఉన్నారు. ప్రాజెక్టు భద్రత, దిగువ ప్రాంతాల రక్షణకు అవసరమైన అన్ని చర్యలు చేపడుతున్నట్లు వెల్లడించారు.

రేషన్ కార్డుదారులకు ఈ కేవైసీ తప్పనిసరి

ఈనెల 31 లోపు చేయించుకోవాలి

ప్రభాతవార్త కోనరావుపేట ఐదు సంవత్సరాల వయస్సు ఉన్న పిల్లలు మినహాయించి రేషన్ కార్డులో పేరు ఉన్న ప్రతి ఒక్కరూ ముఖ్యంగా కొత్త రేషన్ కార్డుదారులు రేషన్ కార్డులో కొత్తగా పేర్లు నమో చేసుకున్నవారు ఈ నెల 31 లోపు తప్పనిసరిగా ఈ కేవైసీ చేసుకోవాలని కోనరావుపేట రేషన్ డీలర్ల సంఘం మండల అధ్యక్షుడు మాంధాల ప్రసాద్ బుధవారం ప్రకటనలో తెలిపారుఎల్ నీ నో కారణంగా ఆగస్టు సెప్టెంబర్ అక్టోబర్ నెలలకు సంబంధించి మూడు నెలల రేషన్ బియ్యాన్ని ఒకేసారి ఇవ్వాలని ప్రభుత్వ నిర్ణయించిన విషయం తెలిసింది దీంతో ఈ కేవైసీ చేయించుకొనని వారికి మూడు నెలల బియ్యం అందని పరిస్థితి నెలకొల్పాన్నుదని పేర్కొన్నారు

అత్యధిక వర్షపాతం నమోదుప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- తహసీల్దార్ వాహిదోద్ధిన్, ఎస్సై గీత

సారంగాపూర్, ప్రభాత వార్త :



గత 24 గంటల్లో సారంగాపూర్ మండలంలో 176.3 మిల్లీమీటర్ల (మి.మీ.) అత్యధిక వర్షపాతం నమోదైంది. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా వాగులు, వంకలు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. లోతట్టు ప్రాంతాలు జలమయమవడంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ వాహిదోద్ధిన్, ఎస్సై గీత సూచించారు.అత్యవసర పరిస్థితులు మినహా ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావద్దని, వాగులు, వంకలు దాటే ప్రయత్నం చేయవద్దని హెచ్చరించారు. భారీ వర్షాల కారణంగా ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నందున చిన్నారులను వరద నీటి సమీపానికి వెళ్లనివ్వకుండా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు.రైతులు వ్యవసాయ పనులకు వెళ్లే సమయంలో అప్రమత్తంగా ఉండాలని, విద్యుత్ తీగలు తెగి కనిపిస్తే వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో పోలీసు, రెవెన్యూ అధికారులను సంప్రదించాలని తెలిపారు.మండల ప్రజలంతా అప్రమత్తంగా ఉండి అధికారుల సూచనలు పాటించి తమ ప్రాణాలు, ఆస్తులను కాపాడుకోవాలని తహసీల్దార్ వాహిదోద్ధిన్, ఎస్సై గీత విజ్ఞప్తి చేశారు.

వర్షమొస్తే నరకమే శాశ్వత వంతెనల నిర్మాణంపై హన్మాజీపేట్ వాసుల డిమాండ్

జగిత్యాల,రూరల్ ప్రభాతవార్త:



జగిత్యాల మండలం రూరల్ పరిధిలోని హన్మాజీపేట్ గ్రామం మీదుగా జగిత్యాలకు వెళ్లే మార్గాల్లో రవాణా వ్యవస్థ పూర్తిగా స్తంభించిపోయింది. మంగళవారం రాత్రి నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు కండ్ల పెళ్లి చెరువు నిండి పొంగిపొర్లుతుండటంతో,వాగు గుండా భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది.ఈ ఉధృతికి హన్మాజీపేట్ నుంచి పెర్కపల్లె,శంకులపల్లె మీదుగా వెళ్లే రెండు ప్రధాన రహదారుల్లోని లోలెవెల్ వంతెనలు నీట మునిగాయి.వరద నీరు వంతెనలపై నుంచి హోరెత్తుతూ ప్రవహిస్తుండటంతో జగిత్యాలకు వెళ్లే ప్రయాణికులు,స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.వాగు ప్రవాహం వేగంగా ఉండటంతో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రజలు,వాహనదారులు సాహసించి వంతెనలను దాటే ప్రయత్నం చేయవద్దని అధికారులు హెచ్చరించారు.వరద తగ్గుముఖం పట్టే వరకు ప్రయాణాలను వాయిదా వేసుకోవాలని సూచించారు.కాగా,ప్రతి వర్షాకాలంలో ఈ లోలెవెల్ వంతెనల వల్ల గంటల తరబడి రాకపోకలు బంద్ అయి తీవ్ర అవస్థలు పడుతున్నామని హన్మాజీపేట్ చుట్టుపక్కల గ్రామస్తులు,వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.పాలకులు అధికారులు ఇప్పటికైనా స్పందించి ఇక్కడ ఎత్తైన వంతెనలు నిర్మించి తమ సమస్యకు శాశ్వత పరిస్కారం చూపాలని కోరుతున్నారు.

సర్ ప్రక్రియలో ప్రతి ఒక్క ఓటర్ పాల్గొనాలి

బిజెపి సీనియర్ నాయకులు సారం పల్లి రాజు



బోయిన్ పల్లి మండలం ,(ప్రభాత వార్త)

సర్ ప్రక్రియ కేంద్ర ఎన్నికల సంఘం అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుందని బిజెపి సీనియర్ నాయకులు సారం పల్లి రాజు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్ ప్రక్రియ లో చిట్ట చివరి ఓటర్ వరకు కూడా అవగాహన కల్పించి సర్ ప్రక్రియలో భాగస్వామ్యం చేయాలని పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరూ సర్ ప్రక్రియలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

భారీ వర్షాలపై జిల్లా పోలీసుల అప్రమత్తత

వరద ప్రభావిత ప్రాంతాల్లో జిల్లా ఎస్పీ, అధికారుల క్షేత్రస్థాయి పరిశీలన

జగిత్యాల బ్యూరో ప్రభాత వార్త



జగిత్యాల జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇస్తూ జిల్లా పోలీసు శాఖ అప్రమత్తంగా వ్యవహరిస్తోంది. ఈ నేపథ్యంలో జిల్లా ఎస్పీ అశోక్ కుమార్, అధికారులు వరద ప్రభావిత ప్రాంతాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిస్థితిని సమీక్షించారు. అలాగే వాగులు, వంకలు, లోతట్టు ప్రాంతాలు, కల్వర్టులు, నీరు నిలిచే ప్రాంతాల్లో తీసుకోవాల్సిన చర్యలపై టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించి ఎస్పీ పోలీసు అధికారులు, సిబ్బందికి పలు కీలక ఆదేశాలు జారీ చేశారు.భారీ వర్షాల కారణంగా జిల్లాలో ఎక్కడైనా ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడితే వెంటనే స్పందించి రాకపోకలను పునరుద్ధరించాలని, ప్రమాదకర ప్రాంతాల్లో తాత్కాలిక హెచ్చరిక బోర్డులు, బారికేడ్లు ఏర్పాటు చేసి ప్రజలను అప్రమత్తం చేయాలని ఆదేశించారు. వరద నీరు ప్రవహిస్తున్న వాగులు, వంకలు, కల్వర్టులను ప్రజలు దాటకుండా ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని సూచించారు.ఉరుములు, మెరుపుల సమయంలో గ్రామస్తులు అడవి ప్రాంతాలకు వెళ్లకుండా సామాజిక మాధ్యమాల ద్వారా విస్తృతంగా అవగాహన కల్పించాలని, గోదావరి పరివాహక మండలాల్లో నదీ నీటిమట్టాన్ని ఎప్పటికప్పుడు పర్యవేక్షి స్తూ పరిస్థితులను ఉన్నతాధికారులకు నివేదించాలని ఆదేశించారు. వర్షాల సమయంలో చేపల వేట, ఈత, వరద నీటిలోకి వెళ్లడం వంటి ప్రమాదకర చర్యలకు దూరంగా ఉండేలా ప్రజల్లో అవగాహన కల్పించాలని, గతంలో వరదలతో ప్రభావితమైన ప్రాంతాలపై ప్రత్యేక నిఘా కొనసాగించాలని సూచించారు.ప్రతి పోలీసు వాహనంలో తాళ్లు, లైఫ్ జాకెట్లు, లైఫ్ బోయ్‌లు లేదా ట్యూబ్ వంటి అత్యవసర రక్షణ సామగ్రిని అందుబాటులో ఉంచాలని, విధుల్లో ఉన్న ప్రతి పోలీసు సిబ్బంది తప్పనిసరిగా రెయిన్‌కోట్లు వెంట తీసుకెళ్లాలని ఆదేశించారు.విద్యుత్ తీగలు తెగిపోవడం, విద్యుత్ స్తంభాలు దెబ్బతినడం వంటి ఘటనలు గుర్తించిన వెంటనే విద్యుత్ శాఖ అధికారులకు సమాచారం అందించి తక్షణ చర్యలు తీసుకునేలా సమన్వయం చేయాలని సూచించారు. మూసుకుపోయిన డ్రైనేజీలను రెవెన్యూ శాఖతో సమన్వయం చేసుకొని జేసీబీల సహాయంతో వెంటనే శుభ్రం చేయించి వర్షపు నీరు సాఫీగా వెళ్లేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

బీర్‌పూర్‌లో వృత్యంతర శిక్షణ

ఎఫ్ఎల్ఎన్ బోధనోపకరణాల ప్రదర్శన

బీర్ పూర్ ప్రభాత వార్త.జగిత్యాల జిల్లా బీర్‌పూర్ మండల కేంద్రంలోనీ జెడ్పీహెచ్ఎస్ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి సమగ్ర వృత్యంతర శిక్షణ కార్యక్రమాన్ని రెండు దశల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు రూపొందించిన ఎఫ్ఎల్ఎన్ బోధనోపకరణాల , టి ఎల్ ఏం ప్రదర్శనను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మండల విద్యాధికారి సిరూప నాగభూషణం మాట్లాడుతూ.. శిక్షణలో నేర్చుకున్న అంశాలను ఉపాధ్యాయులు తరగతి గదిలో అమలు చేస్తూ విద్యార్థులకు సులభ శైలిలో బోధించాలని సూచించారు. ముఖ్యంగా వెనుకబడిన విద్యార్థులకు (స్లో లర్నర్స్) రెమెడియల్ టీచింగ్ నిర్వహించాలని, తక్కువ ఖర్చుతో (లో కాస్ట్ నో కాస్ట్) తయారుచేసిన బోధనోపకరణాలతో నాణ్యమైన విద్యను అందించాలని కోరారు.తెలుగు సబ్జెక్ట్ డిఆర్‌పి, మండల రిసోర్స్ పర్సన్ జూపాక సుదర్శన్ మాట్లాడుతూ.. విద్యార్థులకు మొదట బేస్‌లైన్ టెస్ట్ నిర్వహించి, అసెస్మెంట్ ద్వారా వారిని విభజించి చదవడం, రాయడం వంటి కనీస సామర్థ్యాలు సాధించేలా మాడాలన్నారు. ఆగస్టు నుండి డిసెంబర్ వరకు 56 రోజుల ప్రణాళికతో ధారాళంగా చదవడం, అర్థం చేసుకుని రాయడం, స్వీయ రచన నైపుణ్యాలను పెంపొందించాలని వివరించారు. ఎఫ్ఎల్ఎన్‌లో భాగంగా వర్ణమాల, గుణింతాలు, ద్విత్వాక్షర, సంయుక్తాక్షర పదాలు, ఫ్లాష్ కార్డ్స్, డామినో కార్డులు, పేపర్ ఫ్లవర్స్ నమూనాలు, బహుళ తరగతి బోధన టిఎల్ఎమ్ బాక్స్‌లు మరియు ఇన్నోవేటివ్ క్యాప్‌లతో కూడిన ఆకర్షణీయమైన బోధనోపకరణాలను ఉపాధ్యాయులు ప్రదర్శించారు.కాంప్లెక్స్ హెచ్ఎం చెరుకు శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రతి ఉపాధ్యాయుడు బోధనా నైపుణ్యాలను మెరుగుపరుచుకుని నాణ్యమైన విద్యను అందించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల రిసోర్స్ పర్సన్లు భోగ నాగరాణి (ఆంగ్లం), కిరణ్ (జనరల్), సమీర్ (గణితం) లతో పాటు మండలంలోని పలు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



ఓటర్ జాబితాతో సంక్షేమ పథకాలకు సంబంధం లేదు.

.డిజిటలైజేషన్ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలి

రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి



జగిత్యాల బ్యూరో ప్రభాత వార్త ఎస్.ఐ.ఆర్. (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) కార్యక్రమంలో ముసాయిదా ఓటరు జాబితా ప్రచురణకు మరికొద్ది రోజులే మిగిలి ఉన్నందున ఓటర్ల వివరాల డిజిటలైజేషన్ ప్రక్రియను వేగవంతం చేయడంతో పాటు బీఎల్‌వోలు నమోదు చేసిన వివరాల్లో ఉన్న లోపాలను వెంటనే సరిదిద్దాలని తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి జిల్లా ఎన్నికల అధికారులను ఆదేశించారు.బుధవారం హైదరాబాద్ నుంచి ఎస్.ఐ.ఆర్ కార్యక్రమం పురోగతి, ఓటర్ల వివరాల డిజిటలైజేషన్, డేటా నమోదు, పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ తదితర అంశాలపై జిల్లా ఎన్నికల అధికారులతో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సమీకృత జిల్లా కలెక్టరేట్ (ఐ.డీ.ఓ.సీ) జగిత్యాల నుంచి జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి బి. సత్య ప్రసాద్ ఈ వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్నారు.ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి మాట్లాడుతూ, ఎస్.ఐ.ఆర్. ముసాయిదా ఓటరు జాబితా ప్రచురణకు కేవలం నాలుగు నుంచి ఐదు రోజుల సమయం మాత్రమే మిగిలి ఉందన్నారు. ఓటర్ల నుంచి సేకరించిన అన్ని ఎన్యూమరేషన్ ఫారాలను వెంటనే డిజిటలైజ్ చేయాలని ఆదేశించారు.బీ.ఎల్.వో.లు వెబ్‌సైట్ లో ఓటర్ల వివరాలు నమోదు చేసే సమయంలో అనేక పొరపాట్లు జరిగినట్లు గుర్తించామని, వాటి కారణంగా అర్హులైన ఓటర్ల పేర్లు జాబితా నుంచి తొలగిపోతున్నాయనే ఫిర్యాదులు పెద్ద ఎత్తున అందుతున్నాయని తెలిపారు. బీ.ఎల్.వో.లు నమోదు చేసిన ప్రతి వివరాన్ని ఈ.ఆర్.వో.లు, సూపర్‌వైజర్లు తప్పనిసరిగా క్రాస్ వెరిఫై చేయాలని, యాదృచ్ఛికంగా ఓటర్ల వివరాలను పరిశీలించి అన్ని లోపాలను మరో రెండు రోజుల్లోగా సరిదిద్దాలని ఆదేశించారు. అనంతరం తప్పిదాలు గుర్తిస్తే సంబంధిత బీ.ఎల్.వో.లు, సూపర్‌వైజర్ల పై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.పట్టణ ప్రాంతాల్లో డిజిటలైజేషన్ ప్రక్రియ ఇంకా పెండింగ్‌లో ఉందని, సూపర్‌వైజర్లు బీ.ఎల్.వో.లతో నిరంతరం సమన్వయం చేసుకొని పనులను వేగవంతం చేయాలని సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు 8 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 100 శాతం డిజిటలైజేషన్ పూర్తికాగా, 80 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 90 శాతానికి పైగా డిజిటలైజేషన్ పూర్తయిందన్నారు. భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ (రేషనలైజేషన్) ప్రక్రియను కూడా సమాంతరంగా పూర్తి చేయాలని సూచించారు.ఎస్.ఐ.ఆర్ ప్రక్రియ వల్ల ప్రభుత్వ సంక్షేమ పథకాల పై ప్రభావం ఉంటుందనే తప్పుడు ప్రచారం జరుగుతోందని, ఓటరు జాబితాకు సంక్షేమ పథకాలతో ఎలాంటి సంబంధం లేదని ప్రజలకు స్పష్టంగా తెలియజేయాలని జిల్లా ఎన్నికల అధికారులను ఆదేశించారు. ఈ తప్పుడు ప్రచారాన్ని వెంటనే ఖండించాలని, బీ.ఎల్ వో.లతో తరచూ సమావేశాలు నిర్వహిస్తూ ఎస్.ఐ.ఆర్. పురోగతిని సమీక్షి ంచాలని సూచించారు. అలాగే అన్ని స్థాయిల్లో రాజకీయ పార్టీలతో సమావేశాలు నిర్వహించి ఎస్.ఐ ఆర్. పురోగతిని వివరించాలని తెలిపారు.పోలింగ్ స్టేషన్ ల వారీగా ముసాయిదా ఓటరు జాబితాను బూత్ లెవల్ ఏజెంట్లకు (బీ.ఎల్.ఏ) అందజేసి, వారి సంతకాలను తప్పనిసరిగా తీసుకోవాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ఆదేశించారు. జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ మాట్లాడుతూ, జగిత్యాల జిల్లాలో ఇప్పటివరకు 88.43 శాతం డిజిటలైజేషన్ పూర్తయిందన్నారు. కోరుట్ల అసెంబ్లీ నియోజకవర్గంలో 87.74 శాతం, జగిత్యాల అసెంబ్లీ నియోజకవర్గంలో 85.63 శాతం, ధర్మపురి అసెంబ్లీ నియోజకవర్గంలో 92.06 శాతం డిజిటలైజేషన్ పూర్తయిందని వివరించారు.భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ ప్రక్రియను పూర్తి చేస్తామని, బీ.ఎల్.వో.లు నమోదు చేసిన వివరాలను క్షుణ్ణంగా క్రాస్ వెరిఫై చేసి లోపాలను వెంటనే సరిదిద్దుతామని కలెక్టర్ తెలిపారు. రాజకీయ పార్టీలతో నిరంతరం సమావేశాలు నిర్వహిస్తూ సమావేశాల మినిట్స్ ను క్రమం తప్పకుండా నమోదు చేస్తున్నామని వివరించారు.ఈ సమావేశంలో రెవెన్యూ డివిజనల్ అధికారులు మధుసూదన్, నరసింహారావు, జీవాకర్ రెడ్డి, జగిత్యాల మున్సిపల్ కమిషనర్ లు, తహసీల్దార్ లు, కలెక్టరేట్ ఏవో కిషన్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

బీర్‌పూర్ ఎస్. ఐ.సబ్బాని రాజు ప్రకటన

బీర్ పూర్ ప్రభాత వార్త



జగిత్యాల జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున బీర్ పూర్ మండల ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని బీర్‌పూర్ పోలీస్ స్టేషన్ అధికారులు ఎస్ ఐ రాజు తెలిపారు. వర్షాకాలంలో ప్రమాదాల బారిన పడకుండా ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. మీ భద్రత – మా ప్రాధాన్యత అని స్పష్టం చేస్తూ స్థానిక పోలీసులు ప్రత్యేక హెచ్చరికలు మరియు సూచనలను విడుదల చేశారు.లోతట్టు ప్రాంతాలు, వాగులు, చెరువులు మరియు కాల్వల దగ్గరకు ఎవరూ వెళ్లకూడదని పోలీసులు స్పష్టం చేశారు. వర్షం కురుస్తున్న సమయంలో అనవసరంగా రోడ్లపైకి రావడం గానీ, ప్రయాణాలు చేయడం గానీ చేయవద్దని కోరారు. వర్షం పడేటప్పుడు చెట్లు, విద్యుత్ స్తంభాలు, పాత గోడల దగ్గర నిలబడకూడదని, తడి చేతులతో విద్యుత్ ఉపకరణాలు మరియు స్విచ్‌లను తాకవద్దని హెచ్చరించారు. వాతావరణ సమగ్ర సమాచారం మరియు హెచ్చరికల కోసం కేవలం రేడియో, టీవీ లేదా ప్రభుత్వ, పోలీస్ అధికారిక ప్రకటనలను మాత్రమే అనుసరించాలని సూచించారు. అత్యవసర పరిస్థితి ఉంటే తప్ప ఇళ్ల నుంచి బయటకు రావద్దని విజ్ఞప్తి చేశారు.ఏదైనా ప్రమాదం లేదా అత్యవసర పరిస్థితి ఎదురైతే వెంటనే పోలీసులను సంప్రదించడానికి 100 లేదా 112 నెంబర్లకు కాల్ చేయాలని బీర్‌పూర్ పోలీసులు తెలిపారు. జాగ్రత్తలు పాటిద్దాం ప్రాణాలను కాపాడుకుందాం, కలిసి ఉండి కష్టాన్ని జయిద్దాం అని పిలుపునిచ్చారు.

చదువునే ఆయుధంగా మలుచుకొని ఉన్నత స్థితికి ఎదగాలి

జిల్లా అదనపు కలెక్టర్ రాజా గౌడ్

జగిత్యాల, బ్యూరో ప్రభాత వార్త:



చదువునే ఆయుధంగా మలుచుకుని విద్యార్థులు ఉన్నత స్థితికి ఎదగాలని జిల్లా అదనపు కలెక్టర్ రాజా గౌడ్ అన్నారు. మహిళ శిశు సంక్షేమ శాఖ జిల్లా బాలల పరిరక్షణ విభాగం ఆధ్వర్యంలో జిల్లా బాలల సంరక్షణ కేంద్రాల తనిఖీ కమిటీ చైర్మన్, అదనపు కలెక్టర్ బి. రాజాగౌడ్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని వాల్మీకి ఆవాసాన్ని బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా స్వచ్ఛంద సంస్థ అయిన వాల్మీకి ఆవాసంసేవాభారతి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆవాసంలో చదువుతున్న విద్యార్థుల విద్య, ఆరోగ్యము, నైపుణ్యాభివృద్ధి సేవలు కేంద్రాల నిర్వహణకు సంబంధించి రికార్డులను స్థితిగతులను క్షుణ్ణంగా పరిశీలించారు. ఆవాసంలో చదువుతున్న విద్యార్థుల బాగోగులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సంరక్షణ కేంద్రాలు పిల్లలకు ఇంటి వాతావరణాన్ని కల్పించే విధంగా ఉండాలని సూచించారు. సంరక్షణ కేంద్రాలే పిల్లలకు కుటుంబాలుగా ఉండటం వల్ల పిల్లలు సమగ్రంగా అభివృద్ధి చెందే అవకాశం ఉంటుందన్నారు. పిల్లలు సమగ్ర జీవిత అభివృద్ధికి ఇప్పటినుంచి ఒక లక్ష్యం ఏర్పరచుకోవాలని ఆ లక్ష్యం దిశగా అంకితభావంతో ఎటువంటి ఆకర్షణలకు లోను కాకుండా విద్యను అభ్యసించాలన్నారు. పిల్లలు వారి కుటుంబం ప్రస్తుతం ఉన్న స్థితి నుంచి ఉత్తమ స్థితికి చేరుకోవడానికి చదువే ఆయుధమని చదవునే గమ్యంగా మార్చుకోవాలన్నారు. విద్యార్థి దశలో ఆరోగ్యము, విద్య ప్రధానమైనవని విద్యార్థి ఆలోచన చర్యలు వాటి చుట్టూనే ఉంటే ఉత్తమ స్థితికి చేరుకుంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి డాక్టర్ ఏ భాస్కర్, బాలల సంరక్షణ కేంద్రాల తనిఖీ సభ్యులు, జిల్లా బాలల పరిరక్షణ అధికారి పడాల సురేష్, బాలల సంక్షేమ సమితి సభ్యులు విజయలక్ష్మి, పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ కోటగిరి భీమేష్ , ఎన్జీవో సభ్యులు సిరిసిల్ల శ్రీనివాస్ ,వాల్మీకి ఆవాసం కార్యదర్శి మదన్ మోహన్ రావు, సహ కోశాధికారి ఎలుగందుల కైలాసం,ఆవాస ప్రముక్ మల్లేశం, సంరక్షణ కేంద్రాల అధికారి కరుణశ్రీ సంరక్షణ కేంద్రాల సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా గురు పౌర్ణమి వేడుకలు

విజయ గణపతి సాయిరామ్ దేవాలయంలో ప్రత్యేక పూజలు



పెగడపల్లి, ప్రభాతవార్త: గురు పౌర్ణమి సందర్భంగా పెగడపల్లి మండలం రామ్ బద్రుని పల్లి విజయ గణపతి సాయిరామ్ దేవాలయంలో బుధవారం ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఓరుగంటి రమణారావు మాధవి దంపతులు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. అనంతరం సాయిబాబా ఆశీస్సులతో రాష్ట్ర ప్రజలంతా సుఖశాంతులు, ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రార్థించారు.ఈ కార్యక్రమంలో మండల బీఆర్ఎస్ పార్టీ నాయకులు లోక మల్లారెడ్డి, ఉప్పుగండ్ల నరేందర్ రెడ్డి, కోరు కంటి రాజేశ్వరరావు, తీర్మాని నరసింహారెడ్డి, వెల్మ సత్యనారాయణ రెడ్డి, నాగుల రాజశేఖర్ గౌడ్, కార్యకర్తలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తాం

చందుర్తి మండలం సర్వసభ్య సమావేశంలో

మార్కెట్ కమిటీ చైర్మన్ తిరుపతి

చందుర్తి / ప్రభాతవార్త

సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేక కృషి చేస్తామని రుద్రంగి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చేలుకల తిరుపతి అన్నారు. బుధవారం చందుర్తి మండల పరిషత్ లో ప్రత్యేక సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు. మండల ప్రజల సమస్యల పరిష్కారం కోసం చిత్తశుద్ధితో పనిచేస్తామన్నారు . ఈ సమావేశానికి మండల ప్రత్యేక అధికారి రవీందర్ రెడ్డి అధ్యక్షతన వహించారు. సందర్భంగా రవీందర్ రెడ్డి మాట్లాడుతూ అధికారులు ప్రజాప్రతినిధులతో కలిసి సమన్వయంతో పనిచేయాలని అన్నారు. అధికారులు అభివృద్ధి పనులపై నివేదికలను చదివి వినిపించారు. మిషన్ భగీరథ అధికారులు తమ నివేదికను చదివి వినిపిస్తుండగా ఆశిరెడ్డిపల్లి సర్పంచ్ బొజ్జ మల్లేశం మాట్లాడుతూ తమ గ్రామానికి మిషన్ భగీరథ నీరు రావడం లేదని నీళ్ల వచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు . జోగాపూర్ సర్పంచ్ మాట్లాడుతూ గ్రామంలోని 25 కుటుంబాలకు మిషన్ భగీరథ నల్ల కలెక్షన్లు ఇవ్వలేదని.నల్ల కలెక్షన్లు ఇవ్వాలని కోరారు. ఈ విషయమై మండల ప్రత్యేక అధికారి రవీందర్ రెడ్డి మాట్లాడుతూ వెంటనే మిషన్ భగీరథ నీళ్ల అందేలా చర్యలు చేపట్టాలని సూచించారు. బండపల్లి సర్పంచ్ కటకం మల్లేశం మాట్లాడుతూ గ్రామాల్లో నూతన వితంతు, వృద్ధప్య పెన్షన్లు రావడం లేదన్నారు. పాఠశాలల్లో విద్యార్థులకు స్కూల్ యూనిఫామ్ అందజేయాలన్నారు. ఆశిరెడ్డిపల్లి సర్పంచ్ బొజ్జ మల్లేశం మాట్లాడుతూ ఆసుపత్రిలో వైద్య సిబ్బంది నిరక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, తన కూతురు కుక్క కాటుకు గురికాగా ఆస్పత్రికి వెళ్ళగా సిబ్బంది పట్టించుకోలేదు అన్నారు. తను ఆశి రెడ్డి పల్లి సర్పంచిగా అని చెప్పగానే అప్పుడు వైద్య సిబ్బంది వైద్యం చేయడం ప్రారంభించారన్నారు. ప్రజా ప్రతినిధులు అయితే వైద్యం అందిస్తారు కానీ సామాన్య జనానికి వైద్యం అందించరా అని అన్నారు.ఇకముందు ఇలాంటి సంఘటనలు జరగకుండా చూడాలని వైద్యాధికారిని కోరారు. విద్యుత్ శాఖ అధికారులు మాట్లాడుతుండగా విద్యుత్ వైర్ల కింద మొక్కలు నాటకుండా, సర్పంచులతో కోఆర్డినేషన్ తో పనిచేయాలని పలువురు సర్పంచులు కోరారు. సింగిల్ విండో చైర్మన్ తిప్పని శ్రీనివాస్ మాట్లాడుతూ రైతు పాస్ బుక్కులో, బ్యాంకులో ఖాతాల్లో ఆధార్ నెంబరు సక్రమంగా అనుసంధానం కాకా లక్ష లోపు రుణం ఉన్న రైతులకు ఇప్పటి వరకు రుణం మాపి కాలేదు అన్నారు. రైతులకు రుణమాఫీ అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. కల్యాణ లక్ష్మి కోసం దరఖాస్తు గెజిటెడ్ సంతకాల కోసం ఇబ్బందులు పడుతున్నారన్నారు. గెజిటెడ్ సంతకాలు లేకుండా కల్యాణ లక్ష్మి దరఖాస్తులను స్వీకరించాలని



తాసిల్దారును కోరారు. . ఈ కార్యక్రమంలో తాసిల్దార్ భూపతి, ఎంపీడీవో రాధ, జిల్లా పంచాయతీ అధికారిని జయశీల, ఆత్మ కమిటీ చైర్మన్ ముస్కు ముకుంద రెడ్డి, ఎంపీఓ రాజేశ్వర్, మండల వ్యవసాయ శాఖ అధికారి దుర్గరాజు, ఏపిఎం కళ్యాణి, ఏపీవో రాజయ్య, ఐసిడిఎస్ సూపర్వైజర్ శంకరమ్మ సర్పంచులు,వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



మూలవాగు పరవళ్లు

రైతు కళ్ళలో ఆనందం



కోనరావుపేటరూరల్, ప్రభాతవార్త:మండలంలోని గ్రామాల్లో మంగళవారం నుంచి కురుస్తున్న వర్షానికి మూలవాగు పరవళ్లు తొక్కుతోంది. మంగళవారం నుంచి కొండాపూర్ శివారులోని పెంటివాగు ప్రవాహం అందుకుని మూలవాగులో కలవడంతో, మూలవాగు జలకళను సంతరించుకుంటోంది. ఈ సీజన్లో ఆశించినంతగా వర్షాలు కురవకపోవడంతో రైతుల్లో ఆందోళన నెలకొంది.పంటల సాగు చేయకుండా వదిలిపెట్టరు.దీంతో రెండు రోజులుగా వరుసగా కురుస్తున్న వర్షాలతో రైతుల్లో తిరిగి ఆశలు చిగురించాయి. వర్షం కురుస్తున్నప్పటికీ వరి పంట సాగు చేసేందుకు వ్యవసాయ పనులు రైతులు నిమగ్నమయ్యారు. దీంతో వర్షం కురుస్తున్న సందర్భంగా ఆయా గ్రామాల రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

స్పీడ్ బ్రేకర్లు, హెచ్చరిక బోర్డులు, బ్లింకర్ లైట్లు ఏర్పాటు చేయాలి

ఆర్ అండ్ బీ అధికారులకు ఉపసర్పంచ్‌కు వినతి



కోనరావుపేటరూరల్, ప్రభాతవార్త: రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలని ఆర్ అండ్ బి అధికారులను ఉపసర్పంచ్ గంగారం సంపత్ కోరారు. బుధవారం కొనరోపేట మండలం వట్టిమల్ల ఉప సర్పంచ్ గంగారం సంపత్ ఆర్ అండ్ బి అధికారులను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..వట్టిమల్ల గ్రామ ప్రధాన రహదారి, సనుగుల ఎక్స్ రోడ్..జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సమీప ప్రాంతంలో తరచూ ప్రమాదాలు జరుగుతున్నారు. ప్రజల ప్రాణ భద్రత కోసం వెంటనే రోడ్డు భద్రతా చర్యలు చేపట్టాలని, గ్రామ ప్రజల ప్రాణాలకు భద్రత ఏర్పాటు చేయాలన్నారు.గ్రామంలోని ప్రధాన కూడలిలో తగినంత వీధి లైటింగ్, హెచ్చరిక బోర్డులు, వేగ నియంత్రణ చర్యలు లేకపోవడంతో వాహనాలు అధిక వేగంతో దూసుకెళ్తున్నాయని, రాత్రి వేళల్లో ప్రమాదాలు పెరుగుతున్నాయన్నారు. ప్రధాన రహదారికి ఆనుకుని ఉన్న జడ్పీహెచ్ఎస్ వట్టిమల్ల పాఠశాల వద్ద ప్రతిరోజూ విద్యార్థులు రహదారిని దాటుతున్నప్పటికీ స్పీడ్ బ్రేకర్లు లేకపోవడం వల్ల వారి ప్రాణాలకు తీవ్ర ముప్పు ఏర్పడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు.వర్ష కాలం ప్రభావంతో ప్రాణ నష్టం జరగకముందే అవసరమైన రోడ్డు భద్రతా చర్యలు చేపట్టాలన్నారు.ప్రమాదం జరిగిన తర్వాత స్పందించడం కంటే ప్రమాదం జరగకుండా ముందే చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.అయన వెంట ఒకటవ వార్డు మెంబర్ మాధవి సాయికుమార్ ఉన్నారు.

చినుకు కురిసింది.. నీరు నిలిచింది

ఇళ్ల మధ్యలో నిలిచిన వర్షపు నీరు

నిలిచిన నీరుతో కాలనీవాసుల అవస్థలు

పట్టించుకోని పాలకవర్గం

కోనరావుపేటరూరల్, ప్రభాతవార్త:



చినుకు పడితేనే రోడ్లన్నీ చిత్తడిగా మారుతుంటే, చిన్నపాటి వర్షానికి ఇండ్ల మధ్యలో వర్షపు నీరు నిలిచి కాలనీవాసులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్షపు నీరు సమస్యను పరిష్కరించాలని పలుమార్లు పాలకవర్గానికి విన్నవించుకున్న పట్టించుకుంటలేరని కాలనీవాసులు ఆరోపిస్తున్నారు కోనరావుపేట మండలం నిజామాబాద్ గ్రామంలోని ఒకటవ కాలనీలో వర్షపు నీరు నిలిచి రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. చిన్నపాటి వర్షానికే ఇళ్ల మధ్యలో నీళ్లు నిలిచి కుంటల మారిందని, ఆ నీరు నిల్వతో ఈగల, దోమలకు నిలయముగా మారిందని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నీరుతో డెంగ్యూ, జ్వరం లాంటి వ్యాధులు ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాలనీ నుండి ఇతర ప్రాంతాలకు వెళ్లేందుకు ఆ వర్షం నీళ్ల నుంచే వెళ్లే పరిస్థితి నెలకొందని, వర్షపు నీరు నిల్వకుండా ఉండెలా పాలకవర్గం చర్యలు తీసుకోని, రోగాల బారిన పడకుండా కాపాడాలని కోరుతున్నారు .

కేవైసీ పూర్తికాకపోతే రేషన్ బంద్ !

-గడువు మరో రెండు రోజులే...
-ఉచితంగానే 'ఈకేవైసీ' నమోదు

పెద్దపల్లి, ప్రభాతవార్త:



తెలంగాణలోని రేషన్ కార్డుదారులకు పౌరసరఫరాల శాఖ కీలక హెచ్చరిక జారీ చేసింది. ఉచిత బియ్యం, నిత్యావసర సరుకులు పొందుతున్న లబ్ధిదారులంతా తప్పనిసరిగా 'ఈకేవైసీ' ప్రక్రియను పూర్తి చేయాలని స్పష్టం చేసింది. ఈ ధృవీకరణను పూర్తి చేయడానికి ప్రభుత్వం జులై 31వ తేదీ వరకు మాత్రమే గడువు ఇచ్చింది. అంటే కేవలం మూడు రోజుల సమయం మాత్రమే మిగిలి ఉంది. గడువులోగా కేవైసీ పూర్తి చేయని వారి కార్డులను ఇనాక్టివ్ చేయడంతో పాటు సరుకుల సరఫరాను నిలిపివేయనున్నట్లు అధికారులు స్పష్టం చేశారు. అయితే ఈ ప్రక్రియ కోసం లబ్ధిదారులు తమ సొంత ఊర్లకు వెళ్లాల్సిన అవసరం లేదని, రాష్ట్రంలో ఎక్కడ ఉన్నా సమీపంలోని ఏ రేషన్ షాపునైనా లేదా మీసేవా కేంద్రాన్ని అయినా సంప్రదించవచ్చని తెలిపారు. రేషన్ కార్డులో పేరు నమోదై ఉన్న ఎనిమిదేళ్ల



పైబడిన ప్రతి ఒక్కరూ తమ ఒరిజినల్ ఆధార్ కార్డుతో వెళ్తే బయోమెట్రిక్ లేదా ఐరిస్ స్కానింగ్ ద్వారా పూర్తి ఉచితంగానే ఈ నమోదు పూర్తి చేస్తారు.మరోవైపు రాష్ట్రంలోని దాదాపు 1.05 కోట్ల కుటుంబాలకు ఆగస్టు నెల నుంచి సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఫొటోలు, ఆధునిక క్యూఆర్ కోడ్‌తో రూపొందించిన కొత్త 'స్మార్ట్ రేషన్ కార్డులు' అందజేయడానికి ప్రభుత్వం సన్నాహాలు వేగవంతం చేసింది. ఇప్పటికే వీటి ప్రింటింగ్ పూర్తయి అన్ని జిల్లాలకు చేరుకున్నాయి. ఆగస్టు 1 లేదా 15వ తేదీ నుంచి వీటిని పంపిణీ చేయనున్నట్లు ప్రకటించారు. అయితే, జులై 31 లోగా ఈకేవైసీ పూర్తి చేసుకోని వారికి ఈ కొత్త స్మార్ట్ కార్డులు అందవని ప్రభుత్వం స్పష్టం చేసింది. రాష్ట్రవ్యాప్తంగా ఇంకా దాదాపు 5 లక్షల మంది లబ్ధిదారులు ఈకేవైసీ పూర్తి చేయాల్సి ఉన్నందున, రేషన్ షాపుల వద్ద ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేసి 100 శాతం లక్ష్యాన్ని సాధించాలని అధికారులను యంత్రాంగం ఆదేశించింది. ఉచిత రేషన్ సరుకులతో పాటు కొత్త స్మార్ట్ కార్డును కోల్పోకుండా ఉండాలంటే చివరి నిమిషం వరకు ఆగకుండా వెంటనే సమీప కేంద్రానికి వెళ్లి ఈకేవైసీ పూర్తి చేసుకోవాలని పౌరసరఫరాల శాఖ లబ్ధిదారులకు సూచించింది.

వర్షానికి మునిగిన సింగరేణి క్వార్టర్లు!!

ఉదయ్‌నగర్‌లో ఇళ్లలోకి చేరిన వరద నీరు!!
డ్రైనేజీ వైఫల్యంతో రాత్రంతా బిక్కుబిక్కుమన్న కార్మిక కుటుంబాలు!!
ఏడాది పొడవునా మురుగు నీటి సమస్యతో నరకయాతన!!
శాశ్వత డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు చేయాలని యాజమాన్యానికి విజ్ఞప్తి

గోదావరిఖని, ప్రభాతవార్త: .....సింగరేణి ఆర్జీ1 ఏరియాలోని ఉదయ్‌నగర్ సింగరేణి క్వార్టర్లలో డ్రైనేజీ సమస్య మరోసారి కార్మిక కుటుంబాలను కలవరపెట్టింది. బుధవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి 351 నుంచి 381 నంబర్ల క్వార్టర్లలోకి వరద నీరు చేరి ఇళ్లు జలమయమయ్యాయి. ఇంట్లోని హాలు, బెడ్‌రూమ్, వంటగది వరకు నీరు చేరడంతో కుటుంబాలు రాత్రంతా నిద్రలేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నాయి.డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేకపోవడంతో వర్షపు నీరు బయటకు వెళ్లకుండా క్వార్టర్లలోనే నిలిచిపోయిందని కాలనీవాసులు తెలిపారు. ఇంటి సామగ్రి తడిసిపోవడంతో పాటు చిన్నారులు, మహిళలు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి వర్షానికి ఇదే పరిస్థితి ఎదురవుతున్నా సమస్యకు శాశ్వత పరిష్కారం లభించడం లేదని వాపోయారు.వర్షాకాలంలోనే కాకుండా ఏడాది పొడవునా డ్రైనేజీ సమస్య వెంటాడుతోందని కార్మికులు తెలిపారు. మురుగు నీరు నిల్వ ఉండటంతో దుర్వాసన వెదజల్లడంతో పాటు దోమలు అధికమై అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని చెప్పారు. గనుల్లో విధులు ముగించుకుని ఇంటికి చేరుకున్న తర్వాత కూడా ప్రశాంతంగా ఉండే పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేశారు.ఈ సమస్యను పలుమార్లు సింగరేణి సివిల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లామని, యాజమాన్యానికి వినతిపత్రాలు కూడా సమర్పించామని కాలనీవాసులు తెలిపారు. సామూహికంగా అధికారులను కలిసి సమస్య వివరించినప్పటికీ, తాత్కాలిక చర్యలకు మించి శాశ్వత పరిష్కారం కోసం ఇప్పటివరకు ఎలాంటి చర్యలు చేపట్టలేదని ఆరోపించారు.వర్షాకాలం ప్రారంభంలోనే పరిస్థితి ఇంత దారుణంగా ఉంటే, రానున్న రోజుల్లో భారీ వర్షాలు కురిస్తే పరిస్థితి మరింత విషమించే ప్రమాదం ఉందని కార్మిక కుటుంబాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. డ్రైనేజీ వ్యవస్థను పూర్తిగా పునర్నిర్మించి, అవసరమైన చోట్ల పెద్ద పైప్‌లైన్లు ఏర్పాటు చేసి వర్షపు నీరు నిల్వ లేకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. తాత్కాలిక మరమ్మతులతో కాలం గడపకుండా శాశ్వత పరిష్కారం చూపి కార్మిక కుటుంబాలకు ఇబ్బందులు తొలగించాలని సింగరేణి యాజమాన్యాన్ని విజ్ఞప్తి చేస్తున్నారు.

పట్టణ ప్రజల ప్రమాదంగా ఉండాలి

జగిత్యాల బ్యూరో ప్రభాత వార్త:

భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలలో భాగంగా జగిత్యాల మున్సిపాలిటీ ఆధ్వర్యంలో 24బై 7 మాన్సూన్ హెల్ప్ డెస్క్ ఏర్పాటు శేషమని మున్సిపల్ కమిషనర్ సత్య ప్రణవ్ పేర్కొన్నారుఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ పటంలో వర్షాలు కారణంగా ఎ లాంటి సమస్యలు ఎదురైనాహెల్ప్ డెస్క్ నంబర్ 7330653331 కు ఫోన్ చేయాలన్నారువర్షాల కారణంగా కింది సమస్యలు తలెత్తినట్లయితే ప్రజలు వెంటనే మున్సిపాలిటీ హెల్ప్ డెస్క్‌ను సంప్రదించి ఫిర్యాదు నమోదు చేయగలరు. డ్రైనేజీలు పొంగిపొర్లడం, కాలువలు, చెరువులు, వాగులు ప్రమాదకర స్థాయిలో ప్రవహించడం వల్ల రాకపోకలకు అంతరాయం కలగడం.రోడ్లపై వర్షపు నీరు నిల్వ ఉండటం లేదా భారీ గుంతలు ఏర్పడటం.చెట్లు విరిగి పడటం ప్రమాదకర స్థితిలో ఉన్న భవనాలు లేదా గోడలు కూలే అవకాశం ఉన్నట్లు గుర్తించడం.. పారిశుధ్యానికి సంబంధించిన సమస్యలు.విద్యుత్ సంబంధిత సమస్యలు... ఇతర అత్యవసర మున్సిపల్ సేవలకు సంబంధించిన ఫిర్యాదులు.ప్రజలు 24 గంటల పాటు 7330653331 నంబర్‌కు సంప్రదించి తమ ఫిర్యాదులను నమోదు చేసుకోవచ్చు. అందిన ఫిర్యాదులపై సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి అవసరమైన చర్యలు చేపడతారు.వర్షాల సమయంలో ప్రజలు అవసరం లేకుండా నీరు నిల్వ ఉన్న ప్రాంతాలకు వెళ్లరాదు. కాలువలు, చెరువులు, వాగులు, కల్వర్టుల సమీపంలో అత్యంత అప్రమత్తంగా ఉండాలి. విద్యుత్ తీగలు తెగి పడినట్లయితే వాటికి దూరంగా ఉండి వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం అందించాలి.ప్రజల సహకారంతో వర్షాకాలంలో ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా ప్రతి ఒక్కరూ ముందస్తు జాగ్రత్తలు పాటించాలని పేర్కొన్నారు

జగిత్యాల ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్‌ని మర్యాదపూర్వకంగా కలిసిన ఎస్ ఐగా పదోన్నతి పొందిన వెంకటేశ్వర్లు

జగిత్యాల బ్యూరో ప్రభాత వార్త:



జగిత్యాల టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఏఎస్ఐగా విధులు నిర్వహించిన వెంకటేశ్వర్లు ఎస్ఐగా పదోన్నతి పొంది జగిత్యాల ఎమ్మెల్యే డా.సంజయ్ కుమార్ ని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు.దీంతో ఎస్ ఐ వెంకటేశ్వర్లుకు శుభాకాంక్షలు తెలిపిన జగిత్యాల ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్

భారీ వర్షాల కారణంగా ఎమ్మెల్యే సంజయ్ కుమార్ ప్రజలకు పలు సూచనలు

జగిత్యాల బ్యూరో ప్రభాత వార్త:

భారీ వర్షాల నేపథ్యంలో జగిత్యాల నియోజకవర్గ ప్రజలకు బుధవారం జగిత్యాల ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్ సూచనలు చేశారు వాగులు, వంకలు, చెరువులు, కాలువలు ఉప్పొంగి ప్రవహిస్తున్న ప్రాంతాల్లోకి వెళ్లే ప్రయత్నం చేయవద్దు.విద్యుత్ స్తంభాలు, తెగిపోయిన విద్యుత్ తీగల దగ్గరకు వెళ్లకుండా వెంటనే విద్యుత్ అధికారులకు సమాచారం ఇవ్వాలి.వర్షం కారణంగా శిథిలావస్థలో ఉన్న గోడలు, పాత భవనాలకు దూరంగా ఉండాలి.పిల్లలను ఒంటరిగా బయటకు పంపకుండా తల్లిదండ్రులు జాగ్రత్త వహించాలి. రైతులు ఉరుములు, మెరుపులు ఉన్న సమయంలో పొలాల్లో పని చేయకుండా సురక్షి త ప్రాంతాల్లో ఉండాలి. అత్యవసర పరిస్థితుల్లో స్థానిక ప్రజా ప్రతినిధులు ,జిల్లా యంత్రాంగం, పోలీసు, అగ్నిమాపక శాఖ,విద్యుత్ అధికారులకు వెంటనే సమాచారం అందించాలివాహనదారులు నీటితో నిండిన రహదారులపై వేగంగా ప్రయాణించకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.ప్రభుత్వం, వాతావరణ శాఖ, జిల్లా అధికార యంత్రాంగం జారీ చేసే అధికారిక హెచ్చరికలను పాటించాలి.ఏదైనా ప్రమాదం లేదా సహాయం అవసరమైతే గ్రామ పంచాయతీ, మున్సిపల్ అధికారులు లేదా స్థానిక ప్రజాప్రతినిధులను వెంటనే సంప్రదించాలి.

పు అతి భారీ వర్షాలు పడే అవకాశం

అత్యవసర పరిస్థితులు ఎదురైతే జాగ్రత్తలు తీసుకోవాలి
వెంటనే కంట్రోల్ రూమ్ నంబర్ 7989193131 కు సమాచారం అందించాలి
జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్

జగిత్యాల బ్యూరో ప్రభాత వార్త:

వాతావరణ శాఖ హెచ్చరికల మేరకు 2026 జూలై 30 తేదీన జిల్లాలో అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు జిల్లా యంత్రాంగం పూర్తిస్థాయిలో అప్రమత్తంగా ఉందని, ప్రజలకు తక్షణ సహాయం అందించేందుకు కలెక్టరేట్‌లో 24 గంటల కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అత్యవసర అవసరాలు మినహా బయటకు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, లోతట్టు ప్రాంతాల ప్రజలు మరింత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అలాగే వాగులు, వంకలు, చెరువులు, నీటి ప్రవాహాలు అధికంగా ఉన్న ప్రాంతాల్లోకి వెళ్లకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని తెలిపారు.వర్షాల కారణంగా ఎలాంటి అత్యవసర పరిస్థితులు, ఇబ్బందులు ఎదురైనా వెంటనే 7989193131 నంబర్‌కు సమాచారం అందించాలని జిల్లా కలెక్టర్ కోరారు. అందిన ప్రతి ఫిర్యాదుపై సంబంధిత శాఖల అధికారులు వెంటనే స్పందించి

మండల, గ్రామ అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్ష సమావేశం

బీర్ పూర్ ప్రభాత వార్త:



తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఆదేశాల మేరకు బుధవారం రోజున మండల ప్రజా పరిషత్ బీర్పూర్ కార్యాలయంలో మండల స్థాయి అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. నియోజకవర్గ ప్రత్యేక అధికారి జిల్లా పంచాయతీ అధికారి డిపిఓ మరియు గ్రిట్ డీఈఈ ల సమక్షంలోమండల ప్రత్యేక అధికారి, అధ్యక్షతన ఈ సమీక్ష సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వివిధ శాఖల మండల స్థాయి అధికారులు తమ తమ శాఖలకు సంబంధించిన ప్రగతి నివేదికను సమావేశంలో వివరించారు. అనంతరం ప్రస్తుతం ఎల్ ఎస్ ప్రచారాన్ని దృష్టిలో ఉంచుకుని గ్రామ పంచాయతీలలో చెత్త సంక్షేమాలు నిర్వహించాలని సూచించారు. రాబోయే 10 రోజులలో బిజిఆర్ పనులకు ఆటంకం కలగకుండా తగిన చర్యలు తీసుకోవాలని సర్పంచులు కోరారు. ఈ ఈ సమావేశానికి ఎంపీడీవో భీమేష్ ఎం.పీ.ఓ మధుసూదన్ మరియు మండల స్థాయి అధికారులు వివిధ గ్రామాల సర్పంచులు, తదితరులు పాల్గొన్నారు.